గురువారం
13-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 143
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గ్రీస్ కొత్త అధ్యక్షుడు టసౌలస్

ఏథెన్స్: గ్రీస్ నూతన అధ్యక్షుడిగా పార్లమెంటు మాజీ స్పీకర్ కాన్‌స్టాంటినోస్ టసౌలస్ ఎన్నికయ్యారు. 300 స్థానాలున్న పార్లమెంటులో టసౌలస్‌కు 160 ఓట్లు లభించాయి. మొత్తంగా 276 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. 11 మంది న్యూ లెఫ్ట్ ఎంపీలతో సహా 24 మంది గైర్హాజరయ్యారు. చివరి రౌండ్‌లో మెజారిటీ కోసం 151 ఓట్లు అవసరం కాగా అప్పటికే న్యూ డెమొక్రసీ వద్ద 156 స్థానాలు ఉండటంతో టసౌలస్ విజయం ఖరారైంది. ఇక ప్రధాన ప్రతిపక్ష పార్టీ పీఏఎస్ఓకే మద్దతున్న టసోస్ గియానిస్టిస్‌కు 34 ఓట్లు రాగా లెఫ్టిస్ట్ సిరిజా, న్యూ లెఫ్ట్ అభ్యర్థి లౌకా కటసెలీకి 29 ఓట్లు వచ్చాయి. అలాగే నికీ పార్టీ అభ్యర్థి కాస్టాస్ కిరియాకౌకు 14 ఓట్లు లభించాయి.

ఐక్యతతోనే లౌకికవాదం మనుగడ



- ప్రజలు కోరేది హిందూత్వ రాజ్యాన్ని కాదు
- దిల్లీలో కాంగ్రెస్-ఆప్ కలిసి పోటీ చేయాల్సింది
- పీటీఐ ఇంటర్వ్యూలో అమర్త్యసేన్

శాంతినికేతన్ (పశ్చిమ బెంగాల్): లౌకికవాదం మనుగడ సాగించాలంటే ఐక్యత మాత్రమే కాకుండా బహుళత్వానికి అద్భుత ఉదాహరణగా భారత్‌ను మార్చిన అంశాలపై ఒప్పందం అవసరమని నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త అమర్త్యసేన్ నొక్కి చెప్పారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య ఐక్యత ఎంతో ముఖ్యమన్నారు. ఈ పార్టీలు అవగాహన కుదుర్చుకోవడం ద్వారా దిల్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తే బాగుండేదని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలోని తన పూర్వీకుల ఇంట్లో పీటీఐకి అమర్త్యసేన్ ప్రత్యేక ఇంటర్వ్యూ వచ్చారు. 'దిల్లీ ఎన్నికల ఫలితం అతిశయోక్తిగా ఉండకూడదన్నారు. ఆప్ గెలిచి ఉంటే, ఆ విజయానికి ప్రాధాన్యత ఉండేది' అని తెలిపారు. ఆప్‌కు ఎదురుదెబ్బ వెనుక కారణాలను లోతుగా పరిశీలించిన ఆయన... ప్రజలు హిందూత్వ రాజ్యాన్ని కోరుకోలేదని, ఈ భావజాలాన్ని వ్యతిరేకించే వారి మధ్య ఐక్యత లేకపోవడంతో ఇలాంటి ఫలితం చూడాల్సి వచ్చిందన్నారు. 'చాలా సీట్లలో ఆప్ కంటే బీజేపీకి ఆధిక్యత తగ్గింది. కాంగ్రెస్ పొందిన ఓట్ల కంటే ఈ పార్టీకి తగ్గాయి' అని చెప్పారు. తాజా పరిణామాల క్రమంలో ఆప్ నిబద్ధత ప్రశ్నార్థకమైందని అన్నారు. 'ఆప్ పూర్తిగా లౌకికవాద పార్టీగా భరోసా ఇవ్వలేకపోయింది. హిందూత్వకు పెద్దపీట వేయడం వల్ల మతతత్వానికి వ్యతిరేకంగా ఆప్ ఏ మేరకు కట్టుబడి ఉందో స్పష్టం కాలేదు' అని అమర్త్యసేన్ అన్నారు. పాఠశాల విద్య, ఆరోగ్య సంరక్షణపై ఆప్ ప్రయత్నాలను ప్రశంసించారు. వీటిలో కాంగ్రెస్ భాగస్వామ్యం కావాల్సిందన్నారు. తన కుమార్తె దిల్లీలో ఉంటారని, ఆమె కుటుంబం పాఠశాల విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాలలో ఆప్ ప్రయత్నాలను ప్రశంసిస్తున్నారని అమర్త్యసేన్ తెలిపారు. ఆప్‌తో కాంగ్రెస్ కలిసి నడిస్తే దిల్లీ ఫలితం వేరుగా ఉండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దిల్లీలో ప్రజా సేవలపై ప్రతిపక్షాలు దృష్టి పెట్టలేదని చెప్పారు. లౌకికవాద అంశాలపై ఆప్ మరింతగా దృష్టి సారిస్తే బాగుండేదని చెప్పారు. ఇండియా ఐక్య సంఘటనతో ఉన్న ఆప్ దిల్లీ పోరులో ఓడిపోకూడదు కానీ ఓడిపోయిందని, ఇందుకు ఆ పార్టీ నుంచి లౌకికవాదంపై స్పష్టత కొరవడమే కారణమని ఆయనన్నారు. భారత రాజకీయాలపై దిల్లీ ఎన్నికల ఫలితం ప్రభావం ఏ మేరకు ఉంటుందన్న ప్రశ్నకు ఉత్తరప్రదేశ్

- మిగతా 2 లో

ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం

విశాలాంధ్ర-హైదరాబాద్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ విమర్శించారు. సంఘ ఖైరతాబాద్ నియోజకవర్గ కమిటీ సమావేశం బుధవారం జూబ్లీహిల్స్ గురుబ్రహ్మ కాలనీలో జరిగింది. ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తున్న పాలకులపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు హామీలు

- మిగతా 2 లో

తప్పిదాలకు తావులేదు: సీఈసీ

న్యూదిల్లీ: లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ డేటా తారుమారు అయ్యేందుకు ఆస్కారం లేదని సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టంచేశారు. సార్వత్రిక సమరానికి సంబంధించి ఎన్నికల సంఘం విడుదల చేసిన పోలింగ్ డేటాలో తేడాలు ఉన్నాయంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఖండించారు.

'లోక్‌సభ 2024 అట్లాస్' ప్రారంభోత్సవంలో రాజీవ్ కుమార్ మాట్లాడుతూ 'పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో సహా లక్షలాది మంది సిబ్బంది పోలింగ్ డేటాలో పాలు పంచుకుంటారు. కాబట్టి, పొరబాటు జరగడానికి ఆస్కారం ఉండదు' అని అన్నారు.

హిందువులకు చేసిందేమిటి?



- కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై కూనంనేని ధ్వజం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు
- ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే...

విశాలాంధ్ర-హైదరాబాద్ : పదేళ్లుగా కేంద్రంలో అధికారం చెలాయిస్తూ హిందుత్వ మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం అదే హిందువుల అభ్యున్నతికి ఏమి చేసిందో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' అంటూ దేశంలో 99 శాతంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల బతుకులను నాశనం చేస్తూ, కేవలం ఒక శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులకు సంపద అంతా దోచిపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో బుధవారం మీడియాతో కూనంనేని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలకులకు హిందువులపైన, ఇతరులపైన అభిమానం లేదని, కేవలం మతాలను, కులాలను అడ్డం పెట్టుకుని అధికారం చెలాయించడమే వారి లక్ష్యమన్నారు. బీజేపీ నేతలు చెబుతున్న రామరాజ్యం అంటేనే అందరిని సమానంగా చూడడమని, మరి వారు చెబుతున్నది ఏమిటి, చేస్తున్నదేమిటనేది ప్రజలు గమనించాలని కోరారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రగతిశీల శక్తులు, లౌకిక పార్టీలు కలిసి ఇండియా ఐక్య సంఘటనగా రాజకీయంగా బీజేపీ బలాన్ని తగ్గించగలిగామని ఆయన తెలిపారు. అయితే ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి కారణంగా మళ్లీ బీజేపీ బలం పుంజుకోవడం ఈ దేశానికే అత్యంత ప్రమాదకరంగా మారనుందన్నారు. దిల్లీలో ఆప్ ఓడిపోవడంతో బీజేపీ మరింత రెచ్చిపోయే అవకాశం లభించిందని, ఇందుకు ఇండియా ఐక్య సంఘటనకు పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీతో పాటు కూటమిని కాదని ఒంటరిగానే బరిలోకి దిగుతామని మొండి వైఖరి అవలంభించిన ఆప్ అధినేత కేజ్రీవాలే కారణమని కూనంనేని స్పష్టం చేశారు. ఆప్ కేవలం 2 శాతం ఓట్ల తేడాతో దిల్లీలో అధికారం కోల్పోయిందని, అదే కాంగ్రెస్‌కు 6 శాతం ఓట్లు వచ్చాయని, ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసి ఉంటే తప్పక మరోసారి ఆప్ అధికారం చేపట్టేదని తెలిపారు. అయితే కేజ్రీవాల్‌పై ఉన్న కేసులను అడ్డం పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఆయనను బెదిరింపులకు గురిచేసిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఉదారభావంతో వ్యవహరించి ఇండియా ఐక్య సంఘటనను ఏకతాటిపై నడిపేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీజేపీ మరింత బలపడి దేశ ప్రజాస్వామ్యానికే తీవ్ర ముప్పుగా మారుతుందని చెప్పారు. చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం సంస్థ ముసుగు ధరించి దాడిచేయడం గర్హనీయమని కూనంనేని అన్నారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ప్రేరణతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని, నిందితులను తక్షణమే గుర్తించి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులనే పేరుతో ఈ దేశ ప్రజలపై యుద్ధం ప్రకటించి వారిని అత్యంత కిరాతకంగా మట్టు పెడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధికారికంగా ప్రకటించడం దుర్మార్గమని అన్నారు. ఇది అంతర్జాతీయ

- మిగతా 2 లో

కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్‌కుమార్ దోషి

దిల్లీ కోర్టు సంచలన తీర్పు

న్యూదిల్లీ: సంచలనం సృష్టించిన 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి తండ్రీకొడుకులను తగులబెట్టిన కేసులో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. ఈ నెల 18న ఆయనకు ఏ శిక్ష విధించాలనేది ఖరారు చేయనున్నట్లు కోర్టు తెలిపింది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన ఒక కేసులో సజ్జన్ కుమార్ ఇప్పటికే జీవితఖైదు అనుభవిస్తున్నారు. సజ్జన్‌కుమార్‌ను బుధవారం రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టగా... ప్రత్యేక జడ్జి కావేరీ భవేజా ఆయన్ని ఈ కేసులో దోషిగా తేలుస్తూ తీర్పునిచ్చారు. అయితే శిక్ష ఖరారుపై వాదనలను

- మిగతా 2 లో

ఉచితాలు మంచిది కాదు

రాజకీయ పార్టీలకు సుప్రీం చురకలు

న్యూదిల్లీ: ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ప్రకటించడం మంచిది కాదని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం... ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్టవశాత్తూ వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలి. ఉచితాల ద్వారా అలా జరుగుతోందా? ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదు' అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే పనిలో ఉందని, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు అనేక సమస్యలు పరిష్కరించాలని యోచిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ధర్మాసనానికి తెలిపారు.

దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌ను మరో ఆరు వారాల తర్వాత విచారిస్తామని వాయిదా వేసింది.

గ్రూప్-2 మెయిన్స్ హాల్ టికెట్లు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 హాల్ టికెట్లు గురువారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఏపీపీఎస్సీ సెక్రటరీ ఐ.నరసింహమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న మెయిన్స్ (ఆబ్జెక్టివ్ టైప్) పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు (పేపర్-1), సాయంత్రం మూడు నుంచి 5.30 గంటల వరకు (పేపర్-2) రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో నిర్వహిస్తారన్నారు. హాల్

- మిగతా 2 లో

సహకార బంధం బలోపేతం

వ్యూహాత్మక భాగస్వామ్యంతో మరింత ముందుకు

మోదీ, మాక్రాన్ సంకల్పం

పారిస్: కలిసికట్టుగా ముందుకెళ్లాలని, అంతర్జాతీయ వేదికలపై సహకారాన్ని పెంచుకోవాలని భారత్, ఫ్రాన్స్ నిర్ణయించాయి. తమ మధ్య వ్యూహాత్మక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సంకల్పించాయి. వాణిజ్యం, పెట్టుబడుల్లో వృద్ధిని ఆశించాయి. ఇండో-పసిఫిక్ శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఆ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో బుధవారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలతో పాటు అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాదేశిక అంశాలనూ చర్చించారు. ఆపై భారత్ నూతన కాన్సులేట్‌ను ఇద్దరు నాయకులు కలిసి ప్రారంభించారు. గ్రేట్ వార్‌లో అమరులైన భారతీయ సైనికులకు నివాళులర్పించారు. మోదీకి మార్సెల్లీ సమీపంలోని కోస్తా పట్టణం కాస్సిస్‌లో మాక్రాన్ విందు ఇచ్చారు. భారత్‌కు రావాలంటూ మాక్రాన్‌ను మోదీ ఆహ్వానించారు. ఇద్దరు నేతలు తమ మధ్య సయోధ్యను మరింత పెంచుకోవాలని నిర్ణయించారు. ఈయూ-భారత్ సంబంధాల బలోపేతానికి సంకల్పించారు. యూఏఈతో, ఆస్ట్రేలియాతో త్రికోణ సహకారంలో వృద్ధిని

- మిగతా 2 లో

రాజ్యసభకు కమల్ హాసన్?

చెన్నై: మక్కల్ నిది మయ్యమ్ (ఎంఎన్ఎం) పార్టీ అధినేత, విశ్వనటుడు కమల్ హాసన్‌ను అధికార డీఎంకే పార్టీ రాజ్యసభకు పంపనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్... తన కేబినెట్ మంత్రి శేఖర్ బాబు ద్వారా కమల్ హాసన్‌కు సమాచారం పంపినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జులైలో డీఎంకే పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం పూర్తి కానుంది. దీంతో కమల్ హాసన్‌ను పెద్దల సభకు పంపేందుకు డీఎంకే సన్నాహాలు చేస్తోంది. గతేడాది మే మాసంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకేతో మక్కల్ నిది

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఓబీసీలకు 42 శాతం కోటా

- అసెంబ్లీలో బిల్లు ఆమోదిస్తాం
- పార్లమెంట్‌లో కేంద్రంపై ఒత్తిడి: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. కులగణనపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత మార్చిలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి ఓబీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదింపచేస్తామని వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు. అన్ని రాజకీయ పక్షాల మద్దతు తీసుకోవడంతో పాటు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న ప్రతి పార్టీ పెద్దలను కలిసి మద్దుతు అడుగుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్వర్యంలో ప్రతినిధి బృందం దిల్లీ వెళ్తుందన్నారు. ప్రధాని మోదీని కలిసి విజ్ఞప్తి చేస్తామని వివరించారు. గత సర్వేలో 3.2 శాతం మంది తమ వివరాలు ఇవ్వలేదని, వారికి మరో అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు.

ఈ నెల 16 నుంచి 28 వరకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, పల్లా వంటి వారు ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వలేదన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాల నమోదు కోరితే అధికారులు వారి ఇంటికి వెళ్లి అన్ని వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఆన్ లైన్ ద్వారా కూడా కుటుంబ వివరాలు నమోదుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా లక్ష మందికి పైగా సిబ్బందితో శాస్త్రీయంగా సమగ్ర ఇంటింటి సర్వే చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో ఏఏ వర్గాల జనాభా ఎంతో శాసనసభలో లెక్కలతో సహా సీఎం వివరించారని, చర్చ కూడా జరిగిందని తెలిపారు. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు 56 శాతం ఉన్నట్టు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

కార్పొరేట్లకే మోదీ మేలు

మద్దతు ధర చట్టం చేయాలి

రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పష్య పద్మ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ములుగు జిల్లా ప్రథమ మహాసభ జంపాల రవీందర్ అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మోదీ కార్పొరేట్ యాజమాన్యాలకే మేలు చేస్తున్నారని, అన్నదాతలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ములుగు జిల్లా నుంచి దూర ప్రాంతాలకు సాగు నీరు తరలిస్తున్న పాలకులు ఈ జిల్లాలో ఉన్న చెరువులకు ఎందుకు అనుసంధానం చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. మంత్రి చొరవ తీసుకొని అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గులవాగుపై డ్యాం నిర్మిస్తే మూడు వందల ఎకరాల భూమికి సాగునీరు అందుతుందన్నారు. పొట్లాపూర్ వద్ద ఏదుళ్ల చెరువు నుంచి నర్సంపేట, రంగాయ చెరువుకు తరలిస్తున్న నీటిని, ఏదుళ్ల వద్ద చెక్ పాయింట్ పెడితే వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వాజేడు మండలం మోడికుంట వాగు, ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాలలో నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలని సూచించారు. రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలకు పూర్తిగా అండదండలు అందిస్తామని చెప్పారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జంపాల రవీందర్,సారంగపాణి, మామిడాల సమ్మిరెడ్డి, మంద సదాలక్ష్మి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ

- మిగతా 2 లో

ట్రంప్ పలస్తీనా ప్రణాళిక ఆక్షేపణీయం

2లో



జైళ్లే కమ్యూనిస్టులకు నారు మడులు

ఇరవయ్యవ శతాబ్దం రెండవ మూడవ దశాబ్దాల కాలంలో కమ్యూనిస్టు భావజాలం వేగంగా విస్తరించినా కమ్యూనిస్టులు కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి అవకాశాలు చాలా పరిమితం. ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించేది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

అమెరికా నిష్క్రమణతో బర్డ్‌ఫ్లూ వేళ
డబ్ల్యూహెచ్ఓకు కమ్యూనికేషన్ సవాళ్లు

జెనీవా: అమెరికా నిష్క్రమణతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) చిక్కుల్లో పడింది. బర్డ్ ఫ్లూ విజృంభిస్తున్న సమయంలో 'కమ్యూనికేషన్' సవాల్‌గా మారింది. జెనీవాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను డబ్ల్యూహెచ్ఓ అధికార ప్రతినిధి క్రిస్టియన్ లిండ్‌మేయర్ తెలిపారు. 'కమ్యూనికేషన్ అన్నది సవాల్‌గా మారింది. సంప్రదాయ పద్ధతిలో సంప్రదింపులు జరిపే దారి మూసుకుపోయింది' అని అన్నారు. మరిన్ని వివరాలు తెలిపేందుకు ఆయన నిరాకరించారు. కాగా, 2024 ఏప్రిల్ నుంచి అమెరికాలో హెచ్5ఎన్1 బర్డ్‌ఫ్లూ ఉంది. 70 మందికి

సోకింది. మనుషుల నుంచి మనుషులకు ఈ వ్యాధి వ్యాపిస్తుందని చెప్పేందుకు బలమైన ఆధారాలు లేనప్పటికీ పక్షులు, కోళ్లు, పశువులు ద్వారా సోకే ప్రమాదం ఉందని నిపుణులు తెలిపారు. పక్షులు, కోళ్లు, పశువుల నుంచి మనుషులకు స్వల్ప ముప్పు ఉందని అమెరికాలోని వ్యాధి నిరోధక కేంద్రాలు (సీడీసీ) హెచ్చరించాయి. అయితే అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే డబ్ల్యూహెచ్ఓతో అమెరికా తెగతెంపులు చేసుకున్నది. ఈ క్రమంలో వైరస్‌ల సమాచారం ఆగిపోవడంపై కొన్ని దేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముందస్తు సమాచారం ఉంటే తదుపరి మహమ్మారిని నిరోధించడానికి వీలు పడుతుందని లేని పక్షంతో ముప్పు పెరుగుతుందన్న భయం ఆయా దేశాల్లో ఉంది. అమెరికాలోని నెవడా రాష్ట్రంలో పాడి పశువుల్లో బర్డ్ ఫ్లూ సెకెండ్ స్ట్రెయిన్‌ను ఇటీవల గుర్తించడంతో ఈ భయం మరింతగా పెరిగింది.

అమెరికా సాయం లేక అఫ్ఘాన్ క్లినిక్‌లు బంద్

కాబూల్: అఫ్ఘనిస్థాన్‌కు అమెరికా మానవతా సాయం నిలిచిపోయింది. దీంతో తూర్పు ఘూజ్నీ, సెంట్రల్ బమియన్ ప్రావిన్సులపై తీవ్ర ప్రభావం పడింది. ఆ రెండు ప్రావిన్సుల్లో మొత్తం 41 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మూతబడ్డాయి. ఘూజ్నీ ప్రావిన్స్‌లో 15 చిన్న క్లినిక్‌లు, మూడు ప్రధాన ఆరోగ్య కేంద్రాలు, 17 మొబైల్ క్లినిక్‌లు, ఒక సేఫ్టీ సెంటర్, రెండు మెడికల్ క్లినిక్‌లతో సహా మొత్తం 39 ఆరోగ్య కేంద్రాలు మూతబడినట్లు అక్కడి సమాచార శాఖ డైరెక్టర్ ముల్లా హమీదుల్లా నిసార్ వెల్లడించారు. అలాగే బమియన్ ప్రావిన్స్‌లో రెండు ఆరోగ్య కేంద్రాలు మూతబడ్డాయని అక్కడి ప్రభుత్వ అధికార ప్రతినిధి సబూర్ సింఘానీ తెలిపారు. అమెరికా సాయం నిలిచిపోవడమే ఈ పరిస్థితికి దారి తీసిందన్నారు. అయితే మానవతా సాయాన్ని అమెరికా ఆపేసిన తర్వాత అఫ్ఘనిస్థాన్‌లోని 50 సహాయ సంఘాలు తమ కార్యకలాపాలను నిలిపివేశాయి.

ట్రంప్ పలస్తీనా ప్రణాళిక ఆక్షేపణీయం

యుగోస్లేవియా న్యూ కమ్యూనిస్టు పార్టీ

యుగోస్లేవియా: పలస్తీనా కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రూపొందించిన ప్రణాళిక ఆక్షేపణీయమని యుగోస్లేవియా న్యూ కమ్యూనిస్టు పార్టీ (ఎన్‌కేపీజే) తెలిపింది. పలస్తీనా ప్రజలపై మారణహోమానికి కొనసాగింపుగా ట్రంప్ ప్రణాళిక ఉన్నట్లు ఓ ప్రకటనలో దుయ్యబట్టింది. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని, అంతర్జాతీయ చట్టానికి, పలస్తీనా ప్రజల ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనదని విమర్శించింది. ఇజ్రాయిల్ దురాక్రమణకు చేయూతనిస్తూ వర్ణ వివక్ష విధానం అమలునకు దోహదమయ్యేలా ట్రంప్ ప్రణాళిక ఉన్నట్లు పేర్కొంది. పలస్తీనా ప్రజలపై దశాబ్దాలుగా సాగుతున్న దురాక్రమణ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. స్వేచ్ఛగా, స్వయంప్రతిపత్తితో జీవించేలా సార్వభౌమత్వం, వెస్ట్ బ్యాంక్, గాజా, ఈస్ట్ జెరూసలేంతో సహా పలస్తీనా భూభాగానికి విమోచనం కల్పించాలని నొక్కిచెప్పింది. పలస్తీనా స్వాతంత్ర్య సమరయోధులకు సంపూర్ణ మద్దతును ఎన్‌కేపీజే ప్రకటించింది. పలస్తీనా కమ్యూనిస్టు పార్టీకి, పలస్తీనా ప్రజల పార్టీకి, న్యాయం-సమానత్వం-విమోచనం కోసం పోరాడుతున్న ప్రగతిశీల దళాలకు సంఘీభావం తెలిపింది.

వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి, దురాక్రమణకు వ్యతిరేకంగా న్యాయమైన హక్కుల కోసం పలస్తీనియన్ల పోరాటానికి అండగా నిలుస్తామని ఎన్‌కేపీజే ప్రకటించింది. పలస్తీనా ప్రజలకు న్యాయం కోసం ఐక్యంగా పోరాడదామంటూ అంతర్జాతీయ సమాజానికి, పిలుపునిచ్చింది. స్వేచ్ఛ, న్యాయం కోసం పలస్తీనా ప్రజల పోరాటం వర్ధిల్లాలి! అంతర్జాతీయ సంఘీభావం వర్ధిల్లాలి! సామ్రాజ్యవాదం, జియోనిజం నశించాలి! అంటూ యుగోస్లేవియా న్యూ కమ్యూనిస్టు పార్టీ నినాదాలిచ్చింది.

ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడం... అమలును మర్చిపోవడం నీచ స్వార్థ రాజకీయాలకు తార్కాణమని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి, విద్య, వైద్యం, ఉద్యోగకల్పన ప్రతిపాదనలన్నీ డొల్లగానే ఉన్నాయని వాపోయారు. మోదీ ప్రభుత్వ పదేళ్లకాలంలో ఉద్యోగాల కల్పనే లేదని అన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నానాతంటాలు పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు అన్యాయం చేశారనే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించారన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మర్చిపోవద్దని హితవు పలికారు. నిరుద్యోగ భృతి రూ.3,116 హామీని తక్షణమే అమలు పరచాలని అన్నారు. గ్రామీణ, జిల్లా స్థాయి నుంచే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి యువతను సన్నద్ధత చేయాలన్నారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ నిరంతరం సమాజంలోని అంతరాలపై యువత పోరాడాలని, సమసమాజ స్థాపన కోసం పాటుపడుతున్న వామపక్ష పార్టీలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. సంఘ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అరుణ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ నూతన కమిటీ ఏకగ్రీవం

ఏఐవైఎఫ్ ఖైరతాబాద్ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్యాణ్, కార్యదర్శి ఎం. భగత్ సింగ్, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఆజాద్, రమేష్, రవి, సహాయ కార్యదర్శిగా కె. నాగరాజు, బాలపేరు మల్లేష్ సభ్యులుగా నవీన్ కుమార్, రాముడు, కె. నర్సింహా లతో పాటు 13 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

హిందువులకు చేసిందేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

న్యాయసూత్రాలకు విరుద్ధమని, దీనిపై అంతర్జాతీయ న్యాయస్థానంతో పాటు ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని ఇందుకు కారణమైన అమిత్ షాను శిక్షించాలని కోరారు. సుప్రీం కోర్టు సైతం విచారణ చేసి కారకులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల అన్ని చర్యలను తాము సమర్థించడంలేదని, ప్రజల కోసమని అడవి బాట పట్టి పోరాడుతున్న మావోయిస్టులు అసలు ఎందుకు చనిపోతున్నారో ప్రజలు కనీసం గుర్తించడం లేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ దేశంలో విప్లవం ద్వారా రాజ్యాధికం వచ్చే పరిస్థితులు ప్రస్తుతం లేనందున, వారు పునరాలోచన చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి సీపీఐ ముందుకు సాగుతున్నప్పటికీ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని కూనంనేని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వైఖరిపై తమ సీపీఐ పొత్తు ఆధారపడి ఉంటుందన్నారు. కాంగ్రెస్ కలిసి వస్తే ఆ పార్టీతో ముందుకు సాగుతామని, లేకపోతే సీపీఐ బలంగా ఉన్న చోట్ల ఒంటరిగా పోటీ చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. ఇదే సమయంలో బీజేపీ మినహా కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకునే ఆలోచన సైతం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించామని సాంబశివరావు వెల్లడించారు. మిగిలిన టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు చర్చలు జరుపుతున్నారని, చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తద్వారా ఆర్టీసీ కార్మికుల సమ్మెను నివారించాలని ప్రభుత్వానికి సూచించారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సంస్థ నిర్వహించాలని, ఈ విషయంలో రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగాలేదని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినా అధికారులు, మంత్రులు కనీసం సమాధానం ఇవ్వకపోవడం దారుణమని, కొందరు మంత్రులు కలిసేందుకు కూడా సమయం ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. దీనిపై ఇప్పటికే తమ నిరసనను వ్యక్తం చేశామని, ఇకనైనా ప్రజాప్రతినిధులతో అధికారులు, మంత్రులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పటికీ దానిని వివరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అంత కంటే ఎక్కువగా రుణం ఉన్న వారికి సైతం మాఫీ చేసి ఉంటే ప్రభుత్వానికి ఎంతో మంచి పేరు వచ్చి ఉండేదని, ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదో ఇప్పటికీ అర్థం కాలేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి 42 శాతం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం... సుప్రీం కోర్టులో ఉన్న 50 శాతం సీలింగ్ అధిగమించేందుకు న్యాయ పోరాటం చేయాలని సాంబశివరావు సూచించారు. కుల సర్వే సక్రమంగా లేదని వివిధ వర్గాల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నందున గ్రామ సభలు పెట్టి మరోసారి పునసమీక్షించి సరిదిద్దాలన్నారు. అక్రమ వలసల పేరుతో అమెరికా ప్రభుత్వం భారత ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గమని, దీనిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. 104 మంది భారతీయులకు అమానవీయంగా సంకెళ్లు వేసి, సైనిక విమానాల్లో దేశంలో వదలిపెడితే దీనిపై కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం, ప్రధాని ఖండించకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగం కారణంగా బతుకు దెరువు కోసం ఏజెంట్ల మాయమాటలు నమ్మి అప్పులు చేసి మరీ వలస వెళుతున్నారని అన్నారు. నిరుద్యోగులు మోసపోకుండా ఏజెంట్లను కట్టడి చేయాల్సిన ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారహితమని కూనంనేని విమర్శించారు.

అదానీ అవినీతిపై మోదీ ప్రకటన చేయాలి

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అదానీ అవినీతిపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా మళ్లీ ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మన దేశంలో అవినీతి కార్యక్రమాలకు పాల్పడిన అదానీకి సహాయం చేసేలా ఫారెన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్-1977 అమలును ఆరు నెలలపాటు నిలిపివేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేయడాన్ని రామకృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. దేశంలో అదానీకి వత్తాసుగా ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే అన్ని రకాలుగా సహాయం చేస్తున్నారని విమర్శించారు. గతంలో హిండెన్‌బర్గ్ నివేదికపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు చర్చను లేవనెత్తే పరిస్థితి లేకుండా చేశారన్నారు. ఇప్పుడు అదానీకి అనుకూలంగా ట్రంప్ ఈ చర్యలు చేపట్టడంలో మోదీ- ట్రంప్ కార్పొరేట్ అనుకూల విధానాలు తేటతెల్లమవుతున్నాయని వివరించారు. అదానీకి భారత్‌లో మోదీ, అమెరికాలో ట్రంప్ సపోర్టు చేయడాన్ని బట్టి చూస్తే... వారు కార్పొరేట్లతో కుమ్మక్కవ్వడానికి ఉవ్విళ్లూరుతున్నట్లు కనిపిస్తోందని, అదానీ అవినీతి కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నట్లున్నదని ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల్లో దాదాపు రూ.2100 కోట్ల లంచాలు ముట్టజెప్పి... విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారంటూ న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ కోర్టులో అదానీపై కేసు నమోదైనప్పటికీ... రెండు ప్రభుత్వాలు అదానీకి ఊడిగం చేస్తున్నారంటే... ఇంతకంటే దుర్మార్గమైన, నీచమైన అంశం మరొకటి ఉండబోదని రామకృష్ణ మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రధాని స్పందించి అదానీ అవినీతి కార్యకలాపాలపై ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యాక్సిస్ నుంచి విద్యుత్ కొనుగోలు విరమించుకోవాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు ప్రయత్నాల్ని విరమించుకోవాలని రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక విద్యుత్ భారాలు ప్రజలపై పడతాయన్న ఆలోచన చేయకుండా యాక్సిస్ సంస్థ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను అధిక ధరలకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ ఒప్పందం వల్ల రాబోయే 25 ఏళ్లల్లో వినియోగదారులపై రూ.14,186.92 కోట్ల మేర భారం పడుతుందని వివరించారు. గతంలో ఇదే సంస్థ యూనిట్ ధర రూ.3.30 చొప్పున ప్రతిపాదన చేయగా, అప్పుడు తిరస్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం..ఇప్పుడు యాక్సిస్ సంస్థతో ఒప్పందాన్ని ముందుకు తీసుకొచ్చి యూనిట్ ధరను రూ.3.80కు పెంచి కొనుగోలు చేయాలన్న ఆలోచన చేయడం సరికాదన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు మేలు చేకూర్చేలా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే యాక్సిస్ సంస్థతో ఈ ఒప్పందాలు విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని రామకృష్ణ స్పష్టంచేశారు.

ఐక్యతతోనే లౌకికవాదం మనుగడ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలపై ప్రభావం ఉండవచ్చని అమర్త్యసేన్ బదులిచ్చారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు హిందూత్వ రాజకీయాలపై సమాజ్‌వాదీ పార్టీ తరహా స్పష్టమైన వైఖరిని ఆప్ ప్రదర్శించలేకపోవడమే ఓటమికి కారణమైందని తెలిపారు. దిల్లీ ఎన్నికల ఫలితాలు ఐక్య దృక్పథం అవసరాన్ని నొక్కి చెప్పాయన్నారు. వచ్చే ఏడాది బెంగాల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం గురించి మాట్లాడుతూ, దేశంలో జరిగే ప్రతి ఎన్నిక ఇతరత్రాలపై ఎంతో కొంత ప్రభావం చూపుతుందని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో దిల్లీ తరహా పతనం జరగదని ఆశాభావం వ్యక్తంచేశారు. అవినీతి రహిత, నిజాయితీ పాలన, లౌకిక, న్యాయం ఆధారిత, సహనశీల సమాజంపై దృష్టి సారించడంతో బెంగాల్ మత ఉచ్చులో చిక్కుకోబోదని అమర్త్యసేన్ అన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందాలని, ప్రజల జీవితాలు మెరుగుపడాలని కలలు కన్నానని చెప్పుకొచ్చారు. 'ప్రతి ఒక్కరు విద్యావంతులై, దృఢమైన, నమ్మదగిన ఆరోగ్య సంరక్షణ కలిగిన దేశాన్ని చూడాలని ఉందన్నారు.

ఐక్య భారతం, ఐక్య ప్రపంచం అనే దార్శనికత అవసరమని సూచించారు. మంచి, సహనం, సహకార రాజకీయాలు... వాటి ఆధారిత విధానాలతో ఈ దార్శనికత సాధ్యమని అమర్త్యసేన్ అన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ హాల్ టికెట్లు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

టికెట్లను కమిషన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా అవకాశం కల్పించినట్లు చెప్పారు. 897 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కమిషన్ వెల్లడించింది. 331 ఎగ్జిక్యూటివ్, 566 నాన్ ఎగ్జిక్యూటివ్ ఖాళీలున్నాయి. నూతన చైర్‌పర్సన్‌గా ఉదయలక్ష్మిని నియమించడంతో పరీక్షల షెడ్యూలును జారీజేశారు. ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో ఏపీ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 పోస్టులు-4, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ 16, డిప్యూటీ తహసీల్దార్ 114, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ 28, అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఏపీ కో-ఆపరేటివ్ సొసైటీ) 16, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్) 2, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 150, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సబార్డినేట్ సర్వీస్) ఒక పోస్టు ఉంది. వీటితోపాటు వివిధ విభాగాల్లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులున్నాయి.

కార్పొరేట్లకే మోదీ మేలు

(మొదటిపేజీ తరువాయి)

అంజద్ పాష, ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, బండి నర్సయ్య, గడ్డం క్రిష్ణ, బండారి శ్రీనివాస్, నాసం, రైతు ప్రతినిధులు జక్కుల అయిలయ్య, మాతంగి శ్యామ్, ముత్తయ్య, లక్ష్మయ్య, రమేష్, సమ్మయ్య,కొక్కుల రాజేందర్,తోట సంపత్,బక్కన్న, గొంది సాంబయ్య, వెంకట్రాం, సాంబయ్య, శ్రీను, రాజబాబు, ఎల్లయ్య, గంగయ్య, రవి, రాజేందర్, సాంభూ, రమేష్ పాల్గొన్నారు.

సర్వే తప్పులు ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నాం: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: కులగణన సర్వే తప్పుల తడక అని కాంగ్రెస్ సర్కార్ ఎట్టకేలకు ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీసీ జనాభాను తగ్గించి ఆయా వర్గాలను తీవ్ర మానసిక వేదనకు గురిచేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బుధవారం ట్విట్టర్ వేదికగా డిమాండ్ చేశారు. అసమగ్ర సర్వేపై బీఆర్ఎస్‌తోపాటు బీసీ సంఘాలు ముక్తకంఠంతో అభ్యంతరం వ్యక్తం చేసినా వినకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం కూడా ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలన్నారు. రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయడంతోపాటు బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం

రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేవలం తూతూమంత్రంగా తీర్మానం చేసి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకుందామంటే మాత్రం బీఆర్ఎస్ తోపాటు బీసీ సంఘాలు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నిలబెట్టుకునే వరకూ కాంగ్రెస్ పార్టీని బీసీలెవరూ నమ్మే పరిస్థితిలో లేరనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

రాబోయేది జగన్ 2.0 పాలన

కార్యకర్తల సమీక్షలో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : చంద్రబాబు నాయుడుకు ప్రతి వైసీపీ కార్యకర్త తరపున చెబుతున్నానని, మళ్లీ వచ్చేది జగన్ 2.0 పాలన అని, అన్యాయాలు చేసే వారెవ్వరినీ వదిలిపెట్టేది లేదని, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతామని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్ సమావేశమయ్యారు. జగన్ 1.0 పాలనలో మనం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలకు ముందే ఎప్పుడూ చూడని విధంగా కరోనా పరిస్థితుల మధ్యే కాలం గడిపామని ఆయన గుర్తు చేశారు. ఆ తర్వాత రెండున్నర సంవత్సరాలు కరోనా మధ్యే ఉన్నామని, ఆ సమయంలో ప్రజలకు ఎలా తోడుగా ఉండాలనే తపనతో అడుగులు వేశామని వివరించారు. అందుకే కార్యకర్తలకు చేయదగినంత చేయలేకపోయామని, ఈ సారి జగన్ 2.0లో ప్రజలకు తోడుగా ఉంటూ కార్యకర్తలకు తోడుగా వారి ఇంటికి పెద్దన్నగా ఉంటానని భరోసా ఇచ్చారు. 2019-2024 మధ్య జగన్ 1.0 ప్రభుత్వం నడిచిందని, చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా వైసీపీ హయాంలోనే నడిచిందన్నారు. బడ్జెట్‌తో పాటు సంక్షేమ క్యాలెండరును అమలు చేశామని చెప్పారు. ఒకవైపు చెప్పిన ప్రతి మాటనూ నెరవేరుస్తూ... ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ మరోవైపు రాష్ట్రంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేశామన్నారు. వైద్యంలోనూ ఊహకందని మార్పులు చేశామని, రైతును చేయి పట్టుకుని నడిపించేలా ఆర్బీకేలను తీర్చిదిద్దామని చెప్పారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ముఖ్యమని చెప్పారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అని, స్కామ్‌లు తప్ప పాలన లేని ప్రభుత్వమిదని ఆయన విమర్శించారు. ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం గెలవాలని, ఇదే వైసీపీ ఐడియాలజీ అని చెప్పారు.

కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్‌కుమార్ దోషి

(మొదటిపేజీ తరువాయి)

ఫిబ్రవరి 18వ తేదీకి వాయిదా వేశారు. 1984 నవంబర్ 1న సరస్వతి విహార్ ప్రాంతంలో తండ్రీకొడుకుల హత్య కేసులో ఆయన ప్రమేయం ఉన్నట్టు అభియోగాలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి పంజాబీ బాఘ్ పోలీసులు కేసు నమోదు చేసుకు దర్యాప్తు చేశారు. తదంతర కాలంలో ఈ ఘటనను సిట్ దర్యాప్తు చేసింది. 2021, డిసెంబర్ 16వ తేదీన సజ్జన్ కుమార్‌పై కోర్టు అభియోగాలను నమోదు చేసింది. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్యానంతరం ఒక పెద్ద గుంపు మారణాయుధాలతో విరుచుకుపడింది. సిక్కులను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున లూటీలు, గృహదహనాలకు పాల్పడింది. ఈ క్రమంలో సరస్వతి విహార్ ప్రాంతంలో అల్లరిమూక... జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్ దీప్ సింగ్‌ను హతమార్చింది. అయితే సజ్జన్ కుమార్ కేవలం ఈ అల్లర్లలో పాల్గొనడమే కాకుండా ఆ గుంపునకు నాయకత్వం వహించాడని కోర్టు తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు తగిన సాక్ష్యాలు లభించాయని తెలిపింది. ఈ తీర్పును దిల్లీ సిక్కు గురుద్వారా మేనేజిమెంట్ కమిటీ (డీఎస్‌జీఎంసీ) ప్రధాన కార్యదర్శి జగ్‌దీప్ సింగ్ కహ్లోన్ స్వాగతించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా సిట్‌ను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక దిల్లీ కంటోన్మెంట్‌లో జరిగిన మరో సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో ఆయనకు గతంలోనే యావజ్జీవ కారాగార శిక్ష పడింది. 1984 సిక్కు అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్‌ను దోషిగా నిర్ధారిస్తూ 2018లో దిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది . ఆయనకు యావజ్జీవ జైలుశిక్ష పడడంతో ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. దిల్లీలో ఓ బేకరీ యజమాని అయిన సజ్జన్ కుమార్‌కు సంజయ్ గాంధీతో దగ్గరి సంబంధాలేర్పడ్డాయి. ఆ విధంగా ఆయన దిల్లీ కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి... రాజకీయాల్లో ఎంపీ స్థాయికి ఎదిగారు. 1980లో ఔటర్ దిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1991, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అదే స్థానానికి ఆయన ఎన్నికయ్యారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజారిటీ (8,55,543) ఓట్లతో ఆయన గెలుపొందారు. అయితే.. 2018లో సిక్కుల ఊచకోత కేసులో దోషిగా కోర్టు ప్రకటించడంతో ఆయన కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

రాజ్యసభకు కమల్ హాసన్?

(మొదటిపేజీ తరువాయి)

మయ్యమ్ పొత్తు పెట్టుకొంది. ఈ ఎన్నికల్లో కోయంబత్తూరు నుంచి కమల్ హాసన్ బరిలో నిలవాలని భావించారు. కోయంబత్తూరు నియోకవర్గంలో ఆయన ఎన్నికల ప్రచారం కూడా నిర్వహించారు. కానీ ఈ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా... ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై బరిలోకి దిగారు. దీంతో సీఎం ఎంకే స్టాలిన్ సూచనతో ఎన్నికల బరి నుంచి పోటీ చేయాలనే ఆలోచనను కమల్‌హాసన్ విరమించుకున్నారు.

సహకార బంధం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

అభినందించారు. ఫ్రాన్స్, భారత్, యూఏఈ మధ్య సంయుక్త సైనిక విన్యాసాలను ప్రశంసించారు. స్వేచ్ఛ, సమ్మిళిత, సురక్షిత, శాంతియుత ఇండో-పసిఫిక్ ప్రాంతానికి కట్టుబడి ఉన్నట్లు మోదీ, మాక్రాన్ నొక్కిచెప్పారు. అంతర్జాతీయ ఏఐ రంగం ద్వారా సామాజిక, ఆర్థిక, పర్యావరణ పరంగా ప్రయోజనాలు ఉండేలా పటిష్ఠ చర్యలకు కట్టుబడి ఉన్నట్లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో సత్వరమే సంస్కరణలు చేపట్టడం అవసరమని నొక్కిచెప్పారు. యూఎన్ఎస్‌సీ వ్యవహారాలతో పాటు అనేక అంతర్జాతీయ వేదికలపై సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. యూఎన్ఎస్‌సీలో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి మాక్రాన్ తమ మద్దతును పునరుద్ఘాటించారు. భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి కట్టుబడి ఉన్నట్లు నేతలు తెలిపారు. గత 25ఏళ్లలో తమ బంధం అనేక విధాలుగా పురోగతి సాధించిందని మాక్రాన్, మోదీ వెల్లడించారు.

కుదిరిన ఒప్పందాలు

మోదీ ఫ్రాన్స్ పర్యటనను పురస్కరించుకొని రెండు దేశాల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఏఐపై భారత్-ఫ్రాన్స్ డిక్లరేషన్, భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ వత్సరం 2026 లోగా ఆవిష్కరణ వంటివి జరిగాయి. భారత్ శాస్త్రీయ సాంకేతిక విభాగం, ఫ్రాన్స్ ఇన్‌స్టిట్యూట్ నేషనల్ డి రెచెర్చే ఎన్ ఇన్ఫర్మేటిక్ ఎల్ ఎన్ ఆటోమేటిక్ (ఐఎన్ఆర్ఐఏ) మధ్య లెటర్ ఆఫ్ ఇంటెంట్... డిజిటల్ సైన్సెస్‌లో ఇండో-ఫ్రెంచ్ కేంద్రాన్ని ఫ్రాన్స్ ఏర్పాటుకు నిర్ణయాలు జరిగాయి. ఫ్రెంచ్ స్టార్టప్ ఇంక్యుబేటర్ స్టేషన్ ఎఫ్‌లో 10 భారతీయ స్టార్టప్‌ల ఆతిథ్యానికి ఒప్పందం కుదిరింది. ఆధునిక మాడ్యులర్ రియాక్టర్లు, చిన్న మాడ్యులార్ రియాక్టర్ల మధ్య భాగస్వామ్యం కోసం డిక్లరేషన్ ఆఫ్ ఇంటెట్‌పై సంతకాలు జరిగాయి. అణుశక్తి విభాతం (డీఏఈ)కి, ఫ్రాన్స్‌లోని కమిషరేట్ ఎనర్జీ అటామిక్ ఎల్ ఎనర్జీస్ అల్టర్నేటివ్ ఆఫ్ ఫ్రాన్స్ (సీఏఈ) మధ్య గ్లోబల్ సెంటర్ ఫర్ న్యూక్లియర్ ఎనర్జీ పార్ట్‌నర్‌షిప్ (జీసీఎన్ఈపీ) కోసం అవగాహన ఒప్పందాన్ని రెన్యూ చేశారు. త్రికోణాభివృద్ధిలో సహకారం కోసం ఉమ్మడి తీర్మానంపై సంతకాలు జరిగాయి. ఎకోలాజికల్ ట్రాన్స్‌షిషన్, జీవవైవిధ్యత, అడవులు, సముద్ర వ్యవహారాలు, మత్స్యశాఖ, పర్యావరణ శాఖ, అటవి, వాతావరణ మార్పు సంబంధిత శాఖల మధ్య ఒప్పందం జరిగింది.

మార్సెల్లీలో భారత కాన్సులేట్ ప్రారంభం

ఫ్రాన్స్‌లోని మార్సెల్లీ నగరంలో భారత్ కొత్త కాన్సులేట్‌ను మోదీ, మాక్రాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడకు పెద్దఎత్తున జనం చేరుకున్నారు. రెండు దేశాల జెండాలు ప్రదర్శిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు. సందడి వాతావరణంలో బటన్ నొక్కి కొత్త కాన్సులేట్‌ను మోదీ, మాక్రాన్ ప్రారంభించారు.

వారిద్దరు కలిసికట్టుగా బాల్కనీ నుంచి ప్రజలకు అభివాదం చేశారు. అంతకుముందు చారిత్రక మజార్గేస్ శ్మశానాన్ని ఇద్దరు నేతలు సందర్శించారు. గ్రేట్ వార్‌లో అమరులైన భారతీయ సైనికులకు నివాళులర్పించారు. త్రివర్ణ పుష్పగుచ్ఛంతో మోదీ అంజలి ఘటించారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోళ్ల మృతి చెందడంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వెటర్నరీ వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. చనిపోయిన కోళ్లను పరిశీలించి శాంపిల్స్ ల్యాబ్‌కు పంపాలన్నారు. అన్ని జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితిని బట్టి జోన్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు. పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలని సూచించారు. పౌల్ట్రీల వద్ద బయో సెక్యూరిటీ మేజర్స్ అమలు చేయాలన్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు సంబంధిత ప్రాంతాల నుంచి కోళ్ల రవాణా నిషేధించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఉన్నతాధికారులతో బర్డ్ ఫ్లూపై సమీక్ష జరిపారు. సమావేశానికి మంత్రి అచ్చెన్నాయుడు హాజరైయ్యారు. పశుసంవర్ధక శాఖ ఆంధ్రప్రదేశ్ సంచాలకులు టి.దామోదరనాయుడు దీనిపై పత్రికా ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం, వేల్పూరు, తూర్పు గోదావరి జిల్లా పరపలి మండలం కామాడు అగ్రహారంలో చనిపోయిన కోళ్ల నుంచి సేకరించిన సమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్‌కు పంపగా, ఏవియన్ ఇన్ఫ్లుఎంజాగా నిర్ధారించినట్లు వివరించారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేసినట్లు తెలిపారు. గ్రామాలకు కిలో మీటర్ ప్రాంతం మొత్తాన్ని అలర్ట్ జోన్‌గా ప్రకటించినట్లు వెల్లడించారు. కలెక్టర్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పోలీసు, రెవెన్యు, అటవీ, పశు సంవర్ధక తదితర శాఖలతో రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 721 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

డాక్టర్ రాజ్ పి.నారాయణంకు ఫైనాన్షియల్ ఇన్నోవేషన్ అవార్డు

ముంబై: భారతదేశంలో అత్యంత వ్యవస్థాపక అవార్డులు 2025లో ఫైనాన్షియల్ సొల్యూషన్స్ ఇన్నోవేషన్ కోసం ప్రతిష్ఠాత్మకమైన 2024 హురున్ ఇండస్ట్రీ అచీవ్‌మెంట్ అవార్డును జాగ్గిల్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ రాజ్ పి నారాయణం అందుకున్నారు. ఈ అవార్డులు తమ రంగాలను గణనీయంగా ప్రభావితం చేసిన, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడిన పరిశ్రమలలోని నాయకుల విజయాలను వేడుక జరుపుకుంటాయి. మార్గదర్శక ఆవిష్కరణలు , ఆర్థిక పరిష్కారాల రంగాన్ని మార్చడానికి ఆయన చేసిన సహకారానికి ఈ అవార్డు నిదర్శనం. డాక్టర్ రాజ్ నాయకత్వంలో, వ్యాపారాలు మరియు కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చే వినూత్న ఆర్థిక పరిష్కారాలను జాగ్గిల్ నిరంతరం అందిస్తుంది.

చేతక్ 3501, 3502లను విడుదల చేసిన సిద్ధి వినాయక బజాజ్

హైదరాబాద్: ఆటోమోటివ్ పరిశ్రమలో సుప్రసిద్ధ సంస్థ, సిద్ధి వినాయక బజాజ్, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చేతక్ 3501, 3502లను రసూల్‌పురా మెట్రో స్టేషన్ సమీపంలోని బేగంపేట చేతక్ సిఈసి షోరూమ్‌లో ఆవిష్కరించింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ కె. మంజునాథ్, చేతక్ డివిజన్ నుండి ఏరియా సేల్స్ మేనేజర్ ప్రవీణ్ పరదేశి, మేనేజింగ్ డైరెక్టర్, కె.వి.బాబుల్ రెడ్డి సహా ప్రముఖులు హాజరయ్యారు. ఎలక్ట్రిక్ మొబిలిటీలో ఒక ముందడుగును చేతక్ 3501 అండ్ 3502 సూచిస్తాయి, పట్టణ ప్రయాణ అనుభవాన్ని పునర్నిర్వచించడానికి అత్యాధునిక సాంకేతికతతో బలమైన డిజైన్‌ను మిళితం చేస్తుంది.

ఎల్‌జీ ఇండియా మెగా రక్త దానం మూడవ ఎడిషన్ ప్రారంభం

న్యూఢిల్లీ: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తమ మెగా రక్త దానం మూడవ ఎడిషన్‌ను ప్రారంభించడానికి సిద్ధమైంది. "జీవితాన్ని భాగస్వామ్యం చేసినప్పుడు జీవితం బాగుంటుంది" అనే కీలకమైన సందేశంతో కార్పొరేట్ సామాజిక బాధ్యతకు తమకు గల నిబద్ధతను శక్తివంతం చేస్తోంది. ఈ కార్యక్రమం సమాజాలను ప్రత్యేకించి యువతను సమీకరించి మరియు 70 పట్టణాలలో 400 రక్త దాన శిబిరాలను నిర్వహించే లక్ష్యాన్ని కలిగి ఉంది. 2019, 2023 సంవత్సరాలలో, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా విజయవంతంగా సుమారు 188 శిబిరాలను నిర్వహించింది, ఫలితంగా 17,700కు పైగా రిజిస్ట్రేషన్స్ నమోదయ్యాయి. ఈ విజయం ఆధారంగా, 2025 క్యాంపైన్ తమ ప్రభావాన్ని మరింత విస్తరించాలని లక్ష్యంతో, 30,000 రిజిస్ట్రేషన్స్ సాధించాలని లక్ష్యాన్ని కలిగి ఉంది.

జేఈఈ మెయిన్స్‌లో రెసోనెన్స్ విజయదుందుభి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో రెసోనెన్స్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో జూనియర్ కళాశాల విద్యార్థులు 53 మంది 99 పర్సంటైల్ పైగా స్కోర్ సాధించి చరిత్ర సృష్టించారు. ఈ అపూర్వ విజయాన్ని పురస్కరించుకుని రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) డైరెక్టర్ పుర్ణచంద్ర రావు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉత్తమ ఫలితాలకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. రెసోనెన్స్ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసోనెన్స్ మరోసారి చరిత్ర సృష్టించిందన్నారు. అత్యుత్తమ ఫలితాలతో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మా విద్యార్థుల కృషి, పట్టుదల, అంకితభావంతో దేశంలోని అత్యంత క్లిష్టమైన పోటీ పరీక్షలలో ఒకటైన జేఈఈ మెయిన్స్‌లో అసాధారణ విజయాన్ని సాధించారన్నారు. ఈ ఘనత విద్యార్థుల కృషితో అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత, మా విశ్వాసం ఉంచిన తల్లిదండ్రుల మద్దతుకు నిదర్శనం అన్నారు. ఈ అద్భుత విజయంతో రెసోనెన్స్ విద్యా ప్రామాణికత, ఉత్తమ విద్యాబోధన విధానాలపై ఉన్న నిబద్ధత మరోసారి రుజువైందన్నారు. మా సమగ్ర పాఠ్యాంశాలు, నిపుణుల మార్గదర్శకత, బోధన విధానం మా విద్యార్థులు అత్యున్నత స్థాయిలో ప్రదర్శన ఇవ్వడానికి ప్రేరేపించాయని చెప్పారు. ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల గర్వించదగిన విషయం అన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనన్నారు. మా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీలు, ఎన్ఐటీలలో ప్రవేశాలు పొందాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా అత్యుత్తమ ప్రమాణాలతో విద్యార్థులను విజయపథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

వాణిజ్య సముదాయాల పన్ను తిరిగి లెక్కించండి: మార్కపురి సూర్య

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాపులు, పరిశ్రమలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంక్ ల పై పన్ను విధింపును తిరిగి లెక్కకట్టాలని జిల్లా యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ రామగుండం నగర ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక భాస్కరరావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నోటిఫైడ్ ఏరియా అనంతరం మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయిన రామగుండం అప్పటి పాలకవర్గం రామగుండం ప్రాంతంలో అసెస్మెంట్ ద్వారా వ్యాపార వాణిజ్య సముదాయాలను స్థిరమైన పద్ధతిలో కొలతలు తీసి మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం పన్నులు విధించడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచడం జరిగిందని,అనంతరం రామగుండం కార్పొరేషన్ అప్ గ్రేడ్ అయినప్పటికీ కార్పొరేషన్ ఆదాయం మాత్రం పెరగడం లేదని అన్నారు. వచ్చే పాలకవర్గం కూడా కార్పొరేషన్ ఆదాయాన్ని ఏ విధంగా పెంచాలని దీర్ఘకాలిక ఆలోచనలు చేయడం లేదని దానిపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర ముఖ్య కార్యకర్తలు సాధుల శివ, ఆసాల నవీన్, రామవేణి సుధీర్ కుమార్, వినయ్, మహేష్ పాల్గొన్నారు.

రాముడి పేరుతో దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పైన కొంతమంది రాముడి పేరుతో రామభక్తులు అని చెప్పి దౌర్జన్యాలకు పాల్పడి దుర్భాషలాడుతూ తిట్టడం బాధాకరమని అలాంటి దొంగ రామభక్తుల పైన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశాడు. చిలుకూరు బాలాజీ టెంపుల్ అర్చకుడు నివాసం దగ్గరికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు కే రామస్వామి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం మొయినాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి శంకరపల్లి మండల కార్యదర్శి పి సుధీర్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిలు వడ్ల సత్యనారాయణ, కన్యగారి నర్సింహ్మారెడ్డి సుధాకర్ గౌడ్ బి కే ఎం యు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య వెంకటయ్య నాయకులు రఘురాం నారాయణ మధు తదితర నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కూనం నేని

సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశం సకల మతాలకు నిలయమైన దేశం అని ఆయన గుర్తు చేశారు ఇలాంటి దేశంలో రాముడి పేరుతో రాజకీయాలు రాముడు పేరుతో దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని ఇది ముమ్మాటికీ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. రాముడు అనే వాడు అందరివాడని కేవలం హిందూ మత వాదులు కొందరికే పరిమితం చేసి రాముడి పేరుతో ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు నిజమైన రామ భక్తులు ఎవరు కూడా ఇతరుల మీద దాడి చేయరని రామరాజ్యం స్థాపన అంటే దౌర్జన్యాలు కాదు అని ఆయన హితవు పలికారు రామరాజ్యంలో కష్టాలు కన్నీళ్లు మహిళలపై హింస అత్యాచారాలు ఉండవని ఈ దేశంలో అన్ని జరుగుతున్నాయని దీనిని ఎలా రామరాజ్యం అంటామని ఆయన అన్నారు నిజమైన రామ భక్తులు దేశభక్తులు కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు దాడికి పాల్పడిన వ్యక్తులపైన కఠినమైన చర్యలు తీసుకొని శిక్షించాలని మరోసారి దేశంలో రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

హామీలను నెరవేర్చే వరకు పోరు

న్యూడెమోక్రసీ నేత మధు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జే. సీతారామయ్యలు అన్నారు. బుధవారం పాల్వంచలో నవభారత కార్మిక సంఘాల సమాఖ్య ఇఫ్టు ఆధ్వర్యంలో నవభారత్ సెంటర్‌లో కార్మికులతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్న ఇప్పటివరకు హామీ ఇచ్చిన వాటిని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. ఈ రాష్ట్రంలో గత టిఆర్ఎస్ ప్రభుత్వం అవలంభించిన వైఖరినే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవలంభిస్తుందని విమర్శించారు. ఈ జిల్లాలో ప్రారంభమైన సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇక్కడ రైతులకు ఇవ్వకుండా ముగ్గురు మంత్రులు కలిసి పక్క జిల్లాకు మళ్లించడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూములు గుంజుకున్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సియం రేవంత్ రెడ్డి వాగ్దానం చేస్తూ అధికారంలోకి వచ్చాక పట్టాలు ఇస్తామన్నారని గుర్తు చేశారు. సాగు చేసుకుంటే ప్రతి పోడు రైతుకు అందగా నిలబడతామని హామీలు ఇచ్చి ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు ఒకటి నెరవేర్చలేదన్నారు. బెల్ట్రింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ ను పర్మినెంట్ చేస్తామన్నారని, కార్మికులకు సుప్రీంకోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని చెప్పి 14 నెలలు గడుస్తున్నాయన్నారు. ఇచ్చిన హామీని మరచిపోయి బాలికపు ఎస్మాలర్లు ప్రశ్నించే వారిపై ఆపా కేసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 20 చలో హైదరాబాద్ ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నేతలు రాసి నాగేశ్వరరావు, శ్రీను వినోద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాజేష్, మల్లేష్, సంపత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

విశాలాంధ్ర - గార్ల : రాష్ట్రస్థాయి గణిత సెమినార్ లో పరిశోధన పత్రం సమర్పించిన పాపావత్ యాదగిరికి తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో బుధవారం గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌లో కలకాలం ప్రయాణం వేద గణిత శాస్త్రం నుండి క్వాంటం కంప్యూటర్ వరకు ప్రధాన అంశంతో, అలుపెరుగని గణిత పయనం, వేదం నుండి అణు నాదం వరకు అనే శీర్షికతో రాసిన పరిశోధన పత్రాన్ని మర్రిగూడెం గణిత ఉపాధ్యాయుడైన యాదగిరి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రం భారతీయ చారిత్రక కట్టడాలైన కజరహో, అజంతా, ఎల్లోరా కోటల నిర్మాణాల పై గణిత సూత్రాలు మిళితమై ఉన్నాయన్నారు. గణిత ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి, గణితం సులభంగా నేర్చుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణిత ఫోరం అధ్యక్షులు షేక్ అమీన్, యం. సురేందర్ రెడ్డి, తిరు వెంకటాచార్యులు, రామనాధం, ఉపాధ్యాయులు షేక్ అమీనా, శ్రీదేవి, రామేశ్వర రావు, శ్యామల మాలతి, ఉమ, లలిత, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో 14 శాఖా గ్రంథాలయాలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లా గ్రంథాలయ సంస్థ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా 2025-26 వార్షిక బడ్జెట్ ను చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ప్రవేశ పెట్టడం జరిగింది. ఇందులో ప్రధానంగా గ్రంథాలయాల్లో మున్సిపాలిటీల్లో 14 శాఖా గ్రంథాలయాల మంజూరి గురించి, గ్రంథాలయ పన్ను 4 కోట్లు వసూలు చేయుటకు, ప్రస్తుతం ఉన్న శాఖా గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించడం భవన నిర్మాణము నిమిత్తము 15 కోట్లు కేటాయించడం జరిగింది. ప్రతి మున్సిపాలిటీలో 5 పఠన మందిరములను ఏర్పాటు చేసే విధంగా కోటి రూపాయలు కేటాయించడం జరిగింది. ఇంకను వివిధ పద్దుల కలిపి 20 కోట్ల 88 లక్షల వార్షిక బడ్జెట్ ను రూ.15 లక్షల 88 వేల మిగులుతో ఆమోదించుట రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కు పంపడం జరిగింది. ఈ కార్యక్రమములో సభ్యులు, కార్యదర్శి పి. సురేష్ బాబు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కఠిన చర్యలు

ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్

విశాలాంధ్ర బ్యూరో- ములుగు జిల్లా : ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ అధికారులను ఆదేశించారు. ఏటూరు నాగారం ఏ.ఎస్పీ శివం ఉపాధ్యాయ, బుధవారం ములుగు డి.ఎస్.పి రవీందర్, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ అధికారులు, ములుగు జిల్లా లోని మైనింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రాంతాలలోనే, రాయల్టీ రుసుము చెల్లించి, ఇసుక తవ్వకాలు చేపట్టాలని తెలిపారు. ములుగు జిల్లా గోదావరి నది పరివాహక ప్రాంతమైనందున, ఇసుక అక్రమంగా తరలించే అవకాశాలు ఎక్కువగా ఉండటం వలన, జిల్లాలోని వాగులు, నది పరివాహక ప్రాంతాలలో, ఇసుక అక్రమ తవ్వకాల ప్రాంతాలను గుర్తించి, నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆకస్మిక తనిఖీల ద్వారా, ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా, వెంటనే చట్ట ప్రకారం జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయ డం, వాహనాలను జప్తు చేయాలన్నారు. జీరో బిల్లులు, ఇతర బిల్లులు, తప్పుడు వాహనంలో రవాణా, తప్పుడు గమ్యం స్థానం, అలాంటి ఉల్లంఘన, అక్రమాలపై భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ ఎస్) విధివిధి యాక్టు, మైనింగ్ యాక్టు చట్టాల కింద కేసులు నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాన నిర్వాహకుల పేర్లను తప్పకుండా బయటకు తీసుకువచ్చి వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

టాప్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలే లక్ష్యం

అల్లాడి క్లౌడ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్ : యువ ఐటీ నిపుణులకు సాఫ్ట్‌వేర్ నైపుణ్యాన్ని అందించడం, టాప్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సహాయపడటమే లక్ష్యంగా అల్లాడి క్లౌడ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని సంస్థ కార్యాలయంలో సమగ్ర సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఈ వివరాలు వెల్లడించేందుకు సోమాజిగూడలోని కేపీ మెర్క్యూరీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాడి క్లౌడ్ ట్రైనింగ్ సీఈవో మల్లేశ్వర్ అల్లాడి మాట్లాడుతూ ఈ ప్రోగ్రామ్ ద్వారా అభ్యర్థులు ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న టెక్నాలజీల్లో నైపుణ్యాలను అందించనున్నామని చెప్పారు. ఉద్యోగ అవకాశాలు పొందేలా మార్గనిర్దేశనం చేయనున్నామని తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో ఇండస్ట్రీలో డిమాండ్ ఉన్న ప్రధాన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలను కవర్ చేయనున్నామని తెలిపారు. అవి ఏఐఎంఎల్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ %ఽ% మెషిన్ లెర్నింగ్), డేటా సైన్స్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ (జావా -పైథాన్), ఏడబ్ల్యూఎస్ డెవఆప్స్, అజ్యూర్ క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, ఆటోమేషన్ సెలీనియం టెస్టింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఎల్ఎంఎస్ పై పరీక్ష, ఫ్లట్టర్ ఉన్నాయన్నారు. ఇవి ఇండస్ట్రీ బెస్ట్ ప్రాక్టీసెస్ %ఽ% రియల్-వరల్డ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పీరియన్స్ ద్వారా బోధన జరుగుతాయని తెలిపారు. ఐదేళ్ల పైబడిన అనుభవం ఉన్న టెక్నాలజీ నిపుణులు అభ్యర్థులకు శిక్షణ అందించనున్నారని చెప్పారు. ఫుల్ టైం ట్రైనింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. అభ్యర్థులు డే టైం, ఈవెనింగ్ టైం ట్రైనింగ్ కు యాక్సెస్ పొందవచ్చన్నారు. ప్రాక్టికల్, లైవ్ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. ట్రైనీలు అడుగడుగునా అనుభవాన్ని పొందుతుంటాలతో పాటు సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. యాక్ట్ నౌ ఆత్మాదరణ ఆన్‌లైన్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అని తెలిపారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్స్ ద్వారా కూడా నేర్చుకునే అవకాశం కలదన్నారు. రికార్డ్ చేసిన క్లాసెస్, స్టడీ మెటీరియల్స్, ప్రాక్టీస్ టెస్టులు, సెల్ఫ్ అసెస్మెంట్ ఉన్నాయన్నారు. యాక్సెస్ అనుభవజ్ఞ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ మెంటార్ల ద్వారా మాక్ ఇంటర్వ్యూస్ కలవన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస శిక్షణకు అదనపు ఛార్జీలు లేవన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత యాక్ట్ నౌ అగ్రశ్రేణి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహాయపడుతుందని చెప్పారు. యాక్ట్ నౌ సొంత సాఫ్ట్‌వేర్ కంపెనీలు, అల్లాడి క్లౌడ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్రిలియంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అన్నారు. ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశమైన విధంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు కలవన్నారు. ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తయిన వారికి ఫుల్ టైం ఉద్యోగం కలదన్నారు. సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పట్ల ఆసక్తి, ప్రాథమిక ప్రోగ్రామింగ్ పరిజ్ఞానం ఉంటే మంచిదన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కుదేలైన గ్రామాలు

విశాలాంధ్ర -వనపర్తి: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలన్ని కుదేలయ్యాయని, నేడు గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం, రేషన్ కార్డుల కోసం వేలాదిగా దరఖాస్తులు ఇస్తున్నారని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు రేషన్ కార్డులు మంజూరు చేసి ఉంటే ప్రజలు ఇంత ఇబ్బందులు పడేవారు కాదని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు. నేటి ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ గ్రామాన ఇల్లు లేని నిరుపేదలు దరికి ఇందిరమ్మ ఇండ్లు, పూర్తిస్థాయిలో అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల ప్రారంభోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ పరిధిలోని గోపాల్పేట, రేవల్లి, ఏదుల మండలంలో ఆయన పర్యటించి, రహదారుల నిర్మాణాలకు, గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో సిసి రహదారుల నిర్మాణాలకు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు భూమి పూజలు చేశారు. తాడిపర్తి, చెన్నూర్, బుద్దారం, పోలికేపహాడ్, కర్మయ్యకుంట తండా, తల్పునూర్, రేవల్లి నాగాపూర్, శానాయిపల్లి, బండరావిపాకుల, అనంతపురం, ఏదుల, దీర్ఘపల్లి గొల్లపల్లి, చెన్నారం, కేశంపేట, ఏదుట్ల, గోపాల్పేట్, జయన్న తిరుమలాపూర్, మున్ననూరు గ్రామాలలో పర్యటించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ కాలనీల జలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం బేస్మెట్ లెవెల్ లో ఉన్న ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన నాలుగు, ఐదు రోజులు లక్ష రూపాయల నిధులు వారి ఖాతాలలో జమవుతాయని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఇందిరమ్మ రాజ్యంలో ఎవరు ఇబ్బంది పడకుండా చూస్తానని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతాయని ఆయన వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పర్వతాలు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

కరాటేలో డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు విజయం

విశాలాంధ్ర కాప్రా : అసాధారణ నైపుణ్యంతో కూడిన క్రీడా స్ఫూర్తితో అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ లో విజయం సాధించి మెడల్స్ పొందిన డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులను పలువురు అభినందించారు. విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ లో ఇండియా, నేపాల్ శ్రీలంక చైనా సింగపూర్ మలేషియా వంటి పలు దేశాల నుండి కరాటే పోటీలలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మాస్టర్ శివప్రసాద్ వద్ద శిక్షణ పొందిన డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారిలో సారథ్, క్రితికార్తీక్, యువన్, తియ,చందన్, నితిన్,సాత్విక్,వి.సాహితి,ఉనీషా, ప్రణవ్ ఉన్నారు. వీరిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించిందని శు భాకాంక్షలు తెలిపారు.

స్టోనా 25లో టాటా హిటాచీ ఆవిష్కరణలు

హైదరాబాద్: నిర్మాణం, మైనింగ్ పరికరాల పరిశ్రమలో ప్రముఖ పేరున్న టాటా హిటాచీ, ప్రస్తుతం బెంగళూరులోని ది బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో 2025 ఫిబ్రవరి 12 నుండి 15 ఫిబ్రవరి వరకు జరుగుతున్న స్టోనా 2025 (అతిపెద్ద రాతి ఉత్సవాలలో ఒకటి)లో పాల్గొంటోంది. ఈ ప్రదర్శన సందర్భంగా, టాటా హిటాచీ తన తాజా ఎక్స్‌కవేటర్, ఈఎక్స్350ఎల్‌సి ప్రైమ్‌ను ప్రారంభించింది. దానితో పాటు జాక్సిస్ 370ఎల్‌సిహెచ్ కూడా ప్రదర్శనలో ఉంది. టాటా హిటాచీ అత్యాధునిక యంత్రాలు అత్యుత్తమ పనితీరు, మెరుగైన ఇంధన సామర్థ్యం, అధునాతన సాంకేతికత కోసం రూపొందాయి. ఇవి రాతి పరిశ్రమకు అనువైనవిగా చేస్తాయి. వాటి మన్నిక, ఉత్పాదకతతో, అవి క్వారీయింగ్ అప్లికేషన్ల ఉద్ధృతిస్తున్న డిమాండ్లు, అవసరాలను తీరుస్తాయి. స్టోనా 2025లో ఈ భాగస్వామ్యం అత్యాధునిక సాంకేతికత, వినూత్న పరిష్కారాలు, స్థిరమైన పద్ధతులను పరిచయం చేయడం ద్వారా పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి టాటా హిటాచీ నిబద్ధతను నొక్కి చెబుతుంది.

వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ 2025లో 30 మందికి పైగా దేశాధినేతలు, గ్లోబల్ లీడర్లు

ముంబయి: పాలన, సాంకేతికత, ఆర్థిక స్థితిస్థాపకత దేశాల భవిష్యత్తును నిర్వచించే యుగంలో, వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ (డబ్ల్యుజిఎస్ 2025), దాని 12వ ఎడిషన్, రాబోయే దశాబ్దంలో ప్రపంచ పురోగతిని నడిపించే పరిష్కారాలను రూపొందించడానికి ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన నాయకులను - దేశాధినేతల నుండి సాంకేతిక దార్శనికుల వరకు సమావేశపరుస్తుంది. ఆర్థిక స్థిరత్వం, డిజిటల్ పరివర్తన, ప్రభుత్వ-ప్రైవేటు సహకారం అర్థవంతమైన మార్పును తీసుకురావడంలో పాలన గురించి పరిష్కారాలను గుర్తించడానికి మరియు విస్తరించడానికి ఫిబ్రవరి 11 నుండి 13 వరకు 30 మందికి పైగా దేశాధినేతలు, 400 మందికి పైగా మంత్రులు, 80 అంతర్జాతీయ సంస్థలు, 140 ప్రభుత్వ ప్రతినిధులు, 6,000 మందికి పైగా సమావేశమవుతారు. సాంకేతిక మార్పులు, భౌగోళిక రాజకీయ మార్పుల నేపథ్యంలో, ప్రభుత్వాలు, పరిశ్రమలు మరియు ప్రపంచ సంస్థలు ప్రభావవంతమైన మార్పును ప్రేరేపించే ప్రధాన వేదికగా డబ్ల్యుజిఎస్ నిలుస్తుంది. 2013 లో ప్రారంభమైనప్పటి నుండి, ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సమావేశం భవిష్యత్తు-కేంద్రీకృత ఆలోచనలకు ఒక వేదికగా ఉంది, నాయకులు, నిపుణులు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు ఒకచోట చేర్చి భవిష్యత్తును అంచనా వేయడానికి, రూపొందించడానికి"అని యుఏఇ క్యాబినెట్ వ్యవహారాల మంత్రి, ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సమావేశం చైర్మన్ మొహమ్మద్ అల్ గెర్గావి అన్నారు. ప్రభుత్వాలు, సమాజాలు ఎదుర్కొంటున్న వేగవంతమైన మార్పులు, ఉత్పన్నమవుతున్న సవాళ్లను పరిష్కరించడానికి ఈ ఏడాది శిఖరాగ్ర సదస్సు ప్రపంచ చర్చలను ప్రోత్సహిస్తుంది. మానవాళి పురోగతిని అంచనా వేయడం, మెరుగుదలకు అవకాశాలను గుర్తించడం, అత్యంత సమర్థవంతమైన పాలన, సుస్థిర భవిష్యత్తు ద్వారా భవిష్యత్ తరాలకు సాధికారత కల్పించడం దీని లక్ష్యం.

సువెన్ ఫార్మాస్యూటికల్స్ ఆర్థిక ఫలితాలు విడుదల

హైదరాబాద్: సువెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, టెక్నాలజీ నేతృత్వంలోని గ్లోబల్ కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ), డిసెంబర్ 31, 2024తో ముగిసిన మూడవ త్రైమాసికం, తొమ్మిది నెలలకు ఈరోజు తన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రోఫార్మా విలీన ప్రాతిపదికన, కోహాన్స్‌తో పాటు, సువెన్ హెచ్1ఎఫ్‌వై25లో గతంలో తెలియజేసిన వృద్ధి అంచనాలకు అనుగుణంగా 40% వార్షిక ఆదాయ వృద్ధిని నివేదించింది. కీలకమైన వృద్ధి చోదక శక్తి అయిన ఫార్మా సీడీఎంఓ విభాగం ఆర్ అండ్ డీ, బీడీ ప్రయత్నాల ద్వారా 101% వార్షిక వృద్ధిని నివేదించింది. త్రైమాసికంలో స్థూల మార్జిన్లు 71.5% వద్ద ఉన్నాయి. సర్దుబాటు చేయబడిన ఈబీఐటీడీఏ మార్జిన్లు 38.7% వద్ద ఉన్నాయి. సువెన్ కోహాన్స్ సంవత్సరానికి 40% ఆదాయ వృద్ధి 6.76 బిలియన్లకు, 38.7% మార్జిన్‌లతో 85% సర్దుబాటు చేయబడిన ఈబీఐటీడీఏ వృద్ధి చూపించింది.

జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్: టెస్ట్ ప్రిపరేటరీ సేవలలో దేశీయంగా ప్రముఖమైన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్), జేఈఈ మెయిన్స్ 2025 (సెషన్ 1)లో హైదరాబాద్‌కు చెందిన 23 మంది విద్యార్థులు 99 పర్సంటైల్, అంతకన్నా ఎక్కువ స్కోర్ సాధించినట్లు ప్రకటించింది. ఉన్నత స్కోర్లు సాధించిన విద్యార్థుల్లో హర్ష్ ఎ గుప్తా, కోత ధనుష్ రెడ్డి-99.97 పర్సంటైల్, సహిత పోతన, రాఘవన్ ఎవిఆర్-99.94 పర్సంటైల్, విశ్వ నవదీప్ గంధం-99.87 పర్సంటైల్, హర్షవర్ధన్ రవిచందర్-99.81 పర్సంటైల్, భరత్ నాయుడు కిలారి-99.74 పర్సంటైల్ ఉన్నారు. హర్ష్ ఎ గుప్తా భౌతికశాస్త్రం, గణితశాస్త్రంలో 100% స్కోర్ సాధించగా, కోత ధనుష్ రెడ్డి రసాయన శాస్త్రంలో 100% స్కోర్ సాధించారు. ఈ ఫలితాలు భారతదేశంలో అత్యంత క్లిష్టమైన పరీక్షలలో ఒకటైన జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల కఠోర శ్రమ, అకాడమిక్ ప్రతిభను చూపిస్తున్నాయి.

హైదరాబాద్‌లో ఈసారి డీహైడ్రేషన్ ప్రమాదం: నిపుణులు

హైదరాబాద్: వేసవి సమీపిస్తున్న కొద్దీ, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అంటు వ్యాధుల వ్యాప్తి చెందడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి, డీహైడ్రేషన్ ను ప్రమాదకరంగా మారుస్తాయి. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే వరకు ఇది గుర్తించబడదు. హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో గ్యాస్ట్రోఎంటెరాలజిస్ట్ సర్జన్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ బి. రవీందర్ రెడ్డి నిశ్శబ్ద డీహైడ్రేషన్ రహస్య ప్రమాదాలను నొక్కి చెబుతూ, "తీవ్రమైన దాహం వంటి సాధారణ హెచ్చరిక సంకేతాలను ప్రేరేపించకుండా, శరీరం ద్రవాలు, అవసరమైన ఎలక్ట్రోలైట్లను కోల్పోయినప్పుడు నిశ్శబ్ద డీహైడ్రేషన్ సంభవిస్తుంది. ఇది ముఖ్యంగా మధుమేహం ఉన్న వ్యక్తులలో ఆందోళన కలిగిస్తుంది, వారు ఇప్పటికే రక్తంలో అధిక చక్కెర స్థాయిల కారణంగా ద్రవ సమతుల్యతలో హెచ్చుతగ్గులను అనుభవించవచ్చు. తగినంత ద్రవాహారం తీసుకోక పోవడం, కఠినమైన వ్యాయామం, అధిక ఉష్ణోగ్రతలు, మద్యం సేవించడం, జ్వరం, విరేచనం మరియు వాంతులు వంటి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కారణాలు ఉండటం వల్ల డయాబెటిక్ రోగులకు డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ప్రమాదాన్ని పెంచుతాయని తెలిపారు.

ముందంజలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్, మోతీలాల్ ఓస్వాల్ షేర్లు

ముంబయి: ఐసీఐసీఐ సెక్యూరిటీస్, మోతీలాల్ ఓస్వాల్, యాక్సిస్ సెక్యూరిటీస్ సిన్ఫర్ గ్లోబల్ స్టాక్ 30%-60% పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. కంపెనీ క్యూ3 ఎఫ్‌వై25 ఫలితాల తర్వాత బ్రోకరేజ్ సంస్థలు ఐసీఐసీఐ సెక్యూరిటీస్, మోతీలాల్ ఓస్వాల్, యాక్సిస్ సెక్యూరిటీస్ సిన్ఫర్ గ్లోబల్ (ఇండియా) షేర్లను కొనుగోలు చేయాలని సిఫార్సు చేశాయి. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ రూ.2,058 సవరించబడిన టార్గెట్ ధరతో కొనుగోలు సిఫార్సును అందించగా, మోతీలాల్ ఓస్వాల్, యాక్సిస్ సెక్యూరిటీస్ తమ టార్గెట్ ధరలను వరుసగా రూ.2,000, రూ.1,645గా నిర్ణయించాయి. మంగళవారం, ఫిబ్రవరి 11, 2025న ముగింపు సమయాల నాటికి, సిన్ఫర్ గ్లోబల్ స్టాక్ ఒక్కో షేరుకు రూ.1,289.30 వద్ద ట్రేడవుతోంది. బ్రోకరేజ్ సంస్థలు నిర్ణయించిన టార్గెట్ ధరల ఆధారంగా, స్టాక్ సుమారు 27% నుండి 60% వరకు పెరుగుదలను చూడవచ్చు.

దేశవ్యాప్తంగా అమెజాన్ ఫార్మసీ మందుల లభ్యత

బెంగళూరు: తమ మార్కెట్ ప్రదేశం ద్వారా లైసెన్స్ గల విక్రేతలతో కస్టమర్లను కలపడం ద్వారా అమెజాన్ ఫార్మసీ వాస్తవమైన నిరంతర అనుభవాన్ని కేటాయించడానికి కృషి చేస్తోంది. భారతదేశవ్యాప్తంగా 100% సేవలు అందించదగిన పిన్ కోడ్స్‌లో ఆదాలు, విశ్వసనీయమైన ఇంటి వద్ద డెలివరీతో ఇంటి నుండి సౌకర్యవంతంగా ఆన్ లైన్‌లో మందులు ఆర్డర్ చేసే సదుపాయాన్ని అందిస్తోంది. మా ధృవీకరించబడిన విక్రేతల ద్వారా, వీరు ప్రిస్క్రిప్షన్ మందులు, ఓటీసీ మందులు, వైద్య పరికరాలు, సప్లిమెంట్స్, ఆరోగ్య ఉత్పత్తుల విస్తృతమైన ఎంపికను అన్వేషించవచ్చు. అమెజాన్ వారి దేశవ్యాప్తంగా ఉన్న లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి, కస్టమర్లు ఇప్పుడు ప్రముఖ మెట్రోలు, టియర్ 2 నగరాలు సహా 23 పట్టణాలలో అందుబాటులో ఉన్న అదే రోజు డెలివరీతో విస్తృత శ్రేణి మందులను పొందవచ్చు.

సంపాదకీయం

పుస్తకం మీద ఫాసిస్టు దాడి

రాజ్యాల కోసం, భూభాగాల కోసం దాడులకు దిగడం, యుద్ధాలు చేయడం ఎప్పటి నుంచో ఉంది. కానీ ఫాసిస్టులు ప్రధానంగా సంస్కృతి మీద దాడి చేస్తుంటారు. ఇలా దాడులకు దిగే వారికి ఫాసిజం అంటే ఏమిటో అవగాహన లేకపోవచ్చు. కానీ వారు ఫాసిస్టు విధానాలను అమలుచేసే పార్టీలకు, పాలకవర్గాలకు పదాతి దళాలుగా ఉపయోగపడతారు. తాజాగా తిరుపతిలో జరుగుతున్న పుస్తక మహోత్సవంలో విశాలాంధ్ర స్టాలు మీద దాడి ఫాసిస్టుల విషవమనంలో భాగమే. పెరియార్ పుస్తకాలు అమ్మినందుకు విశాలాంధ్ర పుస్తక కేంద్రంపై దాడి చేశారు. పెరియార్ ఎ.వి.రామస్వామి నాయకర్ పుస్తకాలు అమ్ముతున్నందుకు విశాలాంధ్ర మీద దాడి జరిగింది. కానీ ఫాసిస్టు భావజాలం గూడుకట్టుకున్న వారికి ఒక్క పెరియార్ మాత్రమే శత్రువు కాదు. వారి జాబితాలో హేతుబద్ధంగా ఆలోచించే చాలా మంది మేధావులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, సాంస్కృతిక కార్యకర్తలు, వివిధ కళారంగాలలో పనిచేసే వారూ ఉంటారు. తిరుపతి పుస్తక ప్రదర్శనలో మరికొన్ని పుస్తకాల దుకాణాల మీద దాడులు జరిగాయి. అంతకు ముందు ఇటీవల హైదరాబాద్ లో పుస్తక ప్రదర్శన జరిగినప్పుడు వీక్షణం సంపాదకుడు ఏర్పాటు చేసిన పుస్తక కేంద్రం మీద ఇలాగే దాడి చేశారు. జనవరిలో జరిగిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ఆఖరి రోజు వీక్షణం పుస్తక కేంద్రంపై దాడి జరిగింది. తిరుపతి వెంకటేశ్వర దేవాలయం ఇంతకు ముందు బౌద్ధ క్షేత్రం అని చెప్పే ఓ పుస్తకం అమ్ముతున్నందుకు దుండగులు దాడికి దిగారు. హిందూ వ్యతిరేక పుస్తకాలు అమ్ముతున్నారని నానా యాగీ చేశారు. ఇలాంటి పుస్తకాలు ఏ పుస్తకాల దుకాణంలోనైనా దొరకొచ్చు. పుస్తక విక్రేతలలో చాలా మందికి అమ్మకాల మీద ఉన్న దృష్టి ఆ పుస్తకాలలో ఉండే అంశాల మీద ఉండకపోవచ్చు. నిర్దిష్ట భావజాలం గల పుస్తకాలు మాత్రమే అమ్మేవారు ఉంటారు. పైగా పుస్తక ప్రదర్శనలు జరిగేటప్పుడు అక్కడ వందలాది పుస్తక కేంద్రాలు ఉంటాయి. ఇందులో వివిధ మతాలకు చెందిన గ్రంథాలూ ఉండొచ్చు. వివిధ భాషలకు చెందిన పుస్తకాలూ ఉండొచ్చు. కానీ హైదరాబాద్ లో వీక్షణం పత్రికవారు ఏర్పాటు చేసిన పుస్తక కేంద్రం మీద పనిగట్టుకుని దాడి చేయడానికి మరో కారణమూ కనిపిస్తోంది. ఆ పత్రిక సంపాదకుడు వీక్షణం మాస పత్రిక ప్రచురించడంతో పాటు యూట్యూబ్ చానల్ కూడా నిర్వహిస్తారు. ఇటీవల ఆ చానల్‌లో మనుస్మృతి మీద కొన్ని వీడియోలు చేశారు. దాడికి ఇది ప్రధాన కారణం అయి ఉండొచ్చు. పుస్తకాలు అమ్మే దుకాణాల్లో హిందూ భావజాలం ఉన్నవీ ఉండొచ్చు. ఆర్.ఎస్.ఎస్. వారూ పుస్తకాలు ఏర్పాటు చేస్తారు. అందులో హిందూయేతర మతాలను విమర్శించే గ్రంథాలు ఉండొచ్చు. మరి అప్పుడు ఎవరైనా దాడి చేస్తే సహిస్తారా? నిజానికి ఏ భావజాలానికి చెందిన పుస్తక విక్రేతల మీద దాడి చేయడం సహించకూడదు. అక్రమంగా ప్రచురించిన పుస్తకాలు అమ్ముతూ ఉన్నప్పుడు కూడా చట్టబద్ధంగా వ్యవహరించాలి తప్ప దాడులకు దిగకూడదు. ఎవరు ఏ పుస్తకాలు అమ్మాలో నిర్ణయించే అధికారం ఎవరికీ ఉండకూడదు. కానీ గత పదేళ్ల కాలంగా ఎవరు ఏం తినాలో, ఎలాంటి దుస్తులు వేసుకోవాలో కూడా నిర్దేశించే వారు ఎక్కువై పోయారు. గొడ్డు మాంసం తింటున్నారనో, అమ్ముతున్నారనో ముస్లింల మీద దాడిచేసే మూకలకు, మూక హత్యలకు పాల్పడే వారికి పుస్తకాల దుకాణాల మీద దాడి చేసేవారికి పెద్ద తేడా లేదు. ఈ రెండు రకాల వారి భావజాలం మధ్య సంపూర్ణ సామ్యం ఉంది.

పుస్తక ప్రదర్శన జరుగుతున్నప్పుడు దాడులు చేయడం బహుశః ఇదే మొదటి సారి కావొచ్చు. సైద్ధాంతిక విభేదాలు ఏ సమాజంలోనైనా ఉంటాయి. భావ సంఘర్షణ సహజం. ఇది కేవలం మతాల మధ్యనే ఉండదు. పురాణేతిహాసాల మీద కూడా విమర్శలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయిన నేల మనది. ఆ భిన్నాభిప్రాయాలు సంవాదాలకు, వాద ప్రతివాదాలకే పరిమితం అయ్యేది. నారదుడు, చిత్రగుప్తుడు, వినాయకుడి పాత్రలను కూడా అవహేళన చేసిన సందర్భాలు ఉన్నాయి. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ లోనూ తస్లీమా నస్రీన్ పుస్తకాలు అమ్ముతున్న పుస్తక కేంద్రంపై సోమవారం దాడి జరిగింది. అసలు తస్లీమా మీదే బంగ్లా దేశ్‌లోనే కాక మన దేశంలోనూ దాడులు జరిగాయి. ప్రసిద్ధ చిత్రకారుడు ఎం.ఎఫ్.హుసేన్ దేశం వదిలి వెళ్లాల్సి వచ్చింది. తమిళ రచయిత మురుగన్ ఇలాంటి దాడులే ఎదుర్కున్నప్పుడు అసలు రాయడమే మానేస్తానన్నారు. 2022 అక్టోబర్ లో మార్క్సిస్టు సాహిత్యం మీద ఇలాగే విరుచుకు పడ్డారు. ఆ సందర్భలో కొంతమంది కమ్యూనిస్టు నాయకులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేసింది కూడా. అసహనం ఒక్క సంఘ్ పరివార్ కే పరిమితం కాదని బెంగాల్ సంఘటన రుజువు చేస్తోంది. ఇంకా ముందుకెళ్తే 2003 జనవరి అయిదున భండార్కర్ ఓరియంటల్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ పై దాదాపు వందమందితో కూడిన మూక దాడి చేసింది. ఆ మూక తమది సంభాజీ బ్రిగేడ్ అని చెప్పుకుంది. భండార్కర్ సంస్థ అంతర్జాతీయంగా ప్రసిద్ధమైంది. అది కమ్యూనిస్టు భావజాలం ఉన్నదేమీ కాదు. అయినా దాడికి గురి కాక తప్పలేదు. పుణేలో మరాఠీ నాటక రచయిత రాం గణేశ్ గడ్కరి విగ్రహాన్ని కూడా కూల్చేశారు. తాము మరాఠీ ఆత్మగౌరవాన్ని కాపాడడానికి కంకణం కట్టుకున్నామని సంభాజీ బ్రిగేడ్ చెప్పుకుంది. సంభాజీ బ్రిగేడ్ కోపమంతా ఏమిటంటే అమెరికా రచయిత జేమ్స్ లయిన్ శివాజీ మీద పరిశోధన చేయడానికి భండార్కర్ సంస్థ సహకరించడమట. ఆ సందర్భంగా 68 మంది మీద కేసు నమోదైంది. పుణే సెషన్స్ కోర్టు 14 ఏళ్ల తరవాత 2017 అక్టోబర్ 28 తీర్పు చెప్పి మొత్తం 68 మందినీ నిర్దోషులుగా తేల్చింది. జరగాల్సిన నష్టమైతే జరిగింది. కేవలం పుస్తకాలు, పరిశోధనా సంస్థల మీద దాడులే కాదు. కల్బుర్గి, పన్సారే, ధబోల్కర్, గౌరీ లంకేశ్‌లను హతమారిస్తే ఎవరిని శిక్షించారు కనక. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం చూసీ చూడనట్టు ఉంటే మతం పేరుతోనో, మరో పేరుతోనో ఆగడాలకు, దాడులకు, హత్యలకు పాల్పడే వారికి మరింత ప్రోత్సాహం ఇచ్చినట్టు అవుతుంది. ఇలాంటి ఫాసిస్టు ధోరణులున్న వారికి అధికారంలో ఉన్న వారే ఫాసిస్టు భావజాలాన్ని ప్రోత్సహించే వారైతే ఇక అడ్డేమి ఉంటుంది! తిరుపతిలో జరిగిన దుర్మార్గాన్ని నిరసిస్తూ రచయితలు, మేధావులు, కళాకారులు వెంటనే స్పందించి నిరసన ప్రదర్శన చేయడం ఆహ్వానించదగిన పరిణామం. దుండగులతో ఏకమయ్యే పార్టీకి మద్దతు ఇచ్చే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు స్వీయ రక్షణ బాధ్యత స్వీకరించక తప్పదు.

ఎన్నికల్లో బీహార్, బెంగాల్ ఎటువైపు?

అరుణ్ శ్రీ వత్సవ

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తీవ్రమైన దెబ్బతగలడంతో ఆ పార్టీ ప్రధాన నాయకుడు రాహుల్ గాంధీ ముందు జాగ్రత్త పడుతున్నారు. ఈ సంవత్సరం చివరికి బీహార్, పశ్చిమబెంగాల్ అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. బీహార్‌లో ఆర్‌జేడీతో కలిసి కాంగ్రెస్ పోటీ చేస్తుంది. అంతేకాదు, ఇండియా ఐక్యసంఘటనలో భాగస్వాములైన వామపక్షాలు, ఇతర చిన్నపార్టీలు కూడా కలిసి పోటీచేసే అవకాశం ఉంది. ఢిల్లీలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు పోటీచేసిన నియోజకవర్గాలలో దళితులు పెద్దగా ఓట్లు వేయలేదు. ఈ నేపథ్యంలో తదుపరి ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటనతో కలిసి పోటీచేసి ఎలాగైనా గెలవడానికి తీవ్రంగా రాహుల్ ఆలోచిస్తున్నారు. బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ బాధ్యులను త్వరలో నిర్ణయించాలని భావిస్తున్నారు. బిహార్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడుగాఉన్న అఖిలేష్ సింగ్‌ను తప్పించి మరో నాయకుడుని నియమించాలని నిర్ణయించారు. అఖిలేష్ సింగ్ దళిత నాయకుడు. మరో 15రోజుల్లో ఈ నాయకుడుని మార్చి కొత్త వ్యక్తిని ప్రకటించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. బీహార్‌లో పార్టీ పనివిధానాన్ని పూర్తిగా మార్పుచేయాలని రాహుల్ ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎంపీ తారిఖ్ అన్వర్‌కు సంబంధించిన స్పష్టతకోసం

రాహుల్ వేచి చూస్తున్నారు. అంతేకాదు, ఆ రాష్ట్రంలో అనుసరించవలసిన వ్యూహాన్ని రచించనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుడు తీవ్రమైన అనుభవాన్ని చవిచూశారు. ఆర్‌జేడీ ప్రధాన నాయకుడు లాలూప్రసాద్ యాదవ్ కాంగ్రెస్ కోరిన నాలుగు సీట్లను తిరస్కరించారు. తమ పార్టీ తరఫున నలుగురు అంతగా తెలియని అభ్యర్థులను పోటీ చేయించారు. ఈ నలుగురు ఓటమి పాలయ్యారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ బలంగానేఉంది. కాంగ్రెస్‌కు ఆ నాలుగు సీట్లను కేటాయించి ఉన్నట్లయితే ఆ నియోజకవర్గాల్లో ఎదురుదెబ్బ తగిలేదికాదని అంచనావేశారు. ఈ సంవత్సరం ఆఖరుకు బీహార్ అసెంబ్లీకి ఎన్నిక జరుగుతుంది.

ఆ నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ కోరినవిధంగా లాలూప్రసాద్ యాదవ్ అంగీకరించి ఉన్నట్లయితే ఇండియా ఐక్యసంఘటనకు మరో నాలుగు సీట్లు వచ్చిఉండేవని సీపీఐ (ఎంఎల్) నాయకులు సైతం భావించారు. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70సీట్లు కేటాయించగా, కేవలం 19సీట్లు మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. అంతక్రితం అసెంబ్లీలో ఉన్న సీట్లకంటే కాంగ్రెస్‌కు 8సీట్లు తగ్గాయి. సీపీఐ (ఎంఎల్) 19సీట్లకు పోటీచేసి 12సీట్లు గెలుచుకుంది. సీపీఐ, సీపీఎంలు చెరో రెండుసీట్లు గెలుచుకున్నాయి. బీహార్ పీసీసీ అధ్యక్షుడు కనీసం దళితులు, ఓబీసీలు, ఈబీకేలు, ముస్లింలను గత ఎన్నికల్లో కనీసం కలుసుకోలేకపోయారు. అన్వర్ కూడా పార్టీ నిర్మాణస్వరూపంలో ఎంతమాత్రం మార్పు తీసుకోలేకపోయారు. ఆ మార్పులు ఇప్పుడు ఎంతైనా అవసరం. చౌ చౌగా మార్పుల చేయడంగాక, మౌలికంగా పూర్తిగా పార్టీలో మార్పులు తీసుకురావలసిన అవసరం ఎంతైనాఉంది. బీహార్‌లో ఇతర పార్టీలతో పొత్తుపెట్టుకుని పోటీచేయడం సాధ్యంకాకపోతే ఒంటరిగా పోటీచేయాలన్న ఆలోచన కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మధ్య తరగతి కులాలు, ఉన్నత కులాల ప్రజలు మళ్లీ కాంగ్రెస్‌వైపు రావాలని చూస్తున్నారు. అయితే కొన్నిచోట్ల కాంగ్రెస్‌పట్ల సందేహాలు కలిగిఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్‌ను బ్రాహ్మణులు, భూమిహారులు నిర్వహిస్తున్నారు. వాస్తవంగా ఈ రెండు కులాలు బీజేపీతో కలిసిఉన్నారు. ఈ కులాలకు చెందిన నాయకులే కాంగ్రెస్‌ను నడుపుతున్నారు. ఈ కులాలకు చెందిన నాయకులు ఉన్నప్పటికీ ఓటర్లను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఇండియా ఐక్యసంఘటన బలహీనంగా ఉందన్న విషయం బహిరంగ రహస్యమే.

ఇండియా ఐక్యసంఘటన బలమైన వాణిని వినిపించే స్థితిలోలేదు. బీహార్‌లో లాలూ ఆధారంగానే ఇండియా ఐక్యసంఘటన నిలిచిఉంది. రెండు నెలల క్రితమే ఇండియా బ్లాక్ అధ్యక్షురాలిగా తాను పనిచేస్తానని మమత బెనర్జీ చెప్పారు. ఆ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రస్తావిస్తున్నారు. జాతీయస్థాయిలో రాహుల్‌గాంధీ ఇండియా బ్లాక్ తరఫున పనిచేయడానికి చొరవ తీసుకోవడంలేదని మమత బెనర్జీ ఆరోపించారు. బీహార్‌లోనూ ఇదే పద్ధతిని అవలంబించవచ్చుకదా అని ఆరోపిస్తున్నారు. అయితే లాలూ, తేజస్విలు బీహార్‌లో ఇండియాబ్లాక్‌లో ఉన్న పార్టీలను కలుపుకుని బలోపేతం చేసేందుకు లాలూ, తేజస్విలు చేసినదేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇండియాబ్లాక్‌లో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ నాయకులు తరచుగా జాతీయస్థాయిలో సభలు, సమావేశాలు జరపలేదని ఆరోపిస్తుండగా, బీహార్ స్థాయిలో ఆర్‌జేడీ నాయకులు కూడా తరచూ సమావేశాలు ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. తేజస్వి కేవలం తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు ర్యాలీలు, యాత్రలు జరుపుతున్నారని కొంతమంది నాయకులు విమర్శిస్తున్నారు. బీహార్ కాంగ్రెస్ యూనిట్ చాలా బలహీనంగాఉందని రాహుల్ ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ముందుజాగ్రత్త పడుతున్నారు.

పలస్తీనా ట్రంప్ సొత్తా ?

బుద్ధిగజమీందార్

సాధారణంగా అమెరికా అధ్యక్షులుగా పదవి చేపట్టిన వారందరూ ప్రారంభ దశలో ఇజ్రాయిల్ పర్యటించటమో లేక ఇజ్రాయిల్ ప్రధానులు అమెరికాలో పర్యటించటమో పరిపాటి. పశ్చిమ ఆసియాలో ముడి చమురు ఆధిపత్యంకోసం అమెరికా బినామీగా ఇజ్రాయిల్ ప్రాతినిధ్యం వహిస్తుందనటం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో వారం క్రితం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలుసుకున్నారు. 15నెలలపాటు ఎడతెరిపి లేకుండా అమాయక గాజా ప్రజలపై కాల్పులు జరిపి సుమారు 70 వేల మందిని చంపిన నరహంతక నెతన్యాహు జనవరి 15 నాడు గాజాపై కాల్పుల విరమణకు అంగీకరించాడు. ఈ యుద్ధానికి కావలసిన ఆయుధాలన్నీ అమెరికా సరఫరా చేసింది.

నెతన్యాహు వాషింగ్టన్ పర్యటన సందర్భంగా ట్రంప్ ఎవరికీ ఆమోదయోగ్యం కాని, పలస్తీనా రాజ్యస్థాపనకు, ఓస్లో ఒడంబడికకు విరుద్ధంగా అంతర్జాతీయ చట్టాలను గౌరవించకుండా 'భవిష్యత్తు గాజా' గురించి ఒక ప్రకటన చేశాడు. ఆ ప్రకటనను అనుసరించి చనిపోగా మిగిలి ఉన్న 18 లక్షల గాజా ప్రజలు, గాజా ప్రాంతాన్ని వదిలి ఈజిప్టు, లెబనాన్, జోర్డాన్, సిరియా దేశాలకు వెళ్లిపోవాలి. అప్పుడు మూడింట రెండు వంతులు శిథిలమై నేలమట్టమైన గాజాలోని నగరాలలో, పట్టణాలలో, గ్రామాల్లో సిమెంటు స్లాబులుగా పడి ఉన్న కాంక్రీటు భవనాల్ని తొలగించి ఆ ప్రాంతాలను పర్యాటకుల కేంద్రాలుగా 20 సంవత్సరాల ప్రణాళికతో రియల్ ఎస్టేట్‌గా అభివృద్ధి చేస్తాడట. తద్వారా పలస్తీనా గాజా ప్రాంతంలో ఉద్యోగాలు, పరిశ్రమల కల్పన జరుగుతుందని ప్రకటించాడు. ట్రంప్‌కు ఎంత పొగరు? ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఒక సార్వభౌమాధికార రాజ్యాన్ని ఖాళీ చేయించాలను కోవటం? ఈ ప్రకటనతో రెచ్చిపోయిన నెతన్యాహు మొత్తం పలస్తీనా జాతిని నిర్మూలించటానికి వేసిన ఎత్తుగడగాక మరేమవుతుందిది? ఈప్రణాళిక కోసమేనా కాల్పుల విరమణ చేసింది. ధన, కండ కావరంతో ప్రపంచాన్నే శాసించవచ్చని, ప్రపంచాన్ని ఒకప్పటి వలసవాద రాజ్యంగా మార్చుకోవచ్చునని అమెరికా సామ్రాజ్యవాదం ఇప్పుడు ఫాసిస్టు పోకడలతో ట్రంప్ రూపంలో ఉగ్రరూపంగా మారటాన్ని ప్రపంచ దేశాలు గర్హిస్తున్నాయి. అంతకు క్రితం కెనడా, పనామా, గ్రీన్‌ల్యాండ్ దేశాలను అమెరికాలో కలిపేసుకొంటానన్నాడు. భారతీయులకే గాక అనేక దేశాలకు చెందిన వేలాది ప్రజల చేతులకు కాళ్లకు బేడీలువేసి క్రూరంగా మిలిటరీ విమానాల ద్వారా విదేశాలకు పశువుల మాదిరిగా పంపిస్తున్నాడు. ట్రంప్ ప్రకటనను తన మిత్ర దేశమైన ఫ్రాన్స్, జర్మనీలు గాకుండా పశ్చిమాసియా దేశాలతో పాటు టర్కీ, రష్యా, చైనాలు తీవ్ర స్వరంతో ఖండించాయి.

బీబీసీ ఒక ఆసక్తికరమైన గ్రాఫ్‌ను 2008, 2014, 2021, 2024-25 సంవత్సరాల్లో ఇజ్రాయిల్ గాజాపై జరిపిన దాడుల్లో శిథిలాల బరువును లెక్కకట్టి ప్రచురించింది. ఆ లెక్కల ప్రకారం, 2008లో 6 లక్షల టన్నుల బరువు గల శిథిలాలు, 2014 లో 20 లక్షల టన్నులు, 2021 లో 3 లక్షల 70 వేల టన్నులు. శిథిలం కాగా ఈ మొత్తానికి 17 అంతల రెట్టింపు అనగా 50 కోట్ల 7 లక్షల 73 వేల 496 టన్నుల శిథిలాలు 2024-25 యుద్ధం ద్వారా ఏర్పడినాయని

తెలిపింది. అంటే ఎన్ని వేల టన్నుల బాంబులను ఇజ్రాయిల్ గాజాను నేలమట్టం చేయటానికి వినియోగించి ఉంటుందో ఊహకే అందదు. ఇప్పుడు ట్రంప్- నెతన్యాహులు గాజాను కబళించి జాతిని నిర్మూలించటానికి మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఈ మొసలి కన్నీరుతో అభివృద్ధి చేస్తాడట. ఎంతటి నయవంచన! 'శిథిలాల కింద కుళ్లిపోతున్న శవాలపైన ట్రంప్ స్నేహితుడు నెతన్యాహులు కలిసి హోటళ్లు, క్యాసినోలను నిర్మిస్తూ శవ రాజకీయాలు చేస్తారా' అని అనేక ప్రముఖ పత్రికలు ట్రంప్‌ను దుమ్మెత్తి పోశాయి.

1948లో పథకం ప్రకారం అప్పటి ఐ.రా.స.లో తన మిత్రుల సహాయంతో ఇజ్రాయిల్ దేశాన్ని పలస్తీనా భూభాగంలో ఏర్పాటు చేసుకొని 55శాతం పాలస్తీనా భూబాగాన్ని వశపర్చుకొని, పలస్తీనాపై ఇజ్రాయిల్ చేసిన యుద్ధంలో వేలాదిమంది చనిపోగా, లక్షలాదిమంది పలస్తీనా పౌరులు తమ దేశాన్నివదిలి జోర్డాన్ , ఈజిప్ట్, లెబనాన్, సిరియా దేశాలకు కట్టుబట్టలతో శరణార్ధులుగా వెళ్లిపోయారు. ఇప్పటివరకూ వారినిగానీ, వారి వారసులనుగానీ తమ మాతృదేశమైన పలస్తీనా గడ్డపైకి తిరిగి ఇజ్రాయిల్ రానివ్వలేదు. విచిత్రమేమంటే ప్రపంచంలో యూదులు ఎక్కడున్నా ఇజ్రాయిల్‌కు రావచ్చు, వారు ఇజ్రాయిల్ పౌరసత్వం పొందుతారు. ద్వంద పౌరసత్వం కూడా పొందవచ్చు. 1948 శరణార్ధుల తరహాలో పలస్తీనా ప్రజల్ని ప్రస్తుతం గాజా నుంచి అభివృద్ధిపేరుతో బలవంతంగా చుట్టుపక్క దేశాలకు తరిమేసి, ఇంక మరెప్పుడూ వారి జన్మస్థలానికి తిరిగి రానివ్వరని పాలస్తీనియన్లు అంటున్నారు. 1948 యుద్ధం 'నగ్బా' (పెద్ద విపత్తు) వలెనే ఇప్పుడు 2025లో మరొక 'నగ్బా' ప్రణాళికను ట్రంప్, నెతన్యాహులు ప్రణాళికను ప్రస్తుతం ట్రంప్ రచిస్తున్నాడు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ మాట్లాడుతూ 'ఒక దేశ ప్రజలను బలవంతంగా తరలించటమంటే ఆ దేశ జాతిని ప్రక్షాళన చేయటమే' అన్నారు. 'యుద్ధ నేరాలు చేస్తున్న అమెరికా తనకు మట్టి అంటుకోకుండా నేరుగా ప్రజలపై దారుణాలకు పాల్పడుతోందని హ్యూమన్ రైట్స్ వాచ్ స్పందించింది. అంతర్జాతీయ మానవతా చట్టం ఆక్రమిత భూభాగంలోని జనాభాను శాశ్వతంగా బలవంతంగా తరలించటాన్ని నిషేధిస్తుంది. నేర పూరిత ఉద్దేశంతో అలాంటి బలవంతపు తరలింపు జరిగితే అది యుద్ధ నేరంగా పరిగణిస్తారు. 1991 లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత క్రమేపి ప్రపంచ శాంతి కరువవుతుందని ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ రాసింది. 1991 తర్వాత రెండు గల్ఫ్ యుద్ధాలు, యుగోస్లావియా రద్దు, అఫ్ఘానిస్తాన్ పై దండయాత్ర, సిరియా లిబియాలో పాలన మార్పు, ఉక్రెయిన్‌ను ఉసిగొల్పి రష్యాపై నాటో

చేయిస్తున్న యుద్ధం అన్నీ ఈ ప్రక్రియలో భాగమే. 1917 బోల్షివిక్ (అక్టోబరు) విప్లవం లేకుంటే ఈ పాటికి ప్రపంచమంతా సరికొత్త వలస వాదంతో చాలా దేశాల్ని బానిస దేశాలుగా ప్రపంచ సామ్రాజ్యం పరిగణించి ఉండేదని తెలిపింది.

గడచిన దశాబ్దాలుగా అమెరికా పలస్తీనాపై చెప్పుకొస్తున్న తన విధానాలకు విరుద్ధంగా ట్రంప్ ప్రకటన ఉంది. 1993 ఓస్లో ఒడంబడిక ప్రకారం గాజా, వెస్ట్ బ్యాంకులతో కూడిన పలస్తీనాకు మద్దతునిస్తూ తూర్పు జెరూసలేం పలస్తీనా రాజధానిగా ఉండాలనే అంతర్జాతీయ అభిప్రాయానికి ట్రంప్ మొదటి దఫా అధ్యక్షునిగా ఉన్నప్పుడే తూట్లు పొడవటం ప్రారంభించాడు. ఇజ్రాయిల్‌లో అమెరికా రాయబార కార్యాలయాన్ని టెల్‌అవీవ్ నుంచి జెరూసలేంకు ట్రంప్ మార్చటమేగాక, వెస్టు బ్యాంకులో ఇజ్రాయిల్ నిర్మించిన అక్రమ శాశ్వత కట్టడాలను ట్రంప్ గుర్తించాడు. ఇది ఐ.రా.స. తీర్మానాలకు వ్యతిరేకం. 6 రోజుల యుద్ధంలో ఇజ్రాయిల్ ఆక్రమించిన గోలన్ హైట్స్ పర్వత శ్రేణుల ప్రాంతాన్ని కూడా ఇజ్రాయిల్ అంతర్భాగంగా ట్రంప్ గుర్తించి అంతర్జాతీయ దౌత్య అర్థాన్నే మార్చేశాడు. 1967లో పలస్తీనాపై ఇజ్రాయిల్ జరిపిన 6 రోజుల యుద్ధం వరకూ గాజా ప్రాంతాన్ని ఈజిప్టు వశపర్చుకొని 6 రోజుల యుద్ధం తర్వాత ఇజ్రాయిల్ ఆధీనంలో ఉంచుకొని 2005 లో గాజాను షరతులతో తిరిగి ఇచ్చింది. పాలస్తీనాను 2 ప్రాంతాలుగా గాజా, వెస్ట్‌బ్యాంకుగా విభజించి ఒక చోటు నుంచి వేరొక చోటుకు వెళ్లటానికి లేకుండా చేసింది. గాజాకు 3 వైపుల గోడను నిర్మించి, ఒకవైపు మధ్యదరా సముద్రంతో బహిరంగ కారాగారంగా ఇజ్రాయిల్ గాజాను మార్చింది. 2025 జనవరి 15 కాల్పుల విరమణ తర్వాత నిత్యావసర వస్తువులను చెక్‌పోస్టుల నుంచి గాజాకు రానివ్వటం లేదు. ప్రస్తుత గాజాలో కాల్పులను విరమించినట్లే నటించి, ఇప్పుడు వెస్ట్ బ్యాంకులో తలదాచుకుంటున్న కొద్దిపాటి పలస్తీనియన్లను జోర్డాన్ పారిపోయేలా కాల్పులు మొదలుపెట్టింది. తద్వారా మొత్తం పలస్తీనాను ప్రపంచ పటం నుంచి తొలగించటానికి అమెరికా, ఇజ్రాయిల్‌లు ప్రయత్నిస్తున్నాయి.

ప్రపంచ దేశాల విమర్శలను ఎదుర్కోలేని అమెరికా పలస్తీనియన్లపై స్థానభ్రంశం తాత్కాలికమేనని శ్వేత సౌధం వివరణ ఇచ్చినా, విదేశాంగ మంత్రి మార్కో రూబియో దీనిని తాత్కాలికంగా 'మధ్యంతర' ఏర్పాటుగా చెప్పుకొచ్చినా పలస్తీనా అమెరికా సొత్తు కాదని ప్రజలు నిరసనల ద్వారా తెలియజేస్తున్నారు.

జైల్లే కమ్యూనిస్టులకు నారు మడులు

ఆర్వీ రామారావు

ఇరవయ్యవ శతాబ్దం రెండవ మూడవ దశాబ్దాల కాలంలో కమ్యూనిస్టు భావజాలం వేగంగా విస్తరించినా కమ్యూనిస్టులు కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి అవకాశాలు చాలా పరిమితం. ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించేది. అందువల్ల కమ్యూనిస్టు భావజాలం ఉన్న వారు వేర్వేరు బృందాలుగా ఏర్పడి అనేక సంస్థలు, వ్యవస్థల రూపంలో పని చేయాల్సి వచ్చేది. వీలున్న చోట్ల ఉద్యమాలు చేయడం, కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యాపింప చేయడానికి పత్రికలు నిర్వహించడం కొనసాగేది. 1925లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినా దానికి ఒక స్వరూపం రావడానికి, పార్టీ వ్యవస్థ ఏర్పడడానికి పదేళ్లకు పైగానే పట్టింది. వివిధ పార్టీల పేరుతో కమ్యూనిస్టులు తమ కార్యకలాపాలు కొనసాగించాల్సి వచ్చేది. ఎక్కువ కాలం కమ్యూనిస్టులు రహస్యంగానే పని చేయవలసి వచ్చేది. కిసాన్ లేబర్ పార్టీగా, కార్మిక కర్షక పార్టీగా వివిధ రూపాల్లో కమ్యూనిస్టులు పనిచేయక తప్పలేదు. కమ్యూనిస్టులు పనిచేసే పార్టీల్లో కమ్యూనిస్టులు కాని వారు, కాంగ్రెస్ విధానాలకు రోసి పోయిన వారు కూడా ఉండేవారు. కమ్యూనిస్టులైన వారు కాంగ్రెస్ సభ్యులుగా కూడా ఉండేవారు. క్రమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అవతరించింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపన సంకల్పం జైళ్లలో అంకురించిందే. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో మార్క్సిజం ప్రభావం ఉన్నవారు, మార్క్సిజం మీద విశ్వాసం కుదిరిన వారు, సోషలిస్టులు కూడా ఉండే వారు. 1934 అక్టోబర్ లో బొంబాయిలో

హరే కృష్ణ కోనార్



మోనీ సింగ్

సరోజ్ ముఖర్జీ

ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

ఎ.కె గోపాలన్

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మహాసభ జరిగింది. గాంధేయవాదాన్ని నమ్మే వారి దగ్గరనుంచి మార్క్సిస్టు భావజాలం ఉన్నవారు కూడా ఆ మహాసభలో పాల్గొన్నారు.

శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని జైళ్లకెళ్లిన వారు మార్క్సిజం ప్రభావం వల్ల జైళ్ల నుంచి విడుదలైనప్పుడు కమ్యూనిస్టులుగా బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టారు. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం దాదాపు లక్ష మందిని జైళ్లలో పెట్టింది. అలా జైలులో ఉన్నప్పుడు కమ్యూనిస్టు లుగా మారినవారు అనేకమంది కనిపిస్తారు. ఉదాహరణకు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న వినయ కృష్ణ చౌదరి, హరే కృష్ణ కోనార్, సరోజ్ ముఖర్జీ లాంటి వారు కమ్యూనిస్టులుగా రూపాంతరం చెందారు. కమ్యూనిస్టు భావాలు ఉన్న కొందరు శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొనకూడదని వాదించారు. అంటే గాంధీజి నాయకత్వంలో నడుస్తున్న ఉద్యమంపై భిన్నభావాలు ఉండేవి. బెంగాల్‌లో బంకించంద్ర ముఖర్జీ, అబ్దుల్ రజాక్, మోనీసింగ్ లాంటి వారు జైలుకెళ్లినప్పుడు కాంగ్రెస్ వాదులైతే విడుదలయ్యే నాటికి కమ్యూనిస్టులు. అంటే జైళ్లు కమ్యూనిస్టులకు నారు మళ్లుగా ఉపకరించాయి. కేరళలో కృష్ణ పిళ్లే, ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్, ఎ.కె.గోపాలన్ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. వీరే తరవాత కమ్యూనిస్టు పార్టీని బొలోపేతం చేశారు. 1931 నవంబర్ ఒకటిన హరిజనులు గురువాయూర్ ఆలయ ప్రవేశానికి ముహూర్తం ఖరారైంది. దానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టులే. ఎ.కె. గోపాలన్ కేరళ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఉండేవారు. ఆ తరవాతే కమ్యూనిస్టు అయ్యారు. ఆంధ్ర ప్రాంతంలో 1934 నాటికి కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. సోషలిస్టు భావాలవైపు ఆకర్షితులైన దక్షిణాది వారు కమ్యూనిస్టులయ్యారు. 1934లో బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం విధించింది. సరిగ్గా ఇదే సమయంలో స్పెయిన్ లో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతర్యుద్ధం జరిగింది. ఆ అంతర్యుద్ధంలో అనేకమంది మేధావులూ పాల్గొన్నారు. ఆ అంతర్యుద్ధంలో పాల్గొన్న రాల్ఫ్ ఫాక్స్ లాంటి రచయితలు ప్రాణాలు కోల్పోయారు. సరిగ్గా అదే 1936వ సంవత్సరం మన దేశంలో సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కమ్యూనిస్టు పార్టీ విస్తరించడానికి బీజం వేసింది.

నేడు లోక్‌సభ ముందుకు ఆదాయపు పన్ను బిల్లు

న్యూఢిల్లీ: దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించిన బిల్లును గురువారం (ఫిబ్రవరి 13న) లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ బిల్లులో 536 సెక్షన్లు, 23 ఛాప్టర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961లో 298 సెక్షన్లు ఉండగా... కొత్తగా తీసుకురానున్న బిల్లులో 536 సెక్షన్లు చేర్చినట్లు తెలిసింది. ప్రస్తుతమున్న 14 షెడ్యూల్‌ను కొత్త చట్టంలో 16కు పెంచనున్నది. అయితే, ఇప్పటి చట్టంలో మాదిరిగానే నూతన బిల్లులోనూ 23 ఛాప్టర్లు ఉన్నాయి. పేజీల సంఖ్యను ప్రస్తుతమున్న దానితో పోలిస్తే దాదాపు సగానికి సగం తగ్గించారు. కొత్త బిల్లును 622 పేజీల్లో రూపొందించారు. 1961లో ఆదాయపు పన్ను చట్టాన్ని తీసుకొచ్చినప్పుడు దాన్ని 880 పేజీల్లో పొందుపర్చారు. ఆ తర్వాత గత ఆరు దశాబ్దాలుగా ఈ చట్టానికి అనేక సవరణలు చేయడంతో పేజీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను చట్టంలో వ్యవస్థీకృత అంశాలు, పన్ను పథకాలు, ఇతర నిబంధనలకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ల కోసం పార్లమెంట్ వద్దకు సవరణల రూపంలో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అయితే, ప్రతిపాదిత బిల్లులో ఆ అవసరం లేకుండా సీబీడీటీకి కొన్ని స్వతంత్ర అధికారాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇకపై ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ రూల్స్, డిజిటల్ ట్యాక్స్ మానిటరింగ్ సిస్టమ్స్ వంటి వాటిని సీబీడీటీనే రూపొందించేలా కొత్త బిల్లులో ప్రతిపాదనలు చేశారు. ఆదాయపన్ను బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన తర్వాత... దీనిని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించనున్నట్లు తెలుస్తోంది. ఆదాయపు పన్నును సరళీకరించేందుకు, పన్ను విధానాన్ని సులువుగా అర్థం చేసుకునేందుకు కొత్త చట్టాన్ని తీసుకురాబోతున్నామని ఇటీవల బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

తిరిగి వస్తారన్న నమ్మకం లేదు

ఇంద్రాణీ ముఖర్జీకి సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలన్న షీనా బోరా హత్య కేసు ప్రధాన నిందితురాలు ఇంద్రాణీ ముఖర్జీ విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. విదేశాలకు వెళ్తే తిరిగి వస్తారన్న భరోసా లేదని పేర్కొంది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీం ధర్మాసనం సమర్థించింది. అలాగే ఈ కేసు విచారణను ఏడాది లోపల పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. 'మళ్లీ తిరిగి వస్తారన్న గ్యారంటీ లేదు. విచారణ తుది దశకు చేరుకుంది. విచారణ కొనసాగుతున్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకొని... ఈ దశలో మీ విజ్ఞప్తిని అనుమతించలేం. విచారణ వేగవంతం చేసి ఏడాదిలోగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశిస్తున్నాం' అని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఇంద్రాణీ ముఖర్జీ విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ జులై 19న ట్రయల్ కోర్టు అనుమతులిచ్చింది. స్పెయిన్, బ్రిటన్ పర్యటనకు 10 రోజుల అనుమతి లభించింది. అయితే, సీబీఐ అప్పీలుతో బాంబే హైకోర్టు ఈ తీర్పును పక్కనపెట్టింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఇంద్రాణీ ముఖర్జీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. తన కుమార్తె షీనా బోరా హత్య కేసులో ఇంద్రాణీ ప్రధాన నిందితురాలిగా ఉన్నారు. ఈ కేసులో అరెస్టై 2015 నుంచి జైలులో ఉంటున్న ఆమెకు 2022లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులతో సంప్రదింపులు జరపరాదని షరతులు విధించింది.

అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ కన్నుమూత

లక్నో: అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి మహంత్ సత్యేంద్ర దాస్(85) బుధవారం లక్నోలోని ఓ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఈ నెల ప్రారంభంలో బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా పరిస్థితి విషమించడంతో సత్యేంద్రని లక్నోలోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చేర్చారు. వైద్యుల పర్యవేక్షణ తర్వాత ఆయన ఆరోగ్యం మరింత క్షీణించినట్లు తెలిపారు. హై డిపెండెన్సీ యూనిట్‌లో చికిత్స పొందుతున్న ఆయన తాజాగా తుది శ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విచారం వ్యక్తం చేశారు. మహంత్ సత్యేంద్ర దాస్ 20 ఏళ్ల వయస్సులోనే అయోధ్య రామాలయ ప్రధాన పూజారిగా నియమితులయ్యారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో తాత్కాలికంగా రామాలయ పూజారిగా సేవలు అందించారు.

కేరళ నర్సింగ్ కళాశాలలో వికృత అకృత్యం

జూనియర్లపై దారుణ ర్యాగింగ్... ఐదుగురి అరెస్టు

కొట్టాయం: కేరళలోని కొట్టాయం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో వికృత అకృత్యం చోటుచేసుకుంది. సీనియర్ విద్యార్థులు... జూనియర్లపై దారుణంగా ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. జూనియర్ విద్యార్థుల దుస్తులు తొలగించి వారిని నగ్నంగా చేసి... ప్రైవేట్ పార్ట్స్ నుంచి డంబెల్స్ వేలాడదీసి అత్యంత అమానవీయ చర్యకు ఒడిగట్టారు. అంతేకాకుండా ప్రైవేట్ భాగాల్లో జామెట్రీ బాక్స్ కంపాస్‌తో పొడిచి రక్తమోడేలా హింసించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన ఐదుగురు విద్యార్థులను గాంధీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను... మూడు నెలలుగా సీనియర్లు వేధిస్తున్నట్లు తెలిసింది. ఆ కేసులో రెండవ సంవత్సరం నర్సింగ్ విద్యార్థులు సామ్యూల్ జాన్సన్, జీవా ఎన్ఎస్‌తో పాటు మూడవ సంవత్సరం చదువుతున్న రాహుల్ రాజ్, రిజిల్‌జిత్, వివేక్ ఎన్వీ దోషులుగా ఉన్నారు. ర్యాంగింగ్ చట్టం కింద ఆ విద్యార్థులపై కేసు నమోదయింది. దీంతో ఆ ఐదుగురిని కళాశాల ప్రిన్సిపల్ సస్పెండ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... మొదటి సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సీనియర్లపై ఫిర్యాదు చేశారు. సీనియర్లు తమ దుస్తులు విప్పించి... తమ మర్మాంగాలకు డంబుల్స్ కట్టేవారని జూనియర్లు పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో కంపాస్‌తో గుచ్చి... గాయాలపై లోషన్ పోసేవారని వివరించారు. మెన్స్ హాస్టల్‌లో ర్యాగింగ్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. మద్యం కొనేందుకు జూనియర్ల నుంచి సీనియర్లు రూ.800 వసూలు చేసినట్లు చెప్పారు. జూనియర్లను మద్యం తాగేలా వేధించి, ఆ దృశ్యాలను వీడియో తీసి బెదిరించేవారు. అయితే డబ్బులు ఇవ్వలేదని ఇటీవల ఓ జూనియర్‌ను సీనియర్ కొట్టాడు. ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వాళ్ల సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. కొట్టాయం ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలో నర్సింగ్ కళాశాల నడుస్తున్నది. ప్రస్తుతం ఐదుగురు విద్యార్థులు పోలీసు కస్టడీలో ఉన్నారు. కొచ్చిలో 15 ఏళ్ల పాఠశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకుని మరణించిన కొన్ని రోజుల తర్వాత ఈ ఘటన జరిగింది. తన కుమారుడిని విద్యార్థులు వేధించారని, అది అతని మరణానికి దారితీసిందని విద్యార్థి తల్లి ఆరోపించింది.

టీవీకే నేతలతో పీకే భేటీ

అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చ

చెన్నై: ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ప్రత్యేక సలహాదారుగా ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నియమితులయ్యారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే విజయమే లక్ష్యంగా ప్రశాంత్ కిశోర్ వ్యూహ రచన చేయనున్నారు. ఈ మేరకు ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఇటీవల విజయ్‌తో భేటీ అయిన ప్రశాంత్ కిశోర్... టీవీకే పార్టీ సిద్ధాంతాల గురించి, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన, ప్రజలను ఆకట్టుకునే హామీల గురించి చర్చించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పార్టీ ఎన్నికల విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్ నివాసంలో ఆ పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా శాఖ కార్యదర్శులను ప్రశాంత్ కిశోర్ వరుసగా కలుసుకున్నారు. విక్రవాండిలో జరిగిన పార్టీ మహానాడులో డీఎంకే తనకు ప్రధాన రాజకీయ శత్రువని విజయ్ చేసిన ప్రకటనకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన స్పందన గురించి పార్టీ నాయకుల వద్ద ఆయన ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 14 నెలల గడువు మాత్రమే ఉండటంతో... ఆలోగా పార్టీని పటిష్టం చేసి, రాష్ట్రవ్యాప్తంగా రోడ్‌షోలు నిర్వహించి ఆ ఎన్నికలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ప్రశాంత్ కిషోర్ సూచించారు. జిల్లా కార్యదర్శులు, డిప్యూటీ కార్యదర్శులు, కోశాధికారులతో ఆయన చర్చించారు. ఏళ్లతరబడి రాష్ట్ర ప్రజలకు పరిష్కారం కాని సమస్యలేమిటో తెలుసుకుని... వాటిని పరిష్కరించేలా తక్షణమే చేపట్టాలని టీవీకే నేతలకు ఆయన సలహా ఇచ్చారు. వీలైతే వచ్చే నెల నుంచే విజయ్ రాష్ట్రవ్యాప్త పర్యటన చేయాలని, అప్పుడే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొంత వెసులుబాటు ఉంటుందని సూచించినట్లు తెలిసింది. టీవీకే జిల్లా కార్యదర్శులందరితోనూ ప్రశాంత్‌కిశోర్ వేర్వేరుగా మాట్లాడారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కూడా పాల్గొన్నారు.

ఆప్ ఆరోపణలు నిరాధారం: గెహ్లాత్



న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రధాన ప్రతిపక్ష పాత్రకు కాంగ్రెస్ సిద్ధమైందని ఆ పార్టీ సీనియర్ అశోక్ గెహ్లాత్ అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో బుధవారం పోస్టు చేశారు. ఢిల్లీలో పదేళ్లు అధికారంలో ఉన్న ఆప్ ప్రజల్లో నమ్మకం కోల్పోయింది. అందుకే భవిష్యత్తులో ఢిల్లీలో ప్రధాన ప్రతిపక్షంగా కీలక పాత్ర పోషించేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని గెహ్లాత్ తన పోస్టులో పేర్కొన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓడిపోయేలా చేయడానికి కాంగ్రెస్ పాత్ర కూడా ఉందని ఆప్ నేతలు ఆరోపించారు. ఈ ఆరోపణలపై గెహ్లాత్ స్పందించారు. 'ఢిల్లీ ఎన్నికల్లో ఓటమికి కాంగ్రెస్ కూడా కారణమని ఆప్ ఆరోపణలు నిరాధారమైనవి.

నిజానికి చాలా రాష్ట్రాల్లో ఆ పార్టీకి బలం లేకపోయినా... పోటీ చేసి కాంగ్రెస్ ఓట్లు చీల్చింది. కాంగ్రెస్ ఓడిపోయేలా చేసింది. కేవలం కాంగ్రెస్ ఓట్లు తగ్గించడమే లక్ష్యంగా ఆప్ ఎన్నికల్లో పోటీ చేసింది. ఉదాహరణకు గుజరాత్, గోవా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీనిస్తుంది. అలాంటిది ఆ రాష్ట్రాల్లో ఆప్ పోటీ చేసి... కాంగ్రెస్ ఓట్లు చీల్చి బీజేపీ గెలుపునకు కారణమైంది' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ భవిష్యత్తులో ఢిల్లీలో ప్రధాన ప్రతిపక్షపాత్ర పోషిస్తుందని, రాబోయే ఎన్నికల్లో బలాన్ని పెంచుకునేందుకు సిద్ధమవుతుందని తాను విశ్వసిస్తున్నట్లు గెహ్లాత్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

అమెరికాలో దాగిన గ్యాంగ్‌స్టర్ల జాబితా రెడీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన వేళ భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలో దాక్కున్న భారత్‌లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌స్టర్లను తిరిగి వెనక్కి రప్పించే ప్రయత్నాలను వేగవంతం చేయాలని నిర్ణయించింది. అందుకుగాను సిద్ధం చేసిన గ్యాంగ్‌స్టర్ల జాబితాను అమెరికాకు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు భద్రతా సంస్థలు ఓ నివేదిక రూపొందించాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. గోల్డీ బ్రార్, అన్మోల్ బిష్ణోయ్ సహా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వాంటెడ్ జాబితాలో ఉన్న గ్యాంగ్‌స్టర్ల పేర్లు ఆ నివేదికలో ఉన్నాయి. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా ఇది రూపొందింది. విదేశాల్లో ఉంటున్న నేరగాళ్ల జాబితా కేంద్ర సంస్థల వద్ద ఇప్పటికే ఉంది. అయితే కొన్ని వారాల క్రితం ప్రత్యేకించి అమెరికా కేంద్రంగా ఉన్న వారి జాబితా సిద్ధం చేయాలని మంత్రిత్వ శాఖ తన ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట కాల్పుల ఘటన సహా అనేక కేసుల్లో నిందితుడు అన్మోల్ బిష్ణోయ్ అమెరికాలో ఉన్నట్లు ముంబై పోలీసులకు ఇప్పటికే సమాచారం ఉంది. అతడి కదలికలకు సంబంధించిన వివరాలను అమెరికా అధికారులు... పోలీసులతో పంచుకున్నారు. దీంతో అతడిని భారత్‌కు రప్పించే ప్రయత్నాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి. కొన్ని నెలల క్రితం ముంబైలో సంచలనం సృష్టించిన బాబా సిద్దిఖీ హత్య కేసు నిందితులతోనూ అన్మోల్ అందుబాటులో ఉన్నాడు. 2022లో జరిగిన ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులోనూ బిష్ణోయ్ అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. గోల్డీ బ్రార్‌గా ప్రచారంలో ఉన్న సతీందర్ సింగ్ భారత్‌లో మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్. అతడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లో అత్యంత కీలక సభ్యుడు. 2022లో జరిగిన సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ఒక్కసారిగా ఇతడి పేరు మార్మోగింది. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటిపై కాల్పులు జరిపిన ఘటనలో కూడా గోల్డీబ్రార్ పేరు వినిపించింది. అతడు కూడా అమెరికాలోనే ఉన్నాడు.

మోదీ విదేశీ పర్యటనకు ఉగ్ర బెదిరింపులు

ముంబై: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణిస్తున్న విమానానికి ఉగ్ర బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. మోదీ విమానాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడి జరగొచ్చని తమకు సమాచారం వచ్చినట్లు ముంబై పోలీసులు వెల్లడించారు.

'ఫిబ్రవరి 11న ముంబై పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. విదేశీ పర్యటనలో ఉన్న మోదీ విమానంపై ఉగ్రవాదుల దాడి జరగొచ్చు అని అవతలి వ్యక్తి బెదిరించాడు. సమాచారంలో ఉన్న తీవ్రత దృష్ట్యా మేం వెంటనే ఇతర దర్యాప్తు సంస్థలను అప్రమత్తం చేశాం. కాల్ చేసిన వ్యక్తి ఎవరనే దానిపై దర్యాప్తు చేపట్టాం' అని ముంబై పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం ఫోన్ కాల్ చేసిన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

షోకాజ్‌కు సమాధానమిస్తా: అనిల్ విజ్

చండీగఢ్: బీజేపీ అధిష్ఠానం తనకు పంపిన షోకాజ్ నోటీస్‌పై త్వరలో సమాధానం చెబుతానని హర్యానా మంత్రి అనిల్ విజ్ చెప్పారు. మీడియాతో బుధవారం ఆయన మాట్లాడుతూ... 'నేను బెంగళూరు నుంచి తిరిగి వచ్చా. ముందుగా ఇంటికి వెళ్తా. చల్లనీళ్లతో స్నానం చేస్తా. రోటీ తింటా. ఆ తర్వాత కూర్చొని షోకాజ్ నోటీస్‌కు సమాధానం రాసి పంపుతా' అని అన్నారు. కాగా, బీజేపీ హర్యానా అధ్యక్షుడు మోహన్ లాల్ బడోలి, ముఖ్యమంత్రి నయాబ్ సైనిపై వ్యాఖ్యలు పార్టీ విధానం, అంతర్గత క్రమశిక్షణకు విరుద్ధమని... నోటీస్‌కు మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని అనిల్ విజ్‌ను హైకమాండ్ ఆదేశించింది. దీంతో పైవిధంగా ఆయన స్పందించారు. బీజేపీ సీనియర్ నేత అయిన అనిల్ విజ్ గతంలో కూడా సొంత పార్టీతోపాటు కొందరు నేతలపై తీవ్ర విమర్శలు చేశారు.

'నమ్మకద్రోహి'ని ఎలా సత్కరిస్తారు?

శరద్ పవార్‌పై శివసేన(యూబీటీ) విమర్శలు



ముంబై: ఎన్‌సీపీ(ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌పై ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) బుధవారం నిప్పులు చెరిగింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను సత్కరించిన ఒక రోజు తర్వాత... పవార్ వంటి నాయకుడి నుంచి తాము ఇలా ఊహించలేదని తెలిపింది. శరద్ పవార్ చర్య మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)లో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది. 2019లో రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపి ఎంవీఏను ఏర్పాటు చేసిన తర్వాత ఉద్ధవ్ సేన శరద్ పవార్‌పై దాడి చేయడం ఇదే మొదటిసారి. మంగళవారం ఢిల్లీలో జరిగిన మహాద్జీ షిండే రాష్ట్రీయ గౌరవ్ అవార్డుతో షిండేను సత్కరించారు. ఫిబ్రవరి 21 నుంచి 31 వరకు ఢిల్లీలో జరగనున్న 98వ అఖిల భారత మరాఠీ సాహిత్య సదస్సు నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్న ఈ సదస్సుకు స్వాగత కమిటీకి పవార్ అధ్యక్షుడు. 'పవార్ సాహెబ్ మమ్మల్ని నిరాశపరిచారు. ఆయన ఇంతవరకు వెళతారని మేము ఎప్పుడూ ఊహించలేదు. మహారాష్ట్రను నాశనం చేయడానికి ప్రయత్నించిన 'దేశద్రోహిని' ఆయన సత్కరించారు. మహారాష్ట్ర, మరాఠీ మనుషుల ఆత్మగౌరవం, గర్వం కోసం నిరంతరం పోరాడిన పార్టీని నాశనం చేసి ఎంవీఏ ప్రభుత్వాన్ని కూల్చివేసిన అటువంటి ద్రోహిని పవార్ సాహెబ్ ఎలా సత్కరించగలరు?' అని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. షిండేను సత్కరించడం అంటే హోం మంత్రి అమిత్ షాను సత్కరించడం లాంటిది. సేన అధినేత బాలాసాహెబ్ ఠాక్రే స్థాపించిన పార్టీని నాశనం చేయడానికి ఇద్దరూ చేతులు కలిపారు. అలాంటి వ్యక్తిని సత్కరిస్తున్నారు. మహారాష్ట్ర, మరాఠీ ప్రజలను తీవ్రంగా అవమానించారని నేను భావిస్తున్నాను' అని రౌత్ తెలిపారు. థానే లేదా నవీ ముంబై అభివృద్ధిలో షిండే ఎటువంటి పాత్ర పోషించలేదని లేదా మహారాష్ట్ర అభివృద్ధికి ఎటువంటి సహకారం అందించలేదని శివసేన(యూబీటీ) నాయకుడు అన్నారు. 'నిర్ణయాత్మక నాయకత్వం అని పిలవబడేందుకు ఆయనకు గౌరవం లభించింది. అతను నాయకుడు కాదు. అతను ద్రోహి, విధ్వంసకుడు. అలాంటి వ్యక్తిని ఎప్పుడూ సత్కరించకూడదు. పవార్ సాహెబ్ ఈ కార్యక్రమానికి హాజరు కాకూడదు' అని అన్నారు. అంతకు ముందు, ఢిల్లీలో ఈ అంశంపై ఆయన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. 'మహారాష్ట్ర రాజకీయాలు చాలా విచిత్రమైన దిశలో కదులుతున్నాయి. ఎవరు ఎవరిని మోసం చేస్తున్నారో మనం అర్థం చేసుకోవాలి. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చివేసిన ఏక్‌నాథ్ షిండేను శరద్ పవార్ గౌరవించి ఉండకూడదు. అదే మా భావన' అని అన్నారు. 'మహారాష్ట్ర ప్రజలను మనం ఎలా ఎదుర్కొంటాము? రాజకీయాల్లో శాశ్వత స్నేహితులు లేదా శత్రువులు ఉండరనేది నిజం. కానీ మహారాష్ట్రకు హాని చేసిన వారిని, మనం రాష్ట్ర శత్రువులుగా భావించే వారిని గౌరవించడం మహారాష్ట్ర ఆత్మగౌరవానికి అవమానం. ఇది మా అభిప్రాయం. పవార్ అభిప్రాయాలు భిన్నంగా ఉండవచ్చు. అయితే మహారాష్ట్ర ప్రజలు దీనిని అంగీకరించలేదు ఎందుకంటే మేము శరద్ పవార్‌ను గౌరవిస్తాం' అని రౌత్ చెప్పారు. 'మీరు అజిత్ పవార్‌తో వెనుక చర్చలు జరపవచ్చు. కానీ మేము ఈ విషయాలపై అవగాహనతో ముందుకు సాగుతాం' అని అన్నారు. శివసేన (యూబీటీ) నాయకుడు మరాఠీ సాహిత్య సమ్మేళన్ నిర్వాహకులను కూడా విమర్శించారు. 'ఢిల్లీ సాహిత్య సదస్సును నిర్వహించడం లేదు. రాజకీయ దళారీతనం. అవార్డులు యాదృచ్ఛికంగా ఇవ్వబడుతున్నాయి. ప్రజలు కారణం లేకుండా సత్కరించబడుతున్నారు. ఈ వ్యక్తులకు సాహిత్యంతో సంబంధం ఏమిటి' అని ఆయన ప్రశ్నించారు.

ప్రతి అంశం రాజకీయం చేయనవసరం లేదు: ఎన్‌సీపీ (ఎస్‌పీ)

ప్రతి అంశాన్ని రాజకీయం చేయనవసరం లేదని ఎన్‌సీపీ (ఎస్‌పీ) వ్యాఖ్యానించింది. ఆ పార్టీ ఎంపీ అమోల్ కోల్హే మాట్లాడుతూ 'షిండేను సత్కరించడం ద్వారా పవార్ రాజనీతిజ్ఞతకు ఒక ప్రత్యేకమైన ఉదాహరణ' అని అన్నారు. ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధికార ప్రతినిధి అంకుష్ కాకడే మాట్లాడుతూ రౌత్ సాహిత్య కార్యక్రమాన్ని రాజకీయాలతో కలుపుతున్నారని తెలిపారు.

కేరళ అభివృద్ధిలో కొత్త మైలురాయి

పినరయి విజయన్

తిరువనంతపురం: 'ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్' కేరళ అభివృద్ధిలో కొత్త మైలురాయిగా మారుతుందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టును షేర్ చేశారు. ఈ సమావేశం రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు ఆకర్షించడానికి, కేరళను పెట్టుబడికి అనుకూలమైన రాష్ట్రంగా బలోపేతం చేయడానికి మార్గం సుగమం చేస్తుందని విజయన్ అన్నారు. ఫిబ్రవరి 21, 22 తేదీల్లో కొచ్చిలోని లులు బోల్గట్టి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 'కేరళ అభివృద్ధికి ఆటంకం కలిగించే అనేక ధోరణులను సరిదిద్ది ఎనిమిది సంవత్సరాలు గడిచాయి. నేడు, కేరళ పరిశ్రమకు అనుకూలం కాదనే ముందస్తు భావనలన్నీ మరచిపోయాయి. దేశంలోని ఉత్తమ పెట్టుబడికి అనుకూలమైన రాష్ట్రాలలో ఒకటిగా మనం మారాం. రాష్ట్ర ప్రభుత్వ సంకల్ప శక్తి, ప్రణాళికా నైపుణ్యం కారణంగా ఈ విజయం సాధ్యమైంది. ఆ ప్రయత్నాలకు మరింత శక్తి, దిశానిర్దేశం చేసే 'ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్' ఫిబ్రవరి 21, 22 తేదీలలో కొచ్చిలోని లులు బోల్గట్టి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నాం. దీని ద్వారా కేరళ బాధ్యతాయుతమైన అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశం రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు ఆకర్షించడానికి, కేరళను పెట్టుబడి అనుకూల రాష్ట్రంగా బలోపేతం చేయడానికి మార్గం సుగమం చేస్తుంది. దీనికి ముందు, దేశంలోని వివిధ ప్రాంతాలలో, గల్ఫ్ ప్రాంతంలో అంతర్జాతీయ నిపుణులు పాల్గొన్న పెద్ద కార్యక్రమాలు నిర్వహించాం. తొమ్మిది దేశాల సహకారంతో కేరళ ఈ పెద్ద శిఖరాగ్ర సమావేశం నిర్వహిస్తోంది. పరిశ్రమల అధిపతులు, పెట్టుబడిదారుల భాగస్వామ్యంతో రెండు రోజుల శిఖరాగ్ర సమావేశంలో వివిధ మార్పిడి కార్యక్రమాలు జరుగుతాయి. 2016లో వామపక్ష పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేరళ పారిశ్రామిక వృద్ధి అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. పారిశ్రామిక వాతావరణాన్ని మెరుగుపరచడానికి వామపక్ష ప్రభుత్వం చేపట్టిన జోక్యాలకు జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు లభించాయి. 'ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్' కేరళ అభివృద్ధి పురోగతిలో ఒక కొత్త మైలురాయిగా మారుతుంది' అని విజయన్ పేర్కొన్నారు.

మోదీ మాట ట్రంప్ వింటారా: ఖర్గే



కల్బుర్గి (కర్నాటక): అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇమ్మిగ్రేషన్ పాలసీ విధానంలో మార్పులు తీసుకొచ్చి... చట్టపరమైన పత్రాలు లేకుండా అక్కడ నివశిస్తున్న భారతీయుల్ని అమానవీయ పద్ధతిలో భారత్‌కి పంపారు. చేతులకు, కాళ్లకు సంకెళ్లు వేసి మిలటరీ విమానంలో తీసుకొచ్చారు. ఈ చర్యపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. దీనిపై చర్చ పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ... పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు నిరసనలు చేశారు. భారతీయులపై ట్రంప్ ప్రభుత్వ అమానుష చర్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. పధాని మోదీ మాట ట్రంప్ వింటే...భారతీయుల్ని అలా బహిష్కరించేవారా? అని ఆయన ప్రశ్నించారు. ఖర్గే బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోదీ అక్కడ (అమెరికా)కు వెళ్లారు. బహుశా భారతీయుల బహిష్కరణ గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఆయన మాట్లాడతారు. అమెరికా మనకు మిత్రుడని, సమస్యలు పరిష్కారమవుతాయని మోదీ చెబుతూనే ఉంటారు. ప్రజలు వస్తారు... వెళతారు. కానీ దేశం మాత్రం శాశ్వతమైనది. దేశం పక్షాన ఆలోచించడానికి బదులు... ట్రంప్ తన స్నేహితుడని ప్రధాని పదేపదే ప్రస్తావిస్తారు. ట్రంప్ నిజంగా ప్రధాని మాట వింటే... వారు మన (భారతీయులు) ప్రజలను ఎందుకు బహిష్కరిస్తున్నారు' అని ప్రశ్నించారు. ఒకవేళ భారతీయుల్ని పంపినా సాధారణ ప్యాసింజర్ విమానంలో పంపకుండా... గూడ్స్ విమానంలో సంకెళ్లువేసి ఎందుకు పంపారు? అంటే ప్రధాని మోదీ స్నేహితుడు మన ప్రజల్ని బానిసలుగా చూస్తున్నారని అర్థం. వారిని తిరిగి తీసుకురావడానికి మన విమానాన్నే పంపించి ఉండాల్సిందని ఖర్గే అన్నారు.

మహారాష్ట్రలో మరో జీబీఎస్ మరణం

ముంబై: మహారాష్ట్రలో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు 172 కేసులు నిర్ధారణ కాగా... ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ వైరస్ కారణంగా తాజాగా మరో మరణం నమోదైంది. దీంతో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. వాడాలా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి (53) జీబీఎస్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అడికి వైరస్ సోకినట్లు గత నెల 23న నిర్ధారణ అయింది. ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్న అతడికి ఐసీయూలో చికిత్స అందించారు. అయితే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో బుధవారం ఐదు కొత్త కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో జీబీఎస్ కేసులు 172కి పెరిగాయి. మహారాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ప్రకారం... పూణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 40, గ్రామాల నుంచి 92, పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ 29, పూణే రూరల్ ఏరియాలో 28, ఇతర జిల్లాల నుంచి ఎనిమిది కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 104 మంది రోగులు ఆసుపత్రి నుంచి విడుదలయ్యారు. 50 మంది ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. మరో 20 మంది వెంటిలేటర్లపై ఉన్నట్లు అధికారులు వివరించారు. జీబీఎస్ అంటే ఒక వ్యక్తిలోని రోగనిరోధక వ్యవస్థ తనలోని ఆరోగ్య కణాలనే శత్రువులుగా భావించి దాడి చేయడం. సొంత రోగనిరోధక వ్యవస్థ దాడి చేయడంవల్ల నాడీ వ్యవస్థ క్రమంగా నిర్వీర్యం చేస్తుంది. దీని ప్రధాన లక్షణం విపరీతమైన నీరసమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ డిజార్డర్స్ అండ్ స్ట్రోక్స్ వెల్లడించింది. తర్వాతి దశలో శ్వాసప్రక్రియను నియంత్రించే కండరాలు బాగా బలహీనపడతాయి. రోగిని కదల్లేని స్థితికి చేరుస్తుంది. జీర్ణశక్తి మందగిస్తుంది.

బీజేపీలో అంతర్గత పోరు

అందుకే సీఎం ఎంపిక జాప్యం:ఆప్

న్యూఢిల్లీ: బీజేపీలో అంతర్గత కుమ్ములాట కారణంగానే ఢిల్లీ సీఎం ఎంపిక ఆలస్యమవుతోందని ఆమ్‌ఆద్మీ పార్టీ పేర్కొంది. దీనివల్ల దేశ రాజధానిలో పాలన ప్రభావితమవుతోందని తెలిపింది. ఆప్ ముఖ్య అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ బుధవారం ఈ మేరకు ప్రకటన చేశారు. బీజేపీ నిష్క్రియాత్మకత కారణంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో సుదీర్ఘ విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించి చాలా రోజులయినప్పటికీ బీజేపీ ముఖ్యమంత్రిని నిర్ణయించలేకపోయిందని, ఆ పార్టీ అంతర్గత గొడవల భారాన్ని ఢిల్లీ ప్రజలు ఎందుకు భరించాలని కక్కర్ అన్నారు. బీజేపీలోని వర్గపోరు కారణంగానే తదుపరి ముఖ్యమంత్రిపై ఏకాభిప్రాయం కుదరడం లేదని ఆమె ఆరోపించారు. "బీజేపీ నాయకులు చిన్న గ్రూపు సమావేశమవుతున్నారు. ఎవరు నాయకత్వం వహిస్తారో నిర్ణయించుకోలేకపోతున్నారు. వారు తమలో తాము పోరాడుకోవడంలో బిజీగా ఉన్నారు. కానీ ఢిల్లీ ప్రజలు బాధపడాల్సిన అవసరం లేదు" అని ఆమె అన్నారు. ఎన్నికల్లో ఓటమిపై ఆప్ ఆత్మపరిశీలన చేసుకుంటోందని తెలిపారు. మా పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ... గెలిచిన ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులతో మాట్లాడుతున్నారు. పార్టీ విధానాలను మెరుగుపరచడానికి నిరంతర సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కానీ బీజేపీపై బాధ్యత ఉందన్నారు

విశాలాంధ్ర హైదరాబాద్

ఇష్టారాజ్యంగా సీసీ రోడ్డు పనులు

అధికారుల పర్యవేక్షణ కరువు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా: ఖానాపూర్ పట్టణంలోని విద్యా నగర్‌లో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని కాలనీవాసులు ఆరోపించారు. పాత సీసీ రోడ్డుపై కొత్త సీసీరోడ్డు వేయడం చూస్తుంటే పాత పనులకు పూతలు పెడుతూ బిల్లు లేపుకుంటున్న వైనంగా ఉందన్నారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యవేక్షించినా ఫలితం లేకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. రోడ్డు వెడల్పు ఎత్తుల కొలతలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న అవకతవక లపై సంబంధిత ఏఈ, డిఈ, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడికి వచ్చిన ఏఈ, కమిషనర్‌కు రోడ్లను చూపించి ప్రశ్నల వర్షం కురిపించారు. తమకు కూడా 15 ఫీట్ల రోడ్డు వేయాలని, ఎత్తు 9 ఇంచులు ఉండేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. కాలనీవాసులతో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. అంతవరకు తత్కాలికంగా రోడ్డు పనులను వాయిదా వేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాం భీమేశ్వర్, అమరగోని రాజేశ్వర్, కత్తి రాజశేఖర్, శ్రీమల్ల నర్సయ్య, బోర్ల రాజేశ్వర్,బైరి చంద్రశేఖర్, రామ్ రెడ్డి, రాజు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై ప్రజలకు అవగాహన

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

విశాలాంధ్ర బ్యూరో- నల్లగొండ : ప్రజలలో అవగాహన కల్పించేందుకు గాను ముఖ్యమైన పట్టణాలు, మండల కేంద్రాలలో ఇందిరమ్మ మోడల్ ఇండ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ కలెక్టరేట్‌లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు బాగుందని, ఇదేవిధంగా నల్గొండ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాలలో ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఇలాంటి మోడల్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని చెప్పారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ కుమార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌లు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

నేడు మండల స్థాయి సమావేశం

విశాలాంధ్ర- నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులతో మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సోమ సుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్తానిక సంస్థల ఎన్నికలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ప్రచురణపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తడి పొడి చెత్తతో ఎరువుల తయారీపై శిక్షణ



విశాలాంధ్ర- తుర్కయంజాల్: తడి, పొడి చెత్తతో ఎరువుల తయారీ విధానంపై 8 మున్సిపాలిటీల కమిష నర్లకు అవగాహన కల్పించడం జరిగిందనీ సిడిఓ హేమలత, తుర్క యంజాల్ మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సి పాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి డ్రె రిసోర్స్ కేంద్రంలో 8 మున్సిపాలిటీ లకు సిడిఎంఏ, సిడిఓ అధికారుల పర్యవేక్షణలో ఒకరోజు శిక్షణా తరగ తులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక పద్ధతులలో ఘన వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్ నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్, తాండూర్, పరిగి, సదాశివపేట్, నారాయణ కేడ్, ఆందోల్- జోగిపేట్, కోడంగల్, జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధి వృత్తిని ఎంచుకోవాలి



విశాలాంధ్ర - కూకట్‌పల్లి: విద్యార్థులు సమాజ అభివృద్ధికి ఉపయోగపడే వృత్తిని ఎంచుకోవాలని సీనియర్ నాయకులు, సిద్దార్థ కళాశాల చైర్మన్ గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, కోర్టు రిజిస్టర్ తిరుమల రావులు అన్నారు. సిద్దార్థ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో ఫేర్వల్ డే కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు చదువుకున్న విద్య వృధా కాకుండా ఉద్యోగాలు చేసి మంచి పేరును సంపాదించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లు మధుసూదన్ రావు, అరవింద్ రావు, కళాశాల ప్రిన్సిపల్ పద్మాప్రియ, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖి



విశాలాంధ్ర - ఆమనగల్లు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం అమనగల్లు ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. 2023 -24 సంబంధించి 295 పనులకు గాను తనిఖీ నిర్వహించి ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై డిఆర్ డిఓ శ్రీలత, ఇబ్రహీంపట్నం ఏపీడి నరేందర్ రెడ్డి,డివిఓ కొండయ్య, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సునీత, ఎంపిడిఓ కుసుమ మాధురి సమక్షంలో చేపట్టిన పనులను వివరించారు. అంతకు ముందు చేపట్టిన సామాజిక తనిఖీల్లో ఏ ఏ గ్రామాల్లో ఎంత మేరకు తప్పిదాలు చోటు చేసుకున్నది సామాజిక తనిఖీ బృందాలు అధికారులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపిఓ మాధవరెడ్డి, ఈసి, టిఏలు, ఎఫ్ఏలు, పంచాయితీ కార్యదర్శులు, ఎస్ఆర్పి, సురేష్, డిఆర్పిలు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామంలో గ్యాస్ పేలి ఇల్లు దగ్ధమై 3 లక్షల రూపాయల వరకు నష్టపోయిన బాధిత కుటుంబానికి బొల్లెపల్లి గ్రామస్తుడైన భట్టు సారయ్య 2500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా భట్ట సారయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కుటుంబం జాగ్రత్త వహించాలని, ఎప్పటికప్పుడు గ్యాస్‌కు, కరెంటుకు దూరంగా ఉండి పనులు నిర్వహించుకోవాలని కోరారు. బోడ బాలు నాయక్ కృష్ణ పాల్గొన్నారు.

మేడిపల్లి మండలంలో సీపీఐ సభ్యత్వ నమోదు ప్రారంభం

మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యదర్శి డి.జి సాయిల్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శిలు జి.దామోదర్ రెడ్డి, ఉమా

విశాలాంధ్ర- మేడిపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ ముఖ్యంగా కార్మికులకు, కర్షకులకు బడుగు బలహీన వర్గాల కోసం 100 సంవత్సరాల నుంచి పోరాటాలు చేస్తూ శ్రామికుల కోసం కర్షకుల కోసం వారి హక్కుల కోసం పోరాడుతూ 100 వసంతాలు పూర్తి చేసుకోవడం జరిగిందని మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీలో సీపీఐ 2025 సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం ఉదయం రచ్చ కిషన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యదర్శి డి.జి సాయిల్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శిలు జి.దామోదర్ రెడ్డి, ఉమా మహేష్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాలు జరుపుకోవడం భారతదేశంలోనే మొట్టమొదటి పార్టీని అని అన్నారు. రానున్న రోజుల్లో ఇంకా భారతదేశంలో ఉన్న అన్ని వర్గాల కోసం వారి హక్కుల కోసం పోరాటాలు నిరంతరం చేస్తామన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు జె. లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు వి.బి బాలరాజ్, కే ప్రమీల, సిహెచ్. మాధవి. కే మహాలక్ష్మి, బి. ఐలయ్య, బాపరాజు, ఇస్తారి, సోమరాజు, బొందయ్య, ఉప్పలయ్య,, మహేశ్వరి, జ్యోతి, నీలిమ, అండాలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కులగణన - వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల ఘణన, ఎస్సీ వర్గీకరణలపై కాంగ్రెస్ నాయకులకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సబ్ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కో చైర్మన్ మంత్రి దామోదర్ రాజా నర్సింహ, సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ.మల్లు రవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొని ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షిలు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గ బాధ్యులు, పోటీ చేసిన అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే లు, కార్యవర్గ ప్రతినిధులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నవదీప్ | శ్రీకాంత్ | ఆశీశ్ | సాయి ప్రసన్న | జాహ్నవి | స్వాతి

జేఈఈలో బీసీ గురుకుల విద్యార్థుల హవా

అర్హత సాధించిన 53 మంది విద్యార్థినీ, విద్యార్థులు

విశాలాంధ్ర హైదరాబాద్ : ఐఐటీ, ఎన్ఐటీలో ప్రవేశం కోసం 2024-25 సంవత్సరంలో నిర్వహించిన జెఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష లో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో అర్హత సాధించారు.

97.43 పర్సెంటైల్ సాధించిన ఎం నవదీప్

92.08 పర్సెంటైల్ సాధించిన ఎం. జాహ్నవి, 91 పర్సంటైల్ సాధించిన స్వాతి, శ్రీకాంత్, ఆకాష్, 90.46 పర్సెంటైల్ సాయి ప్రసన్న సాధించగా మొత్తం 53 మంది విద్యార్థులు అర్హత సాధించారు. బీసీ గురుకుల పాఠశాలలో మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులనుఎంపిక చేసి కాలేజీ ఫర్ ఎక్సలెన్సీ (సిఓఈ) లో ప్రత్యేకంగా పోటీ పరీక్షల కోసం కోచింగ్ ఇస్తున్నారు. 2024-25 సంవత్స రంలో 53 మంది విద్యార్థినీ, విద్యార్థులు అమ్మాయిలు అర్హత సాధించారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రెటరీ శ్రీధర్, కమిషనర్ బాల మాయ దేవి, మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్, జాయింట్ సెక్రెటరీ తిరుపతి అభినందించారు.

పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలి

ఎంపీ కృష్ణయ్య

విశాలాంధ్ర-బషీర్‌బాగ్ : పంచాయతీరాజ్ ఎన్నికల్లో పార్టీ పరంగా 42 శాతం కాదు, చట్ట ప్రకారం పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నీల వెంకటేష్ అధ్యక్షతన 14 బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఎన్నికలలో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం కోటా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో పార్టీ పరంగా 42 శాతం ఇస్తే బీసీలకు న్యాయం జరగదని అన్నారు. ఇతర పార్టీల వారు కూడా అంగీకరిస్తే అప్పుడు న్యాయం జరుగుతుందన్నారు. లేకపోతే అగ్ర కులాలకు ఇస్తే డబ్బుతో పోటీ పడలేరని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ బిల్లు పెట్టి చట్టం చేయాలన్నారు. అప్పుడు అన్ని పార్టీలు కూడా బీసీలకు ఇస్తాయని, తద్వారా తప్పని సరిగ్గా బీసీలు గెలుస్తారన్నారు. ఈ సమావేశంలో వేముల రామకృష్ణ, గొరిగె మల్లేష్ యాదవ్, నందగోపాల్, మోదీ రాందేవ్, శివ, రవి యాదవ్, జయంతి, కీర్తిలత, ఉదయ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై గాంధీని కలిసిన రాంనగర్ వాసులు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ రాంనగర్ ఏ బ్లాక్ కాలనీ వాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించారు. శ్రీరామ్ నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ శ్రీరామ్ నగర్ కాలనీ లో మౌలిక వసతులు కలిపించినదుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం అని అదేవిధంగా శ్రీ రాంనగర్ కాలనీలో ప్రధాన రహదారి నుండి కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వరకు రోడ్డు వేయాలని కాలనీలో అంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్డును వేయాలని, మంచి నీటి వ్యవస్థ ను మెరుగుపర్చలని, విధి దీపాలను వ్యవస్థను ఏర్పాటు చేయాలని గాంధీని కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలోనే శ్రీరాం నగర్ కాలనీ లో పర్యటిస్తానని, శ్రీ రాంనగర్ కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని. త్వరలనే ప్రభుత్వ ఆసుపత్రి వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని రోడ్ల ను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని అధికారులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చాంద్ పాషా, శ్రీ రాంనగర్ కాలనీ ప్రెసిడెంట్ శివకుమార్, విజయ్ కుమార్ ,వెంకట రమణ, రాజ్ కుమార్, నారాయణ, మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ మహా పడిపూజ

విశాలాంధ్ర - కూకట్‌పల్లి: పరమేశ్వరుని కృప కటాక్షాలు ప్రజలం దరిపై ఉండాలని శ్రీ హరి హర క్షేత్ర దేవస్థానం పాలకమండలి చైర్మన్ డాక్టర్ పి.నాగిరెడ్డి అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని భరత్ నగర్ శ్రీహరి హర క్షేత్ర ఆలయ ప్రాంగణంలో కోహిర్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శివ మహా పడిపూజ కార్యక్రమంలో నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖిక్షంగా ఉండాలని, కష్టనష్టాలను తట్టుకొని ప్రతి ఒక్కరు వారి జీవితంలో ఉన్నతంగా రాణించాలని వారందరికీ పరమేశ్వరుని అనుగ్రహం సిద్దించాలని ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు.

రైతుల కళ్లలో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

విశాలాంధ్ర తొర్రూరు: తెలంగాణ రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని కర్కాల గ్రామంలో ఇటీవల సాగునీటి కొరత సమస్య ఉండడంతో ఉన్నత అధికారులతో మాట్లాడి బుధవారం కర్కాల చెక్ డ్యామ్ పరిశీలించి పసుపు కుంకుమ పూలు చల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెలికట్ట శివారు పెద్ద మంగ్య తండా పరిధిలోని ఎస్సారెస్పీ కాలువ మధ్యలో పెద్ద బండ ఉండ డంతో సాగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడడం వల్ల రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో తన సొంత ఖర్చుతో బండలు తొలగించి పూడికతీత పనులు చేయించి రైతులకు సాగునీరు అందేలా చేపట్టినట్లు తెలిపారు . రైతుల సంక్షేమమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. సాగునీటి సమస్య రాకుండా అధికారులతో మాట్లాడి బయన్న రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేయిస్తే బిఆర్ఎస్ నాయకులు తాము సాగునీరు అందించామని ప్రచారం చేయడం సిగ్గుచేట న్నారు. రైతులకు అందుబాటులో ఉండి కష్టపడేది ప్రజా ప్రభుత్వమైతే తాము చేశామని ప్రతిపక్షాలు ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సాగునీరు అందించేందుకు అధికారులతో మాట్లాడి మైలారం రిజర్వాయర్ ద్వారా 8 చెక్ డ్యామ్‌లను నింపడం జరిగింద న్నారు. పెద్ద మంగ్య తండ పరిధిలో కెనాల్ కాలువలో గత ప్రభుత్వ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల మధ్యలో బండ ఉండడంతో వదిలి పోయారని, దీంతో రైతులు నష్టపోకుండా తన సొంత ఖర్చుతో బండను తొలగించి సాగు నీటిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అను మాండ్ల తిరుపతిరెడ్డి, టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయ కులు గంజి విజయపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, తొర్రూర్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, ధరావత్ సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్‌సీ డబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కేటాయింపు



విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియాలోని ఎన్సి డబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కేటాయింపులో కౌన్సిలింగ్ నిర్వహించిన పారదర్శకంగా కేటాయించడం జరిగిందని ఏరియా ఇన్చార్జి ఎస్ఓటు జిఎం ఎమ్. వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కొత్తగూడెం ఏరియా లోని ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. క్వార్టర్స్ కౌన్సిలింగ్ కు 84 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఉద్యోగుల అర్హత, కేటగిరి, పదవిని బట్టి ఇలాంటి విమర్శలకు తావు లేకుండా కౌన్సిలింగ్ ద్వారా కేటాయించటం జరిగిందన్నారు. 84 దరఖాస్తులకు గాను 39 మంది వారి అర్హతకు తగిన క్వార్టర్స్ ను తీసుకోగా, 7 గురు కౌన్సిలింగ్ కి హాజరైనప్పటికీ తీసుకోలేదన్నారు. 38 మంది అసలు కౌన్సిలింగ్ కు హాజరు కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ ఓ టు జిఎం తోపాటు ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వి. మల్లికార్జున రావు, ఐఎన్ టి యుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, డిజిఎం బి. శివ కేశవరావు, ఇంజనీర్ లక్ష్మణమూర్తి, రాజారామ్, పిఓ ఎం.మురళి, జి సంఘమిత్ర పాల్గొన్నారు.

మినీ మేడారం జాతరలో భక్తుల సందడి

విశాలాంధ్ర బ్యూరో-ములుగు జిల్లా : ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారంలో మినీ మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం నుండి ప్రారంభం అయింది.జాతర కు ఇతర రాష్టాల నుండి, జిల్లాలాల నుండి భక్తులు బుధవారం పోటీతిపోయారు.12 బుధవారం నుండి 15 శనివారం వరకు మినీ మేడారం జాతర జరుగు తుంది. ముందుగా మేడారం జాతర పూజా రులు అమ్మవారికు, గుడిలో ప్రత్యేక పూజలు చేసి,డోలి సన్నాయి మేళ్లతో అమ్మవారిని గద్దెలపైకి తెచ్చారు.ఇప్పటికే వేలాది మంది, భక్తులు మేడారం వచ్చి, అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్నారు. మేడారంలో ఎక్కడ చూచిన భక్తుల సందడి కనిపిస్తుంది. జంపన్న వాగులో, భక్తులు పుణ్య స్థాన్నాలు, పునాకాలతో జంపన్న వాగులో భక్తుల సందడి కనిపించింది. మేడారం భక్తుల కోసం వివిధ రకాల దుకాణాలు, తదితర షాపులు వెలిసాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా, పోలీస్ లు బందబస్తు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమం లో మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ద బోయిన జగ్గారావు, పూజారులు, కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-కొమరం భీం : రెబ్బెన మండలంలోని అతి ప్రాచీన పురాతన శ్రీశ్రీశ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు మాఘ పౌర్ణమి సందర్భంగా జాతర మహోత్సవానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షులు విశ్వ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మూడు రోజులు అట్టహాసంగా జరిగే జాతర మహోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఏర్పాట్లు చేసిందని భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు తెలుగు ప్రజల అందరిపై ఉండాలని కోరినట్లు తెలిపారు.

వరంగల్ వచ్చే ధైర్యం లేక రాహుల్ గాంధీ పారిపోయారు

మార్చి 8న మహిళా శంఖారావం : ఎమ్మెల్సీ కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్: గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో మంగళవారం వరంగల్‌కు రావాల్సిన రాహుల్ గాంధీ అక్కడికి రాకుండా పరిపోయారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. హామీలపై ప్రజలు నిలదీస్తారనే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని పేర్కొన్నారు. అదే వరంగల్‌లో రాహుల్ చేసిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని, వరంగల్ డిక్లరేషన్ పై రైతులు ప్రశ్నిస్తారని రాహుల్ భయపడ్డారన్నారు. బుధవారం నాడు తన నివాసంలో జాగృతి కార్యకర్తలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకో బోరని స్పష్టం చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మడం లేదని ఎన్నికలప్పుడు దిల్లీ నుంచి నాయకు లను తీసుకొచ్చారని అలాగే ఇక్కడికి వచ్చిన సోనియా, గాంధీ, రాహుల్ వచ్చి చిలుక పలుకులు పలికారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు, సోనియా, ప్రియాంకా, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు రూ.2500 ఇవ్వడం లేదని, ఈ లెక్కన రేవంత్ రెడ్డి మహిళలకు రూ.35 వేల చొప్పున బాకీ పడ్డారన్నారు. రూ. 35 వేలను ప్రతీ మహిళా బ్యాంకు ఖాతాలో జమా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా శంఖారావం నిర్వహిస్తామకవిత వెల్లడించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని, రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని విమర్శించారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆ రెండు ఒక్కటే అని అన్నాడే చెప్పాం

రేవంత్ రెడ్డి డీఎన్ఏలో బీజేపీ రక్తం : కొప్పుల

విశాలాంధ్ర - హైదరాబాద్: కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఒకటేనని బీఆర్ఎస్ మొదటి నుంచి చెబుతూనే ఉందని, ఆ రెండు పార్టీలు ఒకే గూటి పక్షులని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. నువ్వు కొట్టినట్టు చేస్తే.... నేను ఏడ్చినట్టు చేస్తా.... అన్నట్టుగా రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ తీరు ఉంద న్నారు. ఇరు పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం ఇప్పటికే పలుమార్లు బయటపడిందని గుర్తు చేశారు. ప్రధాని టూర్‌లో మోదీని తన పెద్దన్నగా ఒప్పుకున్నది రేవంత్‌రెడ్డి కాదా పని ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయ్యాకా మంచి స్నేహితులు అయ్యాయని, ఇది దిల్లీ ఎన్నికల్లో రుజువైంది, కాంగ్రెస్ ఓటు బ్యాంకు బీజేపీకి పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయ న్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ పాలనలో రైతులు, ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు, అలాగే హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్ళను రేవంత్ రెడ్డి నెలమట్టం చేస్తున్నారని విమర్శించారు.

వృక్షార్చనలో వెయ్యి మొక్కలు నాటిన కడియం నర్సరీ రైతులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పిలుపు మేరకు వృక్షార్చనలో భాగంగా రాజహేంద్రవరంలోని కడియం నర్సరీల రైతుల ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రైతులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కడియం నర్సరీ రైతు పాలూరి నాని ఆధ్వర్యంలో 1000 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం చాలా ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. కేసీఆర్ 10 సంవత్సరాల తమ ప్రభుత్వంలో హరితహారం కార్యక్రమం ద్వారా పచ్చదనం పెంచడం కోసం 280 కోట్ల మొక్కలను నాటడం జరిగిందని గుర్తుచేశారు.ఈ కార్యక్ర మంలో మాధవ్ కడియం, రైతులు బాలాజీ, ఈల సత్యనా రాయణ, శ్రీనివాసరావు, నిమ్మలపూడి త్రిమూర్తులు, హరిత సేవ నాయకులు రాఘవ, కిశోర్ గౌడ్, పూర్ణ చందర్, పాండాల జగన్మోహన్, మురళీకృష్ణ, సతీష్, ఎన్.ఎన్. రాజు, భోజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌కు ఓ న్యాయం బీజేపీ పెద్దలకు ఓ న్యాయమా : వీహెచ్

విశాలాంధ్ర - హైదరాబాద్: దేశంలో రాహుల్ గాంధీకి ఒక న్యాయం బీజేపీ పెద్దలు అయిన అమిత్ షా, మోహన్ భగవత్‌కు ఇంకో న్యాయం ఉంటుందా అని మాజీ ఎంపీ.వి.హనుమంతరావు ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అందరికి సమానమే కదా అంటూ పోలీసులను నిలదీశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపెన్స్‌పై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశాడని 2022 డిసెంబర్ 16 రాహుల్ గాంధీ పై కేసు పెట్టారని అందులో భాగంగా మార్చి 24న లక్నో కోర్టుకు రావాలని రాహుల్ గాంధీకి సమన్లు పంపారని గుర్తు చేశారు. అదే సమయంలో రాజ్యాంగాన్ని అమిత్ షా అవమనిచడాని నేను పిర్యాదు చేశానని, అలాగే మోహన్ భగవత్ స్వతంత్ర్యాన్ని అవమానిం చడాని ఆయన పై కూడా పిర్యాదు చేసినట్లు చెప్పారు. కానీ ఈ ఇద్దరి మీద ఇప్పటివరకు కేసు పెట్టలేదు ఎఫ్ఐఆర్ లేదని మండిపడ్డారు. ఫిబ్రవరి 14న దామోదరం సంజీవయ్య పుట్టిన రోజు సందర్భంగా అందరూ ఆయన సమాధి దగ్గరకు రావాలని కోరారు. అంబేద్కర్ తర్వాత ప్రజల పక్షాన ఉన్న వ్యక్తి సంజీవయ్య అని సంజీవయ్య స్మృతి వనం కట్టించాలని సంజీవయ్య ట్రస్టీ చైర్మన్‌గా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర-మల్కాజిగిరి : ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మిర్జాలుకూడాకు చెందిన కె.లావణ్యకు మంజూరైన 39 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవుల చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత వ్యక్తులుగా ఎదగాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర- హైదరాబాద్ : నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా కష్టపడి చదివినప్పుడే అనుకున్న ఫలితాలు సాధించవచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహమును ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలోని వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, పుస్తకాలు, మ్యాట్రెస్ తగినన్ని ఉన్నాయా, వసతి గృహంలో ప్రతిరోజు దినపత్రికలు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి తల్లిదండ్రులను విడిచి వసతి గృహంలో ఉండి చదువుకుంటున్నారని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియం చేసుకొని, లక్ష్యం నిర్దేశించుకుని పట్టుదల బాగా చదివి ఉన్నత స్థానాలలో నిలబడి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కోటాజి, ఆర్డీఓ సాయి రామ్, ఏఎస్‌డబ్ల్యూ మోహన్, హాస్టల్ వార్డెన్ మనోహర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌బాగ్ వెంకన్న ఆలయానికి అభివృద్ధి కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-మల్కాజిగిరి : తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఉత్తర్వుల ఆదేశాల మేరకు ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గంను బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కె.మోహన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.బి.రవీంద్ర రెడ్డి సమక్షంలో భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సానాది శంకర్, గుడిదేన పద్మావతీ, జెక్కనీ శ్రీధర్ (రాజు) నిజం పురం, మోర పాండు శ్రీకాంత్, వెలమాజాల రవీందర్ రెడ్డి, బొంద్లి కుమార్ సింగ్, వడ్ల ఏగొండ, పెండం అనిత, మన్య హేమంత్ కుమార్, వెంకట స్వామి, కొత్త సంజయ్ కుమార్, బండారు రత్నాకర్ రావు, పిట్ల గణేష్(కన్నా)లు కమిటీ సభ్యులు 14 మంది వీరి కాల పరిమితి ఒక సంవత్సర కాలం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.బి రవీంద్ర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, నాయకులు వెంకటేష్ యాదవ్, జి.ఎన్.వి. సతీష్ కుమార్, శ్రీనివాస్, గుండా నిరంజన్, మాజీ చైర్మన్లు ఉమేష్ సింగ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, చరణ్ జీత్ గౌడ్, వినోద్ యాదవ్, మహేందర్ గౌడ్, శారద, లక్ష్మీ, నిర్మల, ఇందిరా ప్రియదర్శిని, మహేందర్ గౌడ్, నాగేష్ గౌడ్, ఇస్తారి, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల వస్తువులకు భద్రత కురువు

విశాలాంధ్ర, మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రిలో రోగులకు, వారి వస్తువులకు భద్రత లేకుండా పోతుంది. ఇటీవల ఓ సెక్యూరిటీ సిబ్బంది మద్య సేవించి తన ఇష్టానుసారంగా వ్యవహరించగా, మంగళవారం రాత్రి వార్డులో ఉన్న మహిళ వంటిపై ఉన్న బంగారం గోలుసు ఎత్తుకెళ్ళడం గమనార్హం. రాత్రిళ్ళు సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నట్లు అనే అనుమానం వ్యక్తం అవుతోంది. లక్ష రూపాయలు విలువచేసే తులం బంగారం దొంగిలించిన వారు ఎవరై ఉంటారనే దానిపై మల్కాజిగిరి పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మల్కాజిగిరి వాణి నగర్‌లో నివాసం ఉండే సుద్దాల ఉష గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. అయితే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఆదివారం ఉదయం అడ్మిట్ అయింది. మంగళవారం రాత్రి ఉష మెడలోని గొలుసు బుధవారం ఉదయం ఆరుగంటలకు లేచి చూసుకునే సరికి గోలుసు కనిపించకపోవడంతో గొలుసు అపహరణకు గురైందని గుర్తించిన ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత దృష్టికి తీసుకువెళ్లగా ఆమె దురుసుగా ప్రవర్తించి ఎవరికైనా చెప్పుకోమని దుర్భాషలాడినట్లు బాధితురాలు వాపోయింది. బాధిత కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదుల చేసిట్లు తెలిపారు. స్టేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డి.ఐ శ్రీశైలం బాధితుల నుండి ఫిర్యాదు స్వీకరించి తమదైన శైలిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మళ్లీ ఎన్నికలు

ఎన్నికల కమిషన్‌కు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు సూచన

విశాలాంధ్ర, హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక నామినేషన్ వస్తే ఏకగ్రీవానికి తావు ఇవ్వకూడదని, ఒక వేళ ఒక్కటే నామినేషన్ వస్తే, నోటా' గుర్తుతో కలిపి ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించారు. నోటాను స్వాగతిస్తున్నామని, అభ్యర్థి కంటే 'నోటా'కు ఎక్కువ ఓట్లు పోలేతే మళ్లీ ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో సీపీఐ తరపున తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నోటాకు ఎక్కువ ఓట్లు పోలైే, ఆ తర్వాత స్థానంలో ఉన్న అభ్యర్థిని ప్రకటించవద్దని కోరారు. మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలలో నోటాకు ఓట్లు ఎక్కువగా పోలయితే, మళ్లీ ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని శ్రీనివాస్ గుర్తు చేశారు. ఇదే విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. ఏకగ్రీవం పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలలో ఇతర పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వేలం పాటలు వేసి పదవులను కొనుగోలు చేస్తున్నారని, ఇది రాజకీయాల్లో మంచి సాంప్రదాయం కాదని హితవుపలికారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రతి నిరుపేదలకు ఇళ్లు ఉండాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలులో భాగంగా అర్హులకు ఇళ్ళను అందించడమే కాకుండా మౌళిక వసతులను కల్పిస్తున్నా మని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కీసర మండలంలోని కీసర, చీర్యాల గ్రామాలలో అర్హులైన 71 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను పంపిణీ చేసే కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు రేషన్ కార్డు, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని అన్నారు. పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల కాలనీలలో మంచినీటి సదుపాయాలు, మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసి, ప్రస్తుతం ఎకరాకు రూ.6000 చొప్పున రైతు భరోసా అందిస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ, ఎవరు కార్డు రాలేదని బెంగ పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అంతకు ముందుగా కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ శర్మ పాలకవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించినారు. ఈనెల 26 నుండి ప్రారంభమయ్యే శివరాత్రి బ్రహ్మోత్సవాల కు సుమారు 6 లక్షల మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. భక్తుల కోసం 350 ఆర్టీసీ బస్సులు, బస్ స్టాప్ నుండి గుట్ట పైకి 8 ఉచిత బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. 40 మంది అధికారుల పర్యవేక్షణలో 1800 మంది పోలీసులతో గట్టి బందోబస్తు, పార్కింగ్, మంచినీటి సదుపాయాలు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం వంటి ఏర్పాట్లు చేయాలన్నారు.

పూర్తయిన పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర, హైదరాబాద్ : నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం, ప్రత్యేక అభివృద్ధి నిధులతో పూర్తిచేసిన పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీడీపీ, ఎస్‌డిఎఫ్, దిశా, పిఎంఎం స్వానిధి పీఎం విశ్వకర్మ తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని సమీక్షించారు. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం, ప్రత్యేక అభివృద్ధి నిధులతో జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిపై శాఖల వారీగా ఆయన సమీక్షించారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పూర్తయిన పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం కింద రుణాలు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ పెట్టి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు అందించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక, ఎంపికైన లబ్ధిదారులకు త్వరితగతిన రుణాల అందించాలన్నారు. త్వరలో దిశ సమావేశం ఏర్పాటు చేయనున్నందున పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ, బ్యాంకు లింకేజీ, హౌసింగ్ ద్వారా మందికి రుణాలు ఇచ్చారు. ఇంకా ఎంత మందికి ఇవ్వవలసి ఉంది అనే కచ్చితమైన సమాచారంతో సమావేశంలో పాల్గొనాలని కలెక్టర్ అధికారుల ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్వో ఈ.వెంకటాచారి, యుసిడి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, ఎల్‌డిఎం సుబ్రహ్మణ్యం, అధికారులు జీఎం ఇండస్ట్రీ పవన్ కుమార్, డీఈవోఆర్ రోహిణి, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకట్, ప్రణాళికా శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సురేందర్, డి టి డబ్ల్యూ ఓ ఆర్ కోటజీ,డిఎండబ్ల్యూఓ ఇలియాజ్ అహ్మద్, ఈఈ షఫీమియా, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగర వాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా రోడ్లు, పార్కులు, మౌలిక వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె బంజారా హిల్స్ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 13, మినిస్టర్స్ క్వార్టర్స్ రోడ్డులో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, వీటిని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యమని తెలిపారు. మౌలిక వనరుల అభివృద్ధిలో భాగంగా, ముఖ్యంగా రోడ్ల పటిష్టతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మేయర్ పేర్కొన్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని ప్రేమ్ నగర్ పార్కును జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో పునరుద్ధరించి బుధవారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా పార్కులను అభివృద్ధి చేయడం ముఖ్యమని, నగరంలోని వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్ స్పేస్‌లు, పార్క్‌లకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పార్కులను వినియోగించుకోవాలని మేయర్ సూచించారు. నగరాభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడానికి కృషి చేస్తున్నామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈ.ఈ విజయ్ ఆయా విభాగాల అధికారులతో పాటు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో 22, 23న కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : చాలా ప్రతిష్టాత్మకంగా కోల్ ఇండియా వ్యాప్తంగా ఉన్న మహిళ, పురుష అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం వేదిక కానుంది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఏర్పాట్లపై బుధవారం సింగరేణి కార్యాలయంలో జీఎం (పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ అండ్ పీఎం కవితా నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు ఈ నెల 22 నుంచి 23 వరకు రెండు రోజులు జరగనున్నాయి. ఈ సమీక్షా సమావేశంలో కార్పొరేట్ ఏరియా ఈ అండ్ ఎం, సెక్యూరిటీ, సివిల్, ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్స్, పర్చేస్, ఫారెస్ట్, మెడికల్ డిపార్ట్‌మెంట్ల అధికారులు పాల్గొని నిర్వహణ పై చర్చించారు. కవితా నాయుడు మాట్లాడుతూ ఈ పోటీలకు కోల్ ఇండియా పరిధిలోని లోని మొత్తం 10 బొగ్గు సంస్థల జట్లు తలపడుతాయన్నారు. ఈ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లను ఎలాంటి లోటు పాట్లు లేకుండా చేయాలన్నారు. వేడుకలకు ముఖ్య అతిథిగా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత కార్పొరేట్ ఏరియా అధికారులపై ఉందన్నారు. అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమీక్షలో జీఎం ఎన్.దామోదర రావు, డిజిఎంలు జి.రాజేంద్ర ప్రసాద్, పి.రాజశేఖర్, ఏసిఎంఓ కే.నాగరాజు, ఎస్ఓ టు జీఎం వేణు మాధవ్, ఎస్ఈ రామ శేషయ్య, మేనేజర్ డేవిడ్ అభిలాష్, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ,వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: భూముల రిజిస్ట్రేషన్ విధానాల్లో జరిగిన మార్పులతో ఉత్పన్నమైన సమస్యలను త్వరగా పరిష్కరించేలా సాయం చేయాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారం పరిధి మహాదేవపురం వెంచర్ వారు 30 సంవత్సరాలుగా అక్కడ నివాసం ఉంటూ దాదాపుగా 100 పైగా ఇళ్లను నిర్మించుకున్నారు. ప్రస్తుతం అక్కడ నూతనంగా రిజిస్టేషన్, పర్మిషన్ కొరకై అధికారులను సంప్రదించగా వారి స్థలాలు ప్రొహిబిటెడ్ సమస్యలో ఉన్నాయని స్థానిక ప్రజలకు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ ఇబ్బందులను ఎదుర్కొంటూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హన్మంత్ రెడ్డికి సమస్య గురించి విన్నవించారు. అనంతరం హన్మంత్ రెడ్డి బుధవారం రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రొహిబిటెడ్ సమస్య ఉందని మంత్రికి విన్నవించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి వాటి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా కడ్తాల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - ఆమనగల్లు: కడ్తాల్ పట్టణ కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజున దేవాలయంలో ప్రముఖ ఉపాసకులు జ్ఞాన ప్రసూనాంబ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామం, అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనతో సహస్ర పారాయణం మొదలగు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను శాలువాలతో సత్కరించి, ప్రత్యేక కుంకుమార్చన భరణిలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, గ్రామ పెద్దలు గూడూరు సాయి రెడ్డి, గూద రాములు, బ్రహ్మాచారి, గూడూరు జంగారెడ్డి, బాచిరెడ్డి అశోక్ రెడ్డి, అమృతం పాండు ఆలయ అర్చకులు తిరునగిరి శ్రీధర్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం శీతకన్ను

తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ

విశాలాంధ్ర- హైదరాబాద్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు మండి పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నెరవేర్చ కుండా అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), పి.శ్రీకాంత్ (సి.ఐ.టి.యు) ఎంఏ. సలీం, ఎండి.నజీర్ (యు.టి.ఏ.డబ్ల్యూ.ఏ), నిరంజన్ (బి.ఆర్.టి.యు), వి.ప్రవీణ్ (టియుసిఐ), రామ్ రెడ్డి (ఐ.ఎఫ్.టి.యు) సిహెచ్.జంగయ్య, ఎస్.అశోక్, ఎం.శ్రీనివాస్, ఎం.కృష్ణ (ఏఐటీయూసీ) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ 2014 నుండి పెండింగ్‌లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించకుండా మోసం చేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించ కుండా మోసపూరిత వైఖరి అవలంబిస్తోం దని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత కొంత కాలంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ చేస్తున్న ఆందోళనలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించు కోకపోవడం, సమస్యలను పరిష్కరించ కుండా దాటవేస్తుండడం అన్యాయమ న్నారు. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు, రాష్ట్ర ప్రభుత్వమే రవాణా అప్ ఏర్పాటు, స్కూల్ వ్యాన్లు, ఓలా, రాపిడో, ఉబెర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలని వంటి న్యాయమైన జేఏసీ డిమాండ్‌లు ఉన్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి పరిష్క రించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ, న్యాయమైన ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరా బాద్ నారాయణగూడ ఫ్లై ఓవర్ కింద రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్నా మని, అలాగే ఈ నెల 24న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి బాగ్ లింగంపల్లి సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ రెండు కార్యక్రమాలకు ఆటో డ్రైవర్లు అందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ బి.వెంకటేశం విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహిద్దాం

సిబ్బంది శిక్షణలో అదనపు కలెక్టర్ నగేష్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: త్వరలో జరగనున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, డిఎల్పిఓలకు మొదటి దశ శిక్షణ నిర్వహించారు. జిల్లాలోని 492 గ్రామ పంచాయతీలు, 190 ఎంపీటీసీ స్థానాలు, 21 జెడ్పీటీసీ స్థానాలకు, వార్డు సభ్యులు 4220 స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి ముందస్తుగానే అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా ముందుకు సాగాలని సూచించారు. ఈ శిక్షణలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, డిఆర్డీఓ శ్రీనివాసరావు, డిఈఓ ప్రొ. రాధాకిషన్, డిఎస్ఓ రాజిరెడ్డి, ఎంపీడీఓలు, ఎంపీఓలు, డిఎల్పిఓలు పాల్గొన్నారు.

కీసరగుట్ట పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర- మేడిపల్లి: కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానం మహా మండపంలో బుధవారం ఉదయం కీసరగుట్ట పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్, ఘట్‌కేసర్ చైర్మన్ పావని జంగయ్య, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ పాల్గొన్నారు. అధికారికంగా తటాకం నారాయణ శర్మ పాలకమండలి చైర్మన్ ఇతర ట్రస్టు బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ కీసరగుట్ట దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయంలో అన్ని మతాల దేవాలయాలను సమదృష్టితో అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. సభ్యులందరూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు హఠాన్మరణం

విశాలాంధ్ర-మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ పరిధి పని చేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న సర్కిల్ ఉద్యోగులు హాజరై ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, సర్కిల్ ఉప కమిషనర్ జి.రాజు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాగరాజు భౌతిక కాయానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాగరాజు అందరితో కలిసి పని చేసే తత్వం ఉన్న ఉద్యోగి అని, ఏ పని చెప్పినా ఆ పని పూర్తి చేసి తిరిగి తెలియజేసే వారని ఆయన తెలిపారు. వారి పిల్లలకు రూ.5లక్షలు ఫిక్సిడ్ డిపాజిట్ చేయిస్తానని, ప్రభుత్వం నుండి డబుల్ బెడ్‌రూం, పిల్లల చదువుకు తాను సహకరిస్తానని ఆయన తెలిపారు. దహన సంస్కారాల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.50వేలను అందజేశారు. ఆయన ఉద్యోగం పర్మనెంట్ చేయాలని ఎంతగానో ప్రయత్నం చేసి మనోవేదనకు లోనవడంతో ఈ పరిస్థితి నెలకొన్నదని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, ఈ.ఈ.లక్ష్మణ్, మల్కాజిగిరి సర్కిల్ ఏఎంహెచ్ఓ మంజుల, డి.ఈ.ఈ.మహేష్, ప్రాజెక్టు అధికారి మల్లికార్జున్, ఏ.ఈలు, సి.ఓలు, ఎస్ఎఫ్ఏలు, శానిటేషన్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, రాము, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, జి.ఎన్.వి.సతీష్ కుమార్, జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు హాజరై నివాళులర్పించారు.

పర్మనెంట్ చేయడం లేదనే మనోవేదనతోనే...

నాగరాజు గత 25 ఏళ్ళుగా మున్సిపల్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. కాంట్రాక్ట్ క్రింద తాను పని చేస్తూ తనను పర్మనెంట్ చేయాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు సైతం పర్మనెంట్ చేయాలని అధికారులకు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు పట్టించుకోపోవడంతో మళ్ళీ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆయన్ను పర్మనెంట్ చేయమని చెప్పింది ఆయన అధికారులు ఆ ఫైల్‌ను ఏళ్ళ తరబడి వారి వద్ద పెట్టుకుంటుండడంతో ఆయన మనోవేదనకు గురై ఈ విధంగా పరిస్థితి తయ్యారైందని ఆయన కుటుంబ సభ్యులు చర్చించుకోవడం కనిపించింది. ప్రభుత్వం వారి కుటుంబాన్ని అదుకునే విధంగా ఉద్యోగం వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే విధంగా చూడాలని పలువురు కోరారు.

వైద్య అధికారి అకస్మిక తనిఖీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.సి.ఉమా గౌరి బుధవారం యూపీహెచ్‌సీ మల్లాపూర్ పరిధిలోని మారిగూడ బస్తీ దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి, బీడీకే సేవలను సమీక్షించారు. ఎప్పుడైనా ఉన్నతికారులు సందర్శన చేసే అవకాశం ఉన్నందున, సిబ్బంది పూర్తిగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఈ అధికారైన సమస్యలను పరిష్కరించేనా...!

మేడ్చల్-మల్కాజిగిరి వైద్య ఆరోగ్య అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సి.ఉమా గౌరి జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, సౌకర్యాల కొరతపై దృష్టి సారించనుండా లేక తూతూ మంత్రంగా వ్యవహరించనుందా అనే సందేహం పలువురు వైద్య సిబ్బందిలో వ్యక్తం అవుతోంది. కొన్ని బస్తి దావఖానాల వైద్యలు, పిహెచ్‌సిల వైద్యలకు కనీస సౌకర్యాలు లేకపోవడం, సిబ్బంది కొరత ఉండడంతో సరైన సేవలు అందించలేని పరస్థితి నెలకొంటుంది. బస్తి దావఖానాలో పని చేసే వైద్య సిబ్బంది విధులను సరిగా హాజరు కాని పరిస్థితి ఉన్నా మొన్నటి వరకు పని చేసిన వైద్య ఆరోగ్య అధికారి పట్టించుకున్న సందర్భాలు లేవని పలువురు పేర్కొంటున్నారు. కొన్ని పిహెచ్‌సిల్లో బదిలి అయిన వారి స్థానంలో ఇంకా బర్తి కాని పరిస్థితి నెలకొంది. బదిలి అయిన వారి స్థానాల్లో కొత్త వారిని నియమించేనా అనే సందేహం వ్యక్తం అవుతోంది.

యువతిపై హత్యాయత్నం... యువకుడి అరెస్ట్

విశాలాంధ్ర- హుజూర్‌నగర్: యువతిపై పెట్రోల్‌తో హత్యాయత్నం చేసిన యువకుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్.ఐ ముత్తయ్య కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం మోటమర్రి గ్రామానికి చెందిన సుందర్ ప్రమోద్ కుమార్ (23)కి అదే గ్రామానికి చెందిన ముస్లిం యువతికి పరిచయం ఉంది. నిందితుడికి యువతి కాలేజీలో జూనియర్, ఇద్దరూ ఒకే గ్రామం కావడంతో తనను ప్రేమించాలని నిందితుడు యువతని ఇబ్బంది పెడుతుండడంతో హుజూర్ నగర్ పట్టణంలోని తన మేనమామ వద్ద ఆ యువతి ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఆ విషయం తెలుసుకున్న నిందితుడు సుందర్ ప్రమోద్ కుమార్ ఫిబ్రవరి 10వ తేదీన మద్యాహ్నం 02-30 గంటల సమయంలో బాధితురాలికి ఫోన్ చేసి మాట్లాడాలి రమ్మని కోరగా, ఆమె బయటకు రాగా, తనను ఎందుకు ప్రేమించడం లేదని, ఆమెతో గొడవపడి.. తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ లో ఉన్న పెట్రోల్ ఆమెపై చల్లి, చంపడానికి ప్రయత్నించాడని యువతి పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి,నిందితుడిని అరెస్టు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్ఐలు బలరాం రెడ్డి, సురేందర్, సిబ్బంది ఉన్నారు.

'అగ్రిగోల్డ్' సమస్యల పరిష్కారంపై
కాలయాపన ఎందుకు?

- ప్రభుత్వానికి అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సూటి ప్రశ్న
- మా సూచనలు పరిగణనలోకి తీసుకోండి
- బాధితులకు సత్వర న్యాయం చేయండి
- అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల విజ్ఞప్తి

విశాలాంధ్ర-అమరావతి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, తమ అసోసియేషన్ సూచనలను పరిగణనలోకి తీసుకుంటే... వాటి పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు చెప్పారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న అసోసియేషన్ రాష్ట్ర సమితి విస్తృతస్థాయి సమావేశం పల్నాడు జిల్లా అమరావతిలోని జేబీ గార్డెన్స్‌లో బుధవారం ఉదయం ప్రారంభమైంది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, బాధితులను ఆదుకునేందుకు సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2024లో జరిగిన ఎన్నికల సందర్భంగా టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఐడీ అధిపతి రవిశంకర్ అయ్యన్నార్ అసోసియేషన్ ప్రతినిధులతో తరచుగా చర్చిస్తున్నప్పటికీ అడుగు ముందుకు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్, రిజిస్ట్రార్, అడ్వకేట్‌తో కమిటీ వేసి... ఆ కమిటీకి నెల రోజుల సమయం ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి... బాధితుల సమస్యలు తెలుసుకునే బాధ్యతను, అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకునే బాధ్యతను అప్పగించాలని కోరారు. అదేవిధంగా అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణ బాధ్యత మండల స్థాయిలో తహసీల్దారు, ఎస్ఐకు అప్పగించాలని సూచించారు. 11 వేల కేసులు ఉన్న ఏలూరు కోర్టులో అగ్రిగోల్డ్ కేసు ఎప్పటికి ముగుస్తుందని ప్రశ్నించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ కేసు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పై రెండు అంశాలకు పైసా ఖర్చు పెట్టాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదని చెప్పారు. అగ్రిగోల్డ్ భూములలో వ్యవసాయానికి పనికొచ్చే భూములను రెండు, మూడు ఎకరాలుగా విభజించడంతోపాటు ఇళ్ల స్థలాలకు పనికొచ్చే భూములను వెంచర్లుగా వేసి ఉడా లాంటి సంస్థను ఏర్పాటు చేసి అమ్మకానికి పెడితే... అవి ఎవరో ఒకరు కొనుగోలు చేస్తారని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలవడానికి అపాయింట్‌మెంట్ కోరామని, రెండు రోజులు జరిగే విస్తృత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రికి వివరిస్తామని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన అవసరమైతే మరో దీర్ఘకాలిక ఆందోళనకు సిద్ధమవుతామని, ఆ పరిస్థితి రాకుండానే తమకు న్యాయం జరుగుతుందని ఆకాంక్షిస్తున్నామని ముప్పాళ్ల వెల్లడించారు.

అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ చేసిన ఆర్థిక మోసానికి సుమారు 600 పైగా బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని... ఇప్పటికీ రాష్ట్రంలో ఏదో మూల అగ్రిగోల్డ్ బాధితుల మరణాలు జరగడం బాధాకరమన్నారు. బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు రాష్ట్రవ్యాప్తంగా 33 రోజులపాటు బస్సు యాత్ర చేపట్టి 180కి పైగా కేంద్రాలలో అసోసియేషన్ అధ్వర్యంలో సభలు నిర్వహించామని చెప్పారు. వేలాది మంది బాధితులను సమీకరించి సాగించిన పోరాట ఫలితంగా నాటి చంద్రబాబు ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను అటాచ్‌మెంట్ చేసిందని, మరణించిన 142 మంది బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా యాజమాన్య కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న ఆస్తులు, బినామీల పేర్లతో ఉన్న ఆస్తులు అటాచ్ చేయకుండా మిగిలిపోయాయని చెప్పారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా పువ్వుల్లో పెట్టి ఇస్తానని హామీ ఇచ్చి... అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లు కొల్లగొట్టారని, అధికారంలోకి వచ్చాక కేవలం రూ.906 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు త్వరలోనే న్యాయం జరుగుతుందనే భరోసాను ముప్పాళ్ల నాగేశ్వరరావు నాయకత్వంలో అసోసియేషన్ సాగించే మహత్తర పోరాటం బాధితులకు ఇస్తోందన్నారు. ఈ ఉద్యమానికి రైతు సంఘం తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఉత్తేజపరిచాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, నాయకులు వి.హనుమారెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఏపీలో పెట్టుబడులకు సీపీటీ ఆసక్తి

మంత్రి లోకేశ్‌తో కంపెనీ ఎండీ రాజు వేగేశ్న భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి సిఫీ టెక్నాలజీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజు వేగేశ్న ఆసక్తి కనబర్చారు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం కలిసిన సందర్భంగా ఈ విషయం తెలిపారు. రాజు వేగేశ్న మాట్లాడుతూ సిఫీ టెక్నాలజీస్ సంస్థ దేశంలో ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒకటిగా ఉందని, దేశంలోని వివిధ నగరాల్లో ఉన్న అనేక కంపెనీలు, బ్యాంకులతో సహా నార్త్ అమెరికా, బ్రిటన్, సింగపూర్‌లోని వివిధ కంపెనీలకు సిఫీ డేటా సర్వీసెస్ అందిస్తుందని మంత్రి లోకేశ్‌కు వివరించారు. కంపెనీ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాల గురించి ఆయన లోకేశ్‌తో చర్చించారు. విశాఖపట్నంలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రస్తుతం ఉన్న అవకాశాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, నూతనంగా తీసుకొచ్చిన ఐటీ పాలసీల గురించి మంత్రి లోకేశ్ వివరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న సుముఖత వ్యక్తం చేశారు. ఆర్థిక అభివృద్ధి బోర్డుతో చర్చించి తదుపరి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఫీ ప్రతినిధులను లోకేశ్ కోరారు.

26న 'కొలకలూరి' పురస్కారాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: 'కొలకలూరి' పురస్కారాల (2025) ప్రదానోత్సవాన్ని ఈ నెల 26వ తేదీ సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమకిరణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత 18 సంవత్సరాలుగా సాహిత్యంలో నిష్ణాతులైన ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది సుప్రసిద్ధ సాహిత్య స్రష్టల గ్రంథాలు పరిశీలించిన న్యాయనిర్ణేతలు ఆచార్య మేడిపల్లి రవికుమార్, ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ, ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు నిర్ణయానుసారంగా పురస్కారాలకు ఎంపికైన ముగ్గురు రచయితలను నగదు, జ్ఞాపికలతో సత్కరిస్తున్నట్టు వారు వివరించారు. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారం "ఒక కప్పుచాయ్-నాలుగు మెసేజ్లు" కవి జూకంటి జగన్నాథం, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం "స్వర్గాదపి గరీయసీ" నాటకకర్త డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం "చిందోళ్ల చరిత్ర, సంస్కృతి-సాహిత్యం" పరిశోధకుడు డాక్టర్ గడ్డం మోహన్‌రావుకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రూ.15 వేల నగదుతో పాటు జ్ఞాపికను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఆచార్య వై. రెడ్డి శ్యామల, ఆచార్య పిల్లలమర్రి శ్రీరాములు, పురస్కారాల పోటీకి తమ రచనలు పంపిన సహృదయ సుప్రసిద్ధ సాహితీ స్రష్టలకు ధన్యవాదాలు తెలిపారు.

ఇది సమయం కాదు

మోదీ ఫ్రాన్స్ పర్యటనపై సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూదిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించడానికి ఇది సరైన సమయం కాదని సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ అన్నారు. 14వ భారత్-ఫ్రాన్స్ సీఈవోల ఫోరంలో పాల్గొనేందుకుగాను మోదీ పారిస్ వెళ్లారు. దీనిపై సంతోశ్ కుమార్ విమర్శలు గుప్పించారు. 'మోదీ ఫ్రాన్స్ పర్యటనకు ఇది సరైన సమయం కాదు. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉంది. దేశ విదేశీ, అంతర్గత రుణాలు భారీగా పెరుగుతున్నాయి. ఐదేళ్లలో ఆర్థిక సంక్షోభం మరింత ముదిరింది. ఆర్థిక లోటు పెరిగింది. జీడీపీ కూడా పెరిగింది' అని సంతోశ్ కుమార్ అన్నారు. దిల్లీలో జేపీ నడ్డాతో బీజేపీ ఎంపీల భేటీని ప్రస్తావిస్తూ అధికారం కోసం వెంపర్లాడే పార్టీ అదని వ్యాఖ్యానించారు. ఒకటి లేక రెండేళ్లలో అసంతృప్తిపరుల సమూహంగా బీజేపీ మారుతుందన్నారు. 'అధికారం ఉంది... నాయకులు బలంగా ఉన్నారు కాబట్టి చాలా మందికి ఇది తాత్కాలిక సర్దుబాటే' అని సంతోశ్ అభిప్రాయపడ్డారు. బీజేపీకి గుర్తింపు వచ్చినది నాయకత్వం వల్ల కాదు... నాయకత్వాన్ని ఉక్కు పిడికిలితో బిగించి ఉంచినందుకే అని సంతోశ్ కుమార్ దుయ్యబట్టారు.

ఐక్యతే అజెండా

ఎస్‌కేఎంతో కేఎంఎం భేటీ

చండీగఢ్: ఐక్యతే అజెండాగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు కిసాన్ జమ్దూర్ మోర్చా (కేఎంఎం) నాయకులు బుధవారం సమావేశమయ్యారు. కలిసి ముందుకెళ్లే విధంగా సాగిన చర్చల్లో కొంత మేరకు పురోగతి సాధించినట్లు వారు తెలిపారు. అయితే సమావేశానికి ఎస్‌కేఎం (నాన్ పొలిటికల్) ప్రతినిధులు హాజరు కాలేదు. ఖనౌరీ వద్ద బుధవారం కిసాన్ మహాపంచాయత్ కారణంగా వారు రాలేకపోయారని సమావేశానికి హాజరైన కేఎంఎం నాయకుడు సర్వర్ సింగ్ పంధేర్ వెల్లడించారు. ఎస్‌పిఎం (నాన్ పొలిటికల్), కేఎంఎం సంయుక్తంగా శంభు-ఖనౌరీ సరిహద్దు వల రైతాంగ ఉద్యమాన్ని నడిపించాయి. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో సహా అనేక డిమాండ్లు చేశాయి. కేంద్ర ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడటం కోసం చర్చలు జరిపేందుకుగాను రెండు సంఘాలను ఎస్‌కేఎం ఆహ్వానించింది. ఇంతకుముందు జనవరి 13, 18 తేదీల్లో జరిగిన సమావేశాలు అభిప్రాయ బేధాల వల్ల అర్ధాంతరంగా ముగిశాయి. ఎస్‌కేఎం సీనియర్ నేత జోగిందర్ సింగ్ ఉగ్రాహన్ విలేకరులతో మాట్లాడుతూ రైతుల ఐక్యతపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని చెప్పారు. 'సమావేశానికి కేఎంఎం ప్రతినిధులు వచ్చారు. వారు ఎస్‌కేఎం (నాన్-పొలిటికల్) ప్రతినిధులతో మాట్లాడారు. సంప్రదింపుల తర్వాత తదుపరి సమావేశం జరుగుతుంది. ఎస్‌కేఎం, ఎస్‌కేఎం (నాన్ పొలిటికల్), కేఎంఎం మధ్య కుదిరే అవగాహనతో భవిష్యత్ కార్యాచరణ రూపొందుతుంది' అని అన్నారు. రైతుల డిమాండ్ల సాధన కోసం జరగబోయే అతిపెద్ద ఉద్యమంలో కలిసి ముందుకెళ్లాలని తామంతా భావిస్తున్నట్లు ఉగ్రాహన్ తెలిపారు. పంధేర్ మాట్లాడుతూ చర్చలు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు. 'మహా పంచాయత్‌తో బీజీగా ఉన్నందున ఎస్‌కేఎం (నాన్ పొలిటికల్) ప్రతినిధులు రాలేకపోయారు. మేము వారితో మాట్లాడి... తదుపరి సమావేశం ఎప్పుడో నిర్ణయిస్తాం' అని అన్నారు. 'అన్ని సంఘాల మధ్య ఐక్యతను ప్రజలు కోరుకుంటున్నారు. మూడు నల్ల సాగు చట్టాల రద్దు కోసం జరిగిన పోరాటమప్పుడు ఉన్న ఐక్యతను మేము ఇప్పుడూ ఆశిస్తున్నాం. గత ఉద్యమం నేర్పిన పాఠాలపైనా చర్చించాం' అని చెప్పారు.

ఖనౌరీ వద్ద కిసాన్ మహా పంచాయత్: దిల్లీకి కదం తొక్కిన తమను భద్రతా బలగాలు నిలువరించడంతో ఖనౌరీ సరిహద్దు వద్దనే రైతులు ఆందోళనకు దిగారు. ఇందుకు ఏడాది అయింది. ఈ సందర్భంగా బుధవారం కిసాన్ మహాపంచాయత్ నిర్వహించారు. తమ పోరాటాన్ని మరింత బలంగా సాగించాలని, అన్ని డిమాండ్ల పరిష్కారానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని రైతులు సంకల్పించారు. రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆక్షేపించారు. సాగు చట్టాల రద్దునకు సాగిన ఉద్యమం తరహా ఐక్యపోరాటాన్ని ఆకాంక్షించారు. తద్వారా పెండింగ్ డిమాండ్లు పరిష్కరించేలా మోదీ ప్రభుత్వం మెడలు వంచాలని రైతులు ప్రతిజ్ఞ బూనారు. తమ పోరాటంలో కలిసి రావాలంటూ అన్ని వర్గాలకు రైతు నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

బల్దేవ్ సింగ్ సిర్సాకు గుండెపోటు: మహా పంచాయత్‌లో పాల్గొన్న సీనియర్ రైతు నాయకుడు బల్దేవ్ సింగ్ సిర్సా అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరారు. సిర్సా బీపీ పడిపోయిందని, ఆయన అసౌకర్యానికి గురయ్యారని ఆందోళన స్థలిలోని ఎన్‌జీవో వైద్యులు తెలిపారు. ఎలక్ట్రోకార్డియోగ్రామ్ నిర్వహించగా గుండె సమస్య ఉన్నట్లు తెలిసిందన్నారు. దీంతో ఆయనను అంబులెన్సులో పాటియాలా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంతకుముందు కూడా ఆయన ఇబ్బంది పడగా పాటియాలాలోని రాజింద్రా ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు ఎన్‌జీవో వైద్యులు చెప్పారు. కాగా, ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో సిర్సా ఉన్నట్లు రైతు నాయకులు తెలిపారు.

వెటర్నరీ విద్యార్థుల స్టయిఫండ్ పెంచాలి

కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-గన్నవరం: వైద్య విద్యార్థులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు స్టయిఫండ్ ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసరపల్లిలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల విద్యార్థులు స్టయిఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ పది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. కేవీవీ ప్రసాద్, సీపీఐ గన్నవరం పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జి, నాయకులు యుగంధర్, సుభాని, ప్రభాకర్, సాయికుమార్, నరసింహారావు బుధవారం విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ 13 ఏళ్లుగా వెటర్నరీ విద్యార్థులకు రూ.7 వేల స్టయిఫండ్ ఇస్తున్నారని, అవి ఎటూ చాలడం లేదన్నారు. అయితే విద్యార్థుల ఫీజులు 13 ఏళ్ల క్రితం రూ.10 వేల నుంచి రూ.45 వేల వరకు పెంచుతూ వచ్చారని తెలిపారు. వైద్య కళాశాల విద్యార్థులకు స్టయిఫండ్ పెంచి, వెటర్నరీ విద్యార్థులకు రూ.7 వేలు మాత్రమే ఇవ్వడం దారుణమని విమర్శించారు. రాజస్తాన్‌లో రూ.24,000, ఉత్తర ప్రదేశ్‌లో రూ.23,500, పశ్చిమ బెంగాల్‌లో రూ.20,000, కేరళలో రూ.20,000 ఇస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో మంత్రి ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని మండిపడ్డారు. విద్యార్థులతో బేరసారాలు కాకుండా సమస్యను పరిష్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం మంత్రి నారా లోకేశ్ వెటర్నరీ విద్యార్థుల సమస్యలపై స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి మద్దతుగా ఉంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో పశువుల రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పాలు, మాంసం గుడ్లు, ఇతర జంతువుల ఉత్పత్తిని అమ్మకాల ద్వారా సుమారు కోట్లాది రూపాయలు సమకూరుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వెటర్నరీ విద్యార్థులకు అన్యాయం చేయడం తగదని, వెంటనే సంబంధిత మంత్రి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ వెటర్నరీ విద్యార్థులు స్టయిఫండ్ చాలక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని అన్నారు.

కనీస వేతనం రూ.35 వేలు

ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ డిమాండ్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోని అన్ని రంగాల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు తదితర కార్మికులకు రూ.35వేల కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ సమావేశాలు గోవాలోని మార్ గోవా రెసిడెన్సీలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రామేంద్ర కుమార్ సమావేశానికి అధ్యక్షత వహించగా, జాతీయ రాజకీయ, ఆర్థిక అంశాలపై నివేదికను, కార్యక్రమాలపై నివేదికను ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రవేశపెట్టారు. వివిధ రాష్ట్రాల నాయకులు చర్చల్లో భాగస్వాములయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, కోశాధికారి బీవీవీ కొండలరావు పాల్గొన్నారు. కొండలరావు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు స్కూటర్, ట్రాక్టర్ ర్యాలీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 5వ తేదీన కేంద్ర బడ్జెట్‌కి నిరసనగా లేబర్ కోడుల అమలకు వ్యతిరేకంగా నిరసనలను చేపట్టి, బడ్జెట్ల ప్రతులను దగ్ధం చేశామని చెప్పారు. మెడికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ మహాసభ, బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ మహాసభ, స్కూల్ ఆయాల స్వీపర్ల మహాసభలు నిర్వహించామని తెలిపారు. కొన్ని రంగాల జిల్లా స్థాయి మహాసభలకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23న అన్ని రాజకీయ పక్షాలను, కార్మిక సంఘాలను ఒక్క వేదికపైకి తెచ్చి రౌండ్ టేబుల్ నిర్వహిస్తున్నట్లు కొండలరావు తెలిపారు. మార్చి 18న దిల్లీలో జరిగే జాతీయ సదస్సుకు రాష్ట్ర ప్రతినిధులను పంపుతామని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కోసం మార్చి 28న చలో దిల్లీ, అంగన్‌వాడీ సమస్యలపై ఈనెల 22న భువనేశ్వర్‌లో సమావేశాల జయప్రదానికి పిలుపునిచ్చారు. వేతనాల-కార్మిక సంక్షేమ బోర్డులు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం-1996 బోర్డులు వేయకుండా కాలయాపన చేస్తున్నారని అధికారుల తీరును ఆక్షేపించారు. కనీస వేతనం కోసం రాష్ట్రంలో పోరాటం చేస్తామని, భవిష్యత్‌లో సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతామని తెలిపారు. కార్మిక వర్గాన్ని రాజకీయంగా చైతన్యం చేయడానికి వేసవిలో సైద్ధాంతిక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కొండల రావు తెలిపారు. సీపీఐ శతవసంతాల సందర్భంగా మూడు ప్రాంతీయ సదస్సులను అంశాల వారీగా నిర్వహించబోతున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నివేదికను కొండలరావు ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రామకృష్ణ పాండా, వివిధ రాష్ట్రాల నాయకులు గిరి, దామ్లే, యూసఫ్, క్రిస్టఫర్ స్నేకా హాజరయ్యారు.

సీబీఐ విచారణకు నో

తిరుపతి తొక్కిసలాటపై పిల్ కొట్టివేసిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద స్వామివారి టికెట్ల జారీకి ముందు జరిగిన తొక్కిసలాటపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ ఘటనపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతో, వేరే విచారణ అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే అంశంపై మరో పిల్ కూడా దాఖలైంది. దీనిని సైతం హైకోర్టు కొట్టివేసింది. టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటపై సీబీఐ విచారణ జరపాలంటూ కర్నూలుకు చెందిన ప్రభాకర్ రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేశారు. జనవరి 10వ తేదీ ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో 10 రోజుల పాటు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. జనవరి 9వ తేదీ తెల్లవారుజాము నుంచి టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. తిరుపతిలోని ఎనిమిది ప్రాంతాల్లో 94 టోకెన్ జారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పిల్లాపాపలతో సహా భారీగా తిరుపతికి చేరుకున్నారు. బైరాగి పట్టెడ కేంద్రంలోని సిబ్బందిలో ఒకరు అస్వస్థతకు గురయ్యారు. అతడిని ఆసుపత్రికి తరలించేందుకు క్యూలైన్ గేట్‌ను తెరవడంతో తొక్కిసలాట జరిగింది. ఆరుగురు చనిపోయారు. ఇదిలావుంటే, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్ట విరుద్ధమన్న పిటీషన్‌పై విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ

- ఫైనల్స్‌లో కేరళ, కర్నాటక
- సెమీస్‌లో ఏపీ-తెలంగాణ, తమిళనాడు జట్ల పరాజయం

విశాలాంధ్ర-మంగళగిరి: విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, ఇండియన్ ఆడిట్స్, అకౌంట్ డిపార్ట్‌మెంట్ అధ్వర్యాన మంగళగిరి ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీలో భాగంగా మూడో రోజు బుధవారం జరిగిన రెండు సెమీ ఫైనల్ మ్యాచ్‌లు ఆద్యంతం ఆసక్తిగా సాగాయి. తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ తమిళనాడు- కేరళ జట్ల మధ్య జరగగా, రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఆంధ్ర-తెలంగాణ జట్టు, కర్నాటక జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కేరళ, కర్నాటక జట్లు సెమీ ఫైనల్ మ్యాచ్‌ల్లో విజేతలుగా నిలిచి ఫైనల్‌కు చేరాయి. ఉదయం కేరళ, తమిళనాడు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన కేరళ ఫీల్డింగ్‌ను ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు నిర్దేశిత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 172 పరుగులు చేసింది. బ్యాటర్ వేదాంత్ భరద్వాజ్ అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ 56 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 81 పరుగులు చేశారు. అంకిత్ మిశ్రా 3 ఓవర్లలో 32 పరుగులు ఇచ్చి 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు కేవలం 17.4 ఓవర్లలోనే భారీ లక్ష్యాన్ని ఛేదించింది. . కేరళ బ్యాటర్ సచిన్ సురేష్ 39 బంతుల్లోనే 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62 పరుగులు చేయగా, ఎంఎస్ అఖిల్ 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు కొట్టి 55 పరుగులు చేసి జట్టును మ్యాచ్‌ను విజయపథంలో నడిపించారు. తమిళనాడు బౌలర్ విఘ్నేష్ 4 ఓవర్లలో 20 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశారు. మధ్యాహ్నం ఆంధ్రా-తెలంగాణ వర్సెస్ కర్నాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నాటక టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకుంది. .మొదట బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర-తెలంగాణ జట్టు నిర్దేశిత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. బ్యాటర్ ఎస్.తరుణ్ 28 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 36 పరుగులు చేశారు. కర్నాటక బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఎప్పటికప్పుడు వికెట్లు తీస్తూ భారీ స్కోరు చేయనీయకుండా అడ్డుకున్నారు. ఏఎం కిరణ్ 4 ఓవర్లలో 28 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీయగా, అర్జున్ గౌడ 3 వికెట్లు తీసి 38 పరుగులు ఇచ్చారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నాటక మరో 15 బంతులు మిగిలి ఉండగానే 17.3 ఓవర్లలో నిర్దేశిత లక్ష్యం ఛేదించి విజయం సాధించింది. ఆ జట్టులో బ్యాటర్ జె.సుచిత్ 38 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచారు. ఆంధ్రా-తెలంగాణ జట్టులో కె.భీమా రావు 3 ఓవర్లలో 29 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో గెలిచిన కర్నాటక-కేరళ జట్ల మధ్య గురువారం ఉదయం 9.30 గంటలకు ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టోర్నీలో మొదటి నుంచి కర్నాటక, కేరళ జట్ల ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన చేస్తూ జట్లను గెలిపిస్తూ వచ్చారు. గురువారం జరిగే ఫైనల్ పోటాపోటీగా సాగనుంది. విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృ త్వంలో ఇండియన్ ఆడిట్స్, అకౌంట్ డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో తొలిసారి జరుగుతున్న సౌత్ జోన్ టోర్నమెంట్‌లో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగే ముగింపు వేడుకకు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. విజేతగా నిలిచే జట్టుకు ఛాంపియన్ ట్రోఫీని అందజేయనున్నారు.

అర్హులందరికీ ఇళ్లు: కొలుసు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వైసీపీ హయాంలో సకాలంలో ఇళ్ల పూర్తి చేయకపోవడం వల్ల సుమారు రూ.2,378 కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయాయని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రాష్ట్ర సచివాలయ ప్రచార విభాగంలో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గృహ నిర్మాణ నిధులు రూ.3,598 కోట్లు దారిమళ్లించి నిరుపేదలకు అన్యాయం చేసిన ఘనత గత ప్రభుత్వానిదే అన్నారు. అర్హులకు శాశ్వత గృహ వసతి కల్పించడంలో విఫలమైన గత పాలకులు తమ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. గృహ నిర్మాణాలకు కేంద్రం రూ.20,726 కోట్లు కేటాయిస్తే, ఆ నిధులను సక్రమంగా వినియోగించుకోకపోవడం వల్ల రూ.2,378 కోట్ల నిధులు వృధా అయ్యాయన్నారు. రాబోయే ఐదేళ్లలో అర్హులందరికీ శాశ్వత గృహ వసతి కల్పించాలనే దృఢ నిశ్చయంతో తమ ప్రభుత్వం ఉందన్నారు. 1.15 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందని, 7.35 లక్షల గృహాల్లో 1.50 లక్షల గృహాలను జూన్ మాసాంతానికి పూర్తి చేయాలనే లక్ష్యాన్నినిర్దేశించినట్టు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.